

పిల్లలు


నీతి కథలు,పాటలు,పెంపకం

పుష్పాంజలి-బాలలకు నీతిబోధ








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వారి వెబ్ సైట్: http://www.unworldliness.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **రామ కృష్ణ సేవా సమితి బాపట్ల** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

రామ కృష్ణ సేవా సమితి బాపట్ల వారి వెబ్ సైట్:

http://www.unworldliness.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

పుష్పాంజలి

(బాలల నీతికథలు)



శ్రీరామకృష్ణ సేవా సమితి - బాపట్ల

పుష్పాంజలి
(బాలలకు నీతిబోధ)

ప్రకాశకులు
శ్రీరామకృష్ణ సేవా సమితి,
బాపట్ల – 522 101.

ప్రథమ ప్రచురణ:	జనవరి, 1984	5000 ప్రతులు
ద్వితీయ ప్రచురణ:	జనవరి, 2004	3000 ప్రతులు
పునర్ముద్రణలు	మార్చి, 2004	3000 ప్రతులు
	ఆగష్టు, 2004	3000 ప్రతులు
	నవంబరు, 2005	3000 ప్రతులు
	ఫిబ్రవరి, 2007	3000 ప్రతులు

ప్రతులకు
శ్రీరామకృష్ణ సేవా సమితి,
విజయలక్ష్మీపురం, బాపట్ల – 522 101
email : rksamithibapatla@gmail.com
visit us at : www.unworldliness.org

నివేదన

(మొదటి ప్రచురణకు ప్రకాశకుల మనవి)

చిన్నపిల్లలు వికసించబోతున్న పలురకముల సుందరపుష్పాలు. వారు పెరిగి, పెద్దవారై పుష్టిగల సుగంధములను నలువైపులా గుబాళించుటకు వారికి మంచి ఆస్తిక భావముల నివ్వవలెను. మంచి భావములవల్ల మంచి అలవాట్లు, మంచి అలవాట్ల వల్ల మంచి నడవడిక రూపొందుతాయి.

వికాసము వెలినుండిగాక లోనుండి రావాలి. వ్యతిరేకభావాలకు చోటివ్వక ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించేవే ఇందు కూర్పబడినవి. శ్రీరామకృష్ణ సేవాసమితిలో పిల్లలకు చెప్పుచూ అనేక సంవత్సరములుగా కూర్చుకొనుచు వచ్చిన భావ సంకలనమే ఈ “పుష్పాంజలి”.

తేట తెనుగు మాటలు, పాటలు, పద్యాలు, శ్లోకాలు, మన సంస్కృతిని స్ఫురింపజేసే కథలు ఇందులో చేర్చబడ్డాయి.

విజ్ఞులు బహువిధాలుగా వచించిన ఒకే సత్యస్వరూపుడైన పరమాత్మకు మేము అర్పించుచున్న ఈ “పుష్పాంజలి” పాఠశాలలలోని చిన్నారులకు సమగ్రమైన నీతిబోధక గ్రంథముగా ఉపకరించి, చిన్న పిల్లలలో ఏ కొందరినైనా తన పూజా పుష్పాలుగా రూపొందిస్తే మా కృషి ఫలించినట్లే!

వివేకానంద జయంతి, ప్రకాశకులు
పుష్య బహుళ సప్తమి,
రుధిరోద్గారి, 24.01.1984.

రెండవ ప్రచురణకు ప్రకాశకుల మనవి

"నాకు మీరు వద్దు, మీ కొడుకు వద్దు! మీ మనవడు కావాలి!" అని పూజ్య యతీశ్వరానంద స్వామి అనేవారని శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు గారు చెప్పేవారు. వారి నుంచి పొందిన స్ఫూర్తితో ఆయన 'పుష్పాంజలి' పుస్తకాన్ని ముద్రించారు. భారతీయ సంస్కృతిని బాలలకు చేరువగా తీసుకురావడానికి ఆయన చేసిన కృషిలో ఒక భాగమే ఈ పుస్తకం.

శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులుగారు సమితి కార్యక్రమాలలో ఒక ముఖ్యమైన భాగంగా బాలలకు శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని "బాలవిహార్" పేరుతో నిర్వహించారు. అదే కార్యక్రమం సమితిలో సమధికోత్సాహంతో ఇప్పటికీ నిర్వహించబడుతున్నది. 'పుష్పాంజలి' పాత ప్రచురణలోని విషయాలతోపాటు ఇప్పుడు బాలలకు క్రొత్తగా నేర్పబడుతున్న అనేక విషయాలు ఈ క్రొత్త ప్రచురణలో చోటు చేసుకున్నాయి.

ఈ పుస్తకం బాపట్లలో సమితి నిర్వహిస్తున్న పాఠశాలస్థాయి "వివేకానంద సాంస్కృతిక బహుమతుల పోటీల"లోని కొన్ని అంశాలకు పాఠ్యపుస్తకంగా ఉపయోగించబడుతున్నది.

బాలలకు సరైన మార్గం ఏదో చక్కగా తెలియజెప్పే అనేక క్రొత్త కథలు; దాశరథి, శ్రీకాళహస్తీశ్వర, భాస్కర శతకాలలోని కొన్ని పద్యాలు; భర్తృహరి సుభాషితాలు, వాటికి తెలుగు అనువాదాలైన ఏనుగులక్ష్మణకవి పద్యాలు కొన్ని ఎంచి కూర్చబడ్డాయి. నీతిశ్లోకాలు కొన్ని అదనంగా చేర్చబడ్డాయి. వాటికి సరళమైన తెలుగులో భావం ఇవ్వబడింది. క్రొత్తగా భగవద్గీత నుండి మూడు అధ్యాయాలు చేర్చబడ్డాయి.

మొదటి ప్రచురణలో వివేకానంద స్వామి సూక్తులు గ్రాంథికభాషలో ఇవ్వబడ్డాయి. అవి యథాతథంగా ఈ ప్రచురణలో చేర్చబడ్డాయి. బాలల ఉపయోగార్థం మరికొన్ని వివేకానంద స్వామి సూక్తులు సరళభాషలో వాటికి చేర్చబడ్డాయి.

సమితి ఇంతకు ముందు చిరుపుస్తకాలుగా ప్రచురించిన 'లేవండోయ్ లేవండి!', 'మహావ్యక్తి కథ' అనేవి ఇదే పుస్తకంలో పొందుపరచబడ్డాయి. 'లేవండోయ్ లేవండి!' అనే పుస్తకం శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులుగారు స్వామి వివేకానందుల బోధనలను గీతాలుగా రచించిన పుస్తకం. 'మహావ్యక్తి కథ'

శ్రీ నండూరి రామమోహనరావు గారిచేత రచించబడిన వివేకానంద స్వామి సంక్షిప్త జీవిత చరిత్ర.

బాలలకు మరింత ప్రయోజనాన్ని కలిగించే ఉద్దేశ్యంతో మరిన్ని క్రొత్త చిత్రాలు ఇందులో పొందుపరచబడ్డాయి. అంతేకాక ప్రతి కథకు నీతితోపాటు వీలైన చోట ఆయా కథలను మరింత చక్కగా వివరించడానికి, ప్రస్తుత కాలంలోని జీవనవిధానానికి అనుగుణంగా వాటిలోని నీతిని ఆకళింపు చేసుకోవడానికి శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందులు చెప్పిన బోధనలను చేర్చడం జరిగింది.

వివేకానంద జయంతి, ప్రకాశకులు
పుష్య బహుళ సప్తమి,
స్వభాను, 14-1-2004

కృతజ్ఞతలు

ఈ పుస్తకానికి తమ శుభాశీస్సులనిచ్చిన శ్రీరామకృష్ణ మఠ, మిషనుల అధ్యక్షులు పరమపూజ్య శ్రీమత్ స్వామి రంగనాథానందజీ మహరాజ్‌వారికి మా హృదయ పూర్వక ప్రణామములు.

మొదటి ప్రచురణకు అత్యంత ఆకర్షణీయంగా ముఖచిత్రాన్ని తీర్చిదిద్ది ఇచ్చిన ప్రముఖకళాకారులు శ్రీ 'బాపు'గారికి మా కృతజ్ఞతలు. ఈ ప్రచురణలో ఆ చిత్రం మొదటి పేజీలో ఉన్నది.

ఈ పుస్తకంలో పొందుపరచబడిన కొన్ని పద్యాలను వివేకానంద సూక్తుల ఆధారంగా శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు (బాపట్ల), శ్రీ చిరువోలు విజయ నరసింహారావుగారు (రాజమండ్రి) రచించి ఇచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.

వ్రాతప్రతిని సరిచూసిన శ్రీ గట్టుపల్లి నారాయణగారికి, శ్రీ నెమ్మాని సీతారామయ్యగారికి, ఇతరులకు మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలో ప్రచురించబడిన కొన్ని చిత్రాలను వేసి ఇచ్చిన శ్రీ వి.నాగేంద్రనాథ్ గారికి, శ్రీ వి.వి. రామారావుగారికి మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకముద్రణ సందర్భముగా మాకు తోడ్పడిన మిత్రులందరికీ మా కృతజ్ఞతలు. వీరందరికీ అన్ని శ్రేయస్సులనూ కలిగించాలని ఆ సర్వేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాము.

ప్రకాశకులు

RAMAKRISHNA MATH
Ramakrishna Math Marg
Domalguda
Hyderabad-500 029
Phone :

Gita Jayanti Day | 6-12-83

Foreword

I am glad to find that Sri B.S.R. Anjaneyulu of Sri Ramakrishna Seva Samiti, Bapatla, has brought out the book Pushpanjali, for inspiring our children in Andhra Pradesh with ethical, humanistic, and spiritual ideas. He had already brought out several inspiring books for children priced cheap. This Pushpanjali now comes enriching that series, with a variety of themes expressed in Telugu poems, songs, and hymns, and in Sanskrit with simple Telugu translations, including some verses from the Bhagavad-Gita. There are also prose passages which include, among other items, some of the parables of Sri Ramakrishna.

I hope our children in Andhra Pradesh will enjoy reading this book and benefit from it; it has a message not only to our children but also to our youths and elders.

Swami Ranganathananda

RAMAKRISHNA MATH
Ramakrishna Math Marg
Domalguda
Hyderabad-500 029
Phone: 63936 / 63937
Gita Jayanti Day: 16-12-83

ముందుమాట

ఆంధ్రప్రదేశ్‌లోని మన పిల్లలను నైతిక, మానవీయ, ఆధ్యాత్మిక భావాలతో ఉత్తేజపరచడం కోసం బాపట్ల శ్రీరామకృష్ణ సేవాసమితికి చెందిన శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు "పుష్పాంజలి" అనే ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. చిన్న పిల్లలకోసం, వారిని ఉత్తేజపరచే అనేక పుస్తకాలను ఆయన ఇంతకుముందే తక్కువ ఖరీదులో ప్రకటించారు. ఆ పుస్తకాల శ్రేణికి శోభను చేకూరుస్తూ ఇప్పుడు ఈ "పుష్పాంజలి" వెలువడుతోంది.

తెలుగు పద్యాలు, పాటలు, గేయాలు, సరళమయిన తెలుగులోకి అనువదించబడ్డ సంస్కృత శ్లోకాలు, భగవద్గీతలోని కొన్ని అధ్యాయాలు ఇందులో పొందుపరచబడ్డాయి. వచనభాగంలో ఇతర విషయాలతోపాటు శ్రీరామకృష్ణులు చెప్పిన కథలు కూడా చోటు చేసుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని మన పిల్లలు దీనిని చదివి ఆనందిస్తారని, దీనివల్ల లాభం పొందగలరని నేను ఆశిస్తున్నాను. మన పిల్లలకు మాత్రమే గాక మన యువతకు, పెద్దవారికి కూడా ఈ పుస్తకంలో సందేశముంది.

Swami Ranganathananda

స్వామి రంగనాథానంద

రామకృష్ణ మఠం,
దోమలగూడా, హైదరాబాదు-29
గీతాజయంతి, 16.12.1983.

విషయసూచిక

నుతి

ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయేత్ ॥

(తెల్లని వస్త్రములు ధరించినవాడు, అంతటా ఉండేవాడు, తెల్లని శరీరచ్ఛాయ కలిగినవాడు, ఎల్లప్పుడూ ప్రసన్నమైన వదనంతో ఉండేవాడు అయిన మహాగణపతికి నమస్కరించినంతనే సర్వ విఘ్నాలూ ఉపశమిస్తాయి.)

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ ।
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్ భవతు మే సదా ॥

(కోరికలన్నింటినీ తీర్చే తల్లివి, కోరికలకే రూపమైన ఓ సరస్వతీ! నీకు నమస్కరించి చదువు ప్రారంభిస్తున్నాను. దయచేసి ఎల్లవేళలా నా ప్రయత్నాన్ని ఫలింపచెయ్యి!

గురుర్ బ్రహ్మా గురుర్ విష్ణుః గురుర్ దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీగురవే నమః ॥

(గురువే బ్రహ్మ. గురువే విష్ణువు. గురువే దైవం, గురువే మహేశ్వరుడు. గురువే సాక్షాత్తూ ఆ పరబ్రహ్మ. అటువంటి శ్రీసద్గురువుకు నా నమస్కారములు.)

ఓం సహనావవతు । సహనౌభునక్తు । సహవీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ।
ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

(గురుశిష్యులమైన మన ఇద్దరినీ ఆ దైవం కాపాడాలి! ఆ దైవం మన ఇద్దరికీ పుష్టి కలిగించాలి. మనమిద్దరమూ గొప్పశక్తితో కలసి పనిచేయాలి! మన సాధన తేజోవంతమూ, ఫలవంతమూ కావాలి! మనమిద్దరమూ ఒకరినొకరు ద్వేషించుకోకుండా ఉండాలి! ముల్లోకాలలోనూ శాంతి విలసిల్లాలి!)

ఓం భూర్ భువః సువః తత్సవితుర్ వరేణ్యమ్ ।
భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ ॥

(ఇది గాయత్రీ మంత్రము. ఈ విశ్వాన్ని సృష్టించిన ఆ సర్వేశ్వరుణ్ణి మేము ధ్యానిస్తున్నాము. అతడు మా మనస్సులను వికసింపజేయు గాక!)

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః ।
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్ దుఃఖభాగ్ భవేత్ ॥

(అందరూ సంతోషంగా ఉండాలి! అందరూ సంపూర్ణమైన ఆరోగ్యంతో జీవించాలి! మంచియేదో, సన్మార్గమేదో అందరూ తెలుసుకోవాలి! ఎవరూ బాధలకు గురికాకుండా ఉండాలి!)



శ్రీరామకృష్ణ పరమహంస

దుర్జనః సజ్జనో భూయాత్ సజ్జనః శాంతిమాప్నుయాత్ ।

శాంతో ముచ్యేత బంధేభ్యో ముక్తశ్చాన్యాన్ విమోచయేత్ ॥

(చెడ్డవారు మంచివారు కావాలి! మంచివారు శాంతిని పొందాలి! శాంతిని పొందినవారు బంధాలనుండి విముక్తులు కావాలి! ముక్తిని పొందినవారు ఇతరులకు కూడా ముక్తిని కలిగించాలి!)

ఓం అసతో మా సద్గమయ । తమసో మా జ్యోతిర్గమయ ।

మృత్యోర్మా అమృతం గమయ ॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

(అసత్యం నుండి సత్యానికి నాకు త్రోవ చూపించు! చీకటిలోనుండి వెలుతురులోనికి దారి చూపించు! మరణం నుంచి అమృతత్వానికి మార్గాన్ని చూపించు! ముల్లోకాలలోనూ శాంతి విలసిల్లు గాక!)

ఓం తేజోఽసి తేజో మయి ధేహి।

వీర్యమసి వీర్యం మయి ధేహి।

బలమసి బలం మయి ధేహి।

ఓజోఽసి ఓజో మయి ధేహి।

మన్యురసి మన్యుం మయి ధేహి।

సహోఽసి సహో మయి ధేహి॥

(ఓం! ఓ దేవా! నీవు అనంతశక్తి స్వరూపుడవు. ఆ శక్తిని నాలో నింపు! నీవు అనంత తేజోస్వరూపుడవు. ఆ తేజస్సును నాకు ఇవ్వు! నీవు అనంత బలస్వరూపుడవు. ఆ బలాన్ని నాకు అందించు! నీవు అనంతమైన ఓజశ్శక్తి సంపన్నుడవు. ఆ ఓజస్సును నాకు ప్రసాదించు! నీవు అనంత ధైర్యస్వరూపుడవు. ఆ ధైర్యాన్ని నాలో కలిగించు! నీవు అనంతమైన ఓరిమి కలవాడివి. నన్ను ఆ ఓరిమితో నింపివెయ్యి!)

త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ ।

త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ ॥

(నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే నా బంధువు, స్నేహితుడవు. నీవే నా విద్య, ధనం. ఓ దేవదేవా! నీవే నా సర్వస్వం!)

ఓం స్థాపకాయ చ ధర్మస్య సర్వధర్మ స్వరూపిణే।

అవతార వరిష్ఠాయ రామకృష్ణాయతే నమః ॥

(ఓ రామకృష్ణా! నీవు సర్వమత స్వరూపుడవు. ప్రపంచంలోని ప్రజలందరికీ సరిపోయే విధంగా ధర్మాన్ని తిరిగి స్థాపించావు. అన్ని అవతారాలకన్నా గొప్పవాడివైన నీకు నా నమస్కారములు.)

జననీం శారదాం దేవీం రామకృష్ణం జగద్గురుం ।

పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః ॥

(విశ్వమానవాళికి తల్లియైన శ్రీశారదాదేవి పాదపద్మాల దగ్గర, జగద్గురువైన శ్రీరామకృష్ణుల చరణకమలాల దగ్గర శరణు కోరుతూ, మాటిమాటికి నేను వారికి నమస్కరించుచున్నాను.)

పవిత్రం చరితం యస్యాః పవిత్రం జీవనం తథా ।

పవిత్రతా స్వరూపిణ్యై తస్యై కుర్మో నమో నమః ॥

(పవిత్రతే తన చరిత్రగా కలిగి, పవిత్రతతో జీవించి, పవిత్రతే తానుగా రూపుదాల్చిన ఆ తల్లి శ్రీశారదా దేవికి నేను అనేక నమస్కారములు చేస్తున్నాను.)

నమః శ్రీయతిరాజాయ వివేకానంద సూరయే ।

సచ్చిత్ సుఖ స్వరూపాయ స్వామినే తాపహారిణే ॥

(రాగద్వేషాలను సంపూర్ణంగా నియంత్రించి, యతులందరికీ రాజువైన ఓ సచ్చిదానంద స్వరూపా! ఋషివరేణ్యా! దేశికోత్తమా! వివేకానంద స్వామీ! అన్ని బాధలనూ తొలగించేవాడివైన నీకు నా ప్రణామములు.)

అంజనానందనం వీరం జానకీ శోకనాశకం ।

కపీశం అక్ష హంతారం వందే లంకాభయంకరమ్ ॥

(అంజనాదేవి కుమారుడైన హనుమంతుడు సీతాదేవి శోకాన్ని నాశనం చేశాడు. అతడు వానరులకు నాయకుడు. అక్షకుమారుణ్ణి సంహరించి, లంకను భయంలో ముంచెత్తాడు! అటువంటి కర్మయోగి, కార్యసాధకుడు, మహావీరుడు అయిన హనుమంతుడికి నేను నమస్కరిస్తున్నాను.)

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వం అరోగతా ।

అజాడ్యం వాక్పటుత్వం చ హనుమత్ స్మరణాద్ భవేత్ ॥

(హనుమంతుడి పేరు తలుచుకుంటేనే బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం కలుగుతాయి. అన్ని మానసిక రుగ్మతలూ పోయి, చక్కగా మాట్లాడేశక్తి అలవడుతుంది.)

ఓం పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే ।

పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావ శిష్యతే ॥

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

(ఓం! కంటికి గోచరించనిదంతా అనంతబ్రహ్మంతో నిండివుంది. కంటికి కనపడేదంతా కూడా ఆ అనంతమైన బ్రహ్మంతో నిండి ఉంది. ఈ విశ్వమంతా ఆ అనంతబ్రహ్మంలో నుంచే వెలువడింది. ఈ అనంతవిశ్వం దానిలో నుండి వెలువడినా ఆ అనంతబ్రహ్మం అనంతమైనదిగానే ఉంటుంది. ముల్లోకాలలోనూ శాంతి విలసిల్లు గాక!)

బాలల కథలు


1. నచికేతుడు

భారతీయులమైన మనం ఎంతో గొప్పవాళ్ళం. మన దగ్గర చాలా గొప్ప సంపద ఉంది. ప్రపంచంలో అందరికీ పంచిపెట్టినా అది తరగదు. కానీ అది ఎక్కడ ఉందో మనం తెలుసుకోవాలి. అటువంటి సంపదను చిన్నతనంలోనే సంపాదించినవాడు నచికేతుడు. వేదాలలోని కఠోపనిషత్తులో ఇతణ్ణి గురించి చెప్పబడింది.

నచికేతుడి తండ్రి వాజశ్రవసుడు. అతడు ఒకసారి విశ్వజిత్తు అనే యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞం చేసేవారు తమకున్న ఆస్తి మొత్తాన్ని ఇతరులకు దానం చెయ్యాలి. ఆ నియమం ప్రకారం వాజశ్రవసుడు దానాలు చేస్తున్నాడు. ఆ కాలంలో ముఖ్యమైన ఆస్తి గోవులు. ఆ గోసంపదనే వాజశ్రవసుడు దానం చేస్తున్నాడు. అయితే, మంచి ఆవుల్ని దానం చెయ్యడం లేదు.

నచికేతుడు చాలా శ్రద్ధగలవాడు. ధర్మంమీద అతడికి గొప్ప విశ్వాసం ఉండేది. తండ్రి వట్టిపోయి, చావడానికి సిద్ధంగా ఉన్న ఆవుల్ని దానం చెయ్యడం గమనించాడు. అటువంటి దానాల వలన తన తండ్రికి చేటు కలుగుతుందని భావించాడు. తండ్రిని ఈ దోషం నుంచి తప్పించడం తన బాధ్యత అని అనుకున్నాడు. అందుకని తండ్రి దగ్గరికి చేరి, "తండ్రీ! నన్ను ఎవరికి దానమిస్తావు?" అని అడిగాడు. తండ్రి పట్టించుకోలేదు. నచికేతుడు రెండవసారి, మూడవసారి కూడా అదే విధంగా ప్రశ్నించాడు. తండ్రికి కోపం వచ్చి, "నిన్ను యముడికి దానమిస్తున్నాను, పో!" అని గద్దించాడు. వెంటనే నచికేతుడు, "తండ్రీ! మన పూర్వులు సత్యాన్ని పాటించి గొప్పవారయ్యారు. నువ్వు కూడా ఆడినమాట నిలబెట్టుకో!" అని కోరాడు. వాజశ్రవసుడు తాను తొందరపాటుతో నోరుజారి అన్న మాటను గురించి బాధపడ్డాడు. అయినా ఆడినమాటను నిలబెట్టుకుని ఆ బాలుణ్ణి యముడి వద్దకు పంపాడు.

నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన ఇంటిలో లేడు. నచికేతుడు మూడురోజులపాటు ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. నాల్గవ రోజు యమధర్మరాజు ఇంటికి రాగానే మంత్రులు, "స్వామీ! అగ్నిహోత్రంలాగా వెలిగిపోతున్న ఒక బాలుడు మూడురోజులుగా మీకోసం వేచి ఉన్నాడు" అని చెప్పారు.



వెంటనే యమధర్మరాజు అతడికి తగిన మర్యాదలు చేసి, “నాయనా! నీ రాకవల్ల నాకు శుభం కలుగుతుంది! నీవు మూడురోజులుగా ఉపవాసం చేస్తున్నావు. అందుచేత నీకు మూడు వరాలు ఇస్తాను, కోరుకో!” అన్నాడు.

మొదటి వరంగా నచికేతుడు, “నా తండ్రికి మనశ్శాంతి కలిగి, నేను తిరిగి వెళ్ళినప్పుడు నన్ను ప్రేమించేలా చెయ్యమ”ని ప్రార్థించాడు. యమధర్మరాజు “సరే” అని రెండవ వరం కోరుకోమన్నాడు. “స్వామీ! మనుష్యుడు ఏ యజ్ఞం చెయ్యడం వల్ల స్వర్గసుఖాలు పొందుతాడో సెలవియ్యండి?” అని కోరాడు. యముడు వివరంగా అతనికి ఆ విధానాన్ని బోధించి, “కుమారా! నీ శ్రద్ధకు ఎంతో సంతోషించాను. ఇప్పుడు నేను వివరించిన ఈ యజ్ఞం ఇక నుండి నీ పేరుతో ‘నాచికేతయజ్ఞం’ అని పిలువబడుతుంది. అంతేకాదు, నా ప్రేమకు చిహ్నంగా ఎప్పటికీ కాంతి తగ్గని ఈ రత్నాల హారాన్ని కూడా నీకు ఇస్తున్నాను, ఇక మూడవ వరాన్ని కోరుకో!” అన్నాడు.

అప్పుడు నచికేతుడు, "స్వామీ! మనిషి చనిపోయిన తర్వాత ఏమవుతాడు? కొందరు ఉండడని అంటారు, కొందరు ఉంటాడని అంటారు. దయతో నాకు ఈ రహస్యాన్ని బోధించండి!" అని కోరాడు. అప్పుడు యమధర్మరాజు, "నాయనా! ఇది దేవతలు ఆలోచించదగిన ప్రశ్న. నీవు చిన్నవాడివి! అటువంటి విషయాలు నీకెందుకు? నువ్వు కోరినంతమంది కుమారుల్ని, మనుమల్ని, లెక్కలేనంత ధనాన్ని, కావలసినంత భూమిని, అనుభవించడానికి కోరినంత ఆయువునూ, యౌవనాన్నీ ఇస్తాను, కోరుకో!" అన్నాడు. అప్పుడు నచికేతుడు, "స్వామీ! నేను కోరిన దానికి బదులు ఇన్ని ఇస్తానంటున్నారు కాబట్టి నేనడిగింది వీటన్నిటికంటే గొప్పదై ఉండాలి! కాబట్టి దాన్నే నాకు ఇవ్వండి!" అని ప్రార్థించాడు.

నచికేతుణ్ణి యముడు ఇంకా పరీక్షించదలచుకుని ప్రక్కనున్న తెర తొలగించి, "కుమారా! ఇటు చూడు! మహా సౌందర్యరాశులైన స్త్రీలు ఉన్నారు. లెక్కలేనన్ని రథాలు, గుర్రాలు ఇక్కడ ఉన్నాయి. వీటిలో నీకు కావలసినన్ని తీసుకుని, కోరినంతకాలం అనుభవించు!" అన్నాడు. అప్పుడు నచికేతుడు, "స్వామీ! ఇవన్నీ ఎంతోకొంత కాలానికి నశించేవే! పైగా వీటిని కావాలంటే నేనే సంపాదించుకోగలను. కాబట్టి వీటిని మీవద్దే ఉంచుకోండి! నచికేతుడు ఇంకొకటి కోరడు!" అన్నాడు.

నచికేతుడికి గల వైరాగ్యానికి, శ్రద్ధకు, చలించని బుద్ధికి సంతోషించి యమధర్మరాజు అతడికి పరతత్త్వాన్ని బోధించాడు. అదే వేదాలలో 'కఠోపనిషత్తు' అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది.

నచికేతుడు తన తండ్రికి మంచిచేశాడు. అతనివల్ల నాచికేత యజ్ఞం అనే క్రొత్త యజ్ఞం తయారయింది. బ్రహ్మవిద్య వలన ప్రపంచానికే మహోపకారం చేశాడు. నచికేతుడు చూపించినటువంటి శ్రద్ధను అవలంబించి, మన పెద్దలు మహోన్నతమైన సంస్కృతి రూపంలో మనకు వారసత్వంగా అందించిన మహాభాగ్యాన్ని అనుభవించడానికి మనం కూడా ప్రయత్నించాలి!

2. చిరకారి

ఒక ఆశ్రమంలో మేధాతిథి అనే ముని ఉండేవాడు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నాడు. ఆ బాలుడు ఏ పని చేసినా ఎంతో ఆలోచించి చేసేవాడు, తొందరపడేవాడు కాదు. అందుచేత అందరూ అతణ్ణి 'చిరకారి' అని పిలిచేవారు. ఒకరోజున ఆ మునికి భార్యమీద విపరీతమైన కోపం వచ్చింది. వెంటనే

చిరకారిని పిలిచి, "మీ తల్లి తల నరికివెయ్యి!" అని ఆజ్ఞాపించి బయటికి వెళ్ళిపోయాడు.

చిరకారి ప్రతి విషయాన్ని ఎంతో ఆలోచించిగానీ చెయ్యడు కదా! తండ్రి ఆజ్ఞను గురించి ఆలోచిస్తూ, "తండ్రియే గురువు, దైవం! అందుచేత తండ్రి ఆజ్ఞను జవదాటకూడదు. దాన్ని పాటించడమే పరమధర్మం!" అనుకున్నాడు. మరొకవైపు తాను చంపవలసిన తల్లిని తలుచుకుని, "శాస్త్రాలు, 'మాతృదేవో భవ' అంటే 'తల్లియే దైవం' అని చెబుతున్నాయి కదా. తల్లి ఎన్నో బాధలు అనుభవించి, నవమాసాలు మోసి బిడ్డను కంటుంది. ఆ బిడ్డ పెరిగి పెద్దవాడయ్యే వరకూ ఎన్నో కష్టాలు పడుతుంది. తల్లి లేని వాడు అందరికీ అలుసు. తల్లి ఉంటే సమస్తమూ ఉన్నట్లు తోస్తుంది. తల్లి నిజంగా దైవం. అటువంటి తల్లిని చంపడం మహాపాపం కదా!" అనుకుంటూ లోతుగా ఆలోచిస్తున్నాడు. ఇలా ఒకసారి తండ్రిని గురించి, తండ్రి ఆజ్ఞను గురించి, మరొకసారి తల్లిని గురించి, తల్లి గొప్పతనాన్ని గురించి ఆలోచిస్తున్నాడు.

కొద్దిదూరం నడిచాడో లేదో మునికి కోపం తగ్గిపోయింది. తాను తొందరపడ్డానని గ్రహించాడు. "స్త్రీని, అందులోనూ భార్యను చంపమన్నానే!" అని తన తప్పుకు విచారిస్తూ ఇంటికి పరుగుపరుగున చేరుకున్నాడు. "నా మాట ప్రకారం బాలుడు తొందరపడి తల్లిని చంపకుండా ఉంటే బాగుండును. ఏమైనా వాడు 'చిరకారి' కదా! తొందరపడి అటువంటి పని చెయ్యడులే!" అనుకుంటూ ఇల్లు చేరాడు.

తండ్రిని చూడగానే చిరకారి చేతనున్న కత్తిని జారవిడిచి విచారంతో ఆయన కాళ్ళమీద పడ్డాడు. భార్య కూడా అదే విధంగా పశ్చాత్తాపంతో ఆ ముని కాళ్ళమీద పడింది. ఆయన ఆ ఇద్దరినీ లేవనెత్తి ప్రేమతో, ఆదరంతో కౌగిలించి దీవించాడు.

చిరకారిలాగా తల్లిదండ్రుల మీద భక్తిని కలిగి, ఏ పనినైనా తొందరపడక బాగా ఆలోచించి చేసేవాడు ఎల్లప్పుడూ సుఖాన్నే పొందుతాడు.

3. ఏకలవ్యుడు

హిరణ్యధనువు అనే ఒక బోయరాజు ఉండేవాడు. అతడికి ఏకలవ్యుడు అనే ఒక కుమారుడు ఉన్నాడు. ఏకలవ్యుడు చాలా చురుకుదనం, పట్టుదల కలవాడు. అతడు విలువిద్య నేర్చుకోవాలని అనుకున్నాడు. ఆ కాలంలో ద్రోణాచార్యుడు

పాండవులకు, కౌరవులకు ధనుర్విద్య నేర్పించేవాడు. ఏకలవ్యుడు కూడా ద్రోణాచార్యుడి దగ్గరకు వెళ్ళి, తనకు విలువిద్య నేర్పమని ప్రార్థించాడు. కానీ ద్రోణాచార్యుడు అతణ్ణి తన శిష్యుడిగా అంగీకరించలేదు.

ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి వద్ద సెలవు తీసుకుని తానున్న అడవికి మరలిపోయాడు. గురువు దొరకలేదని అతడు నిరుత్సాహ పడలేదు. అతడి పట్టుదల మరింత పెరిగింది. అడవిలోనే ఒక గుడిసె నిర్మించాడు. స్వయంగా మట్టితో ద్రోణాచార్యుడి విగ్రహాన్ని చేశాడు. ఆ విగ్రహాన్నే తన గురువుగా భావించాడు. ప్రతి రోజూ భక్తితో ఆ విగ్రహానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, బాణాలు వేయడాన్ని అభ్యసించసాగాడు. తనంతటతానుగా, ఒంటరిగా, గంటల తరబడి రాక్షససాధన చేశాడు. రోజంతా ధనుర్విద్య గురించే ఆలోచించాడు. దాన్ని గురించే కలలు కన్నాడు. విలువిద్యను గురించిన ఆలోచనలతో అతడి మనస్సంతా నిండిపోయింది. దానితో అతడి మనస్సే అతడికి గురువై, ధనుర్విద్యలోని మెలకువలనూ, గొప్పగొప్ప రహస్యాలన్నింటినీ బోధించింది. క్రమంగా తన గొప్ప సంకల్పశక్తి చేత, గురువుమీద ఉన్న అఖండమైన భక్తి చేత విలువిద్యలో ఏకలవ్యుడు గొప్ప ప్రావీణ్యత సంపాదించాడు. ఫలితంగా అతడు ధనుర్విద్యలో అందరినీ, చివరకు తన గురువును కూడా మించిపోయాడు.

ఏ విద్య అయినా సరే, నేర్చుకోవాలని బలమైన ఆకాంక్ష ఉన్నవాడికి అతడి మనస్సే గురువై అన్నీ నేర్పిస్తుందని శ్రీరామకృష్ణ పరమహంస బోధించారు కదా!

4. ధ్రువుడు

ఉత్తానపాదుడు అనే రాజుకు ఇద్దరు భార్యలు ఉన్నారు. వారిలో పెద్ద భార్య సునీతి. చిన్న భార్య సురుచి. పెద్ద భార్యకు ధ్రువుడు, చిన్న భార్యకు ఉత్తముడు అనే కొడుకులు ఉన్నారు. ఉత్తానపాదుడు పెద్దభార్యను దాసికన్నా హీనంగానూ, చిన్న భార్యను ఎంతో ప్రేమతోనూ చూసేవాడు.

ఒకరోజు ఉత్తముడు తండ్రి తొడమీద కూర్చుని ఉండగా ధ్రువుడు అక్కడికి వచ్చాడు. తాను కూడా తండ్రి తొడమీద కూర్చోవాలని ఆయన దగ్గరకు చేరాడు. కానీ, తండ్రి అతనిని పట్టించుకోలేదు. కనీసం కన్నెత్తి అయినా చూడలేదు. ఇంతలో సురుచి, "ధ్రువా! నీ తండ్రి తొడ మీద కూర్చునే భాగ్యం నీకు లేదు. నా కడుపున పుట్టి ఉంటే అటువంటి భాగ్యం నీకు కలిగివుండేది. కాబట్టి దేవుణ్ణి ప్రార్థించి నా కడుపున పుట్టు!" అని కటువుగా పలికింది. తండ్రి చూపిన

నిరాదరణ, పినతల్లి చేసిన అవమానం ధ్రువుని లేతమనస్సును గాయపరిచాయి. అతడు ఆ బాధతో తల్లి దగ్గరకు వెళ్ళాడు. ఆమె కూడా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ, "నాయనా! భగవంతుడే నీకు దిక్కు! ఆయననే ప్రార్థించు!" అని చెప్పింది.

అప్పుడు ధ్రువుడి రోషం పట్టుదలగా మారింది. ఐదు సంవత్సరాల బాలుడు తపస్సు చేయడానికి అడవికి బయలుదేరాడు. దారిలో నారదముని కనిపించి, "నాయనా ధ్రువా! నీది ఆడుకునే వయస్సు. నీకు తపస్సు ఎందుకు?" అని నచ్చజెప్పాలని చూశాడు. కానీ ధ్రువుడు తన పట్టుదలని విడిచి పెట్టలేదు. నారదముని సంతోషించి అతడికి నారాయణ మంత్రం ఉపదేశించి నర్మదానదీ తీరానికి వెళ్ళమని సలహా ఇచ్చాడు.

ధ్రువుడు నర్మదానదీ తీరంలోని మధువనానికి వెళ్ళి అక్కడ స్వస్తికాసనంలో కూర్చుని తపస్సు చేయడం ప్రారంభించాడు. మూడు రోజులకు ఒకసారి వెలగ, రేగుపండ్లు తింటూ మొదటినెల గడిపాడు. రెండవనెలలో ఆరు రోజులకు ఒకసారి ఎండుటాకుల్ని మాత్రమే తిన్నాడు. మూడవనెలలో తొమ్మిదిరోజులకు ఒకసారి మాత్రమే గాలి పీల్చి కఠినమైన తపస్సు కొనసాగించాడు. ఐదవనెలలో గాలి కూడా పీల్చలేదు. ఒంటికాలిమీద నిలబడి తపస్సు చేశాడు. ఆ తపోభారానికి భూమి క్రుంగింది. నారాయణుడు ప్రత్యక్షమై, "నాయనా! నీ



తపస్సు ఇంక చాలు. నీ తండ్రి తర్వాత నీవు అరవై ఆరు వేల సంవత్సరాలు రాజ్యమేలుతావు. ఆ తర్వాత సప్తర్షి మండలానికన్నా ఉన్నతంగా ధ్రువ నక్షత్రంగా వెలుగొందుతావు!" అని వరమిచ్చాడు. ధ్రువుడు నేలమీద సాగిలపడి నారాయణుడికి మొక్కాడు.

బాలుడైన ధ్రువుడు ప్రదర్శించిన పట్టుదల, భగవద్భక్తి మనకందరకూ ఎంతో అవసరం, ఆదర్శప్రాయం.

5. ప్రహ్లాదుడు

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు అనబడే నలుగురు మహర్షులు బ్రహ్మమానసపుత్రులు. వారు మహా తపస్సంపన్నులు. ఒకసారి వారు విష్ణుమూర్తిని దర్శిద్దామని వైకుంఠానికి వెళ్ళారు.

జయుడు, విజయుడు వైకుంఠ ద్వారపాలకులు. వాళ్ళు అహంకారంతో విర్రవీగుతూ, ఆ మహర్షులను వైకుంఠంలోనికి పోనివ్వకుండా అడ్డగించారు. అప్పుడు ఆ ఋషులు జయవిజయులను రాక్షసులుగా పుట్టమని శపించారు. జయవిజయులు తమ తప్పు తెలుసుకుని వారి పాదాలమీద పడి ప్రార్థించడంతో, విష్ణువు యొక్క అవతారాల చేత చంపబడి శాపవిమోచనాన్ని పొందుతారని చెప్పారు.



జయవిజయులు భూలోకంలో కశ్యపప్రజాపతి, దితి అనే దంపతులకు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించారు. హిరణ్యాక్షుడు వేదాలను అపహరించి పాతాళలోకంలో దాక్కున్నప్పుడు విష్ణువు వరాహ (పంది) అవతారంలో అతణ్ణి సంహరించి వేదాలను రక్షించాడు. దీనితో హిరణ్యకశిపుడు విష్ణువును ద్వేషించసాగాడు. ఆ కోపంతో భూలోకంలో విష్ణువును గురించి తపస్సు చేస్తున్న మునులను, సాధువులను హింసించి, వారి యజ్ఞయాగాదులను నాశనం చేయసాగాడు. ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మను ప్రత్యక్షం చేసుకున్నాడు. చావులేని వరాన్ని కోరాడు. కానీ బ్రహ్మ, "పుట్టిన ప్రతి జీవి చావక తప్పదు! కాబట్టి మరొక వరం కోరుకో!" అని అన్నాడు. అప్పుడు హిరణ్యకశిపుడు, "రాత్రి గానీ, పగలు గానీ, భూమి మీద గానీ, ఆకాశంలో గానీ, మానవుల వలన గానీ, జంతువుల వలన గానీ, ఆయుధాల వలన గానీ, సజీవుల వలన గానీ, నిర్జీవుల వలన గానీ, దేవతల వలన గానీ, రాక్షసుల వలన గానీ నాకు మరణం సంభవించకూడదు. అంతేగాక యుద్ధంలో నాకు ఎదురులేని పరాక్రమాన్ని, లోకపాలకుల మహిమలను మించిన మహామహిమల్ని ప్రసాదించండి!" అని కోరాడు. బ్రహ్మ ఆ వరాన్ని ఇచ్చాడు. అటువంటి అరుదైన శక్తుల్ని దురుపయోగం చెయ్యకుండా బుద్ధి కుశలతతో జాగ్రత్తగా మసలుకోమని హితవు చెప్పాడు కూడా.

కానీ, హిరణ్యకశిపుడు వరగర్వంతో అన్ని లోకాలను జయించి స్వర్గాధిపత్యాన్ని కూడా సాధించి అందరినీ హింసిస్తూ లోకకంటకుడుగా మారాడు. విష్ణువును కూడా జయిస్తే అందరికంటే తానే గొప్పవాణ్ణవుతానని భావించి విష్ణువుకోసం వెతకసాగాడు. కానీ ఎంత వెతికినా అతడికి విష్ణువు దొరకలేదు.

హిరణ్యకశిపుడి భార్య లీలావతి. ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడి కుమారుడు. ప్రహ్లాదుడు పుట్టుకతోనే గొప్ప విష్ణుభక్తుడై మెలగసాగాడు. ఇది హిరణ్యకశిపుడికి ఎంతమాత్రం నచ్చలేదు. అతణ్ణి తనకు తగిన పుత్రుడిగా, విష్ణుద్వేషిగా మార్చమని శుక్రాచార్యుని కుమారులైన చండామార్కులకు అప్పగించాడు. వారు అతడికి అన్ని విద్యలనూ బోధించగలిగారు, కానీ విష్ణుద్వేషిగా మాత్రం మార్చలేకపోయారు. అప్పుడు హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికి, 'విష్ణుభక్తిని విడనాడ'మని నయానా, భయానా నచ్చచెప్పాడు. కానీ ఫలితం లేకపోయింది. కోపంతో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి అనేక హింసలకు గురిచేశాడు. ప్రహ్లాదుడు

హరినామస్మరణ చేస్తూ అన్ని హింసలనూ భరించాడు. అతని శరీరం చెక్కుచెదరలేదు.

చివరకు హిరణ్యకశిపుడు కుమారుణ్ణి తన దగ్గరకు రప్పించి ఇలా అన్నాడు. "ఓరీ! నీవంటి కులద్రోహిని నేనే స్వయంగా చంపుతాను. 'హరి!' 'హరి!' అని వదరుతున్నావు గదా! ఆ హరి ఎక్కడ ఉన్నాడో నాకు చూపించు!" అని హుంకరించాడు. అప్పుడు ప్రహ్లాదుడు, "హరి సర్వాంతర్యామి. హరి ఒకచోట ఉండి వేరొకచోట లేకపోవడం లేదు. ఆయనను ఎక్కడ కావాలంటే అక్కడే చూడవచ్చు!" అని సమాధానం చెప్పాడు. హిరణ్యకశిపుడు, "అయితే హరిని ఈ స్తంభంలో చూపగలవా?" అని ప్రశ్నించాడు. "నిస్సందేహంగా చూడవచ్చు!" అని ప్రహ్లాదుడు సమాధానం చెప్పాడు. పట్టలేని కోపంతో హిరణ్యకశిపుడు ఆ స్తంభాన్ని అరచేతితో చరిచి ముక్కలు చేశాడు. ఆ స్తంభంలో నుంచి విష్ణువు ఘోరమైన నరసింహ అవతారంతో ఆవిర్భవించాడు. సింహం తలతో, మనిషి శరీరంతో, మనిషీ-జంతువూ కాని ఆ రూపంతో, పగలూ-రాత్రీ కాని సాయంత్రం వేళ, సజీవం, నిర్జీవం కాని చేతిగోళ్ళతో హిరణ్యకశిపుడి కడుపును చీల్చివేసి చంపాడు. అతిభీకరరూపంతో, కోపంతో జ్వలించిపోతున్న ఆ ఉగ్రనరసింహమూర్తిని ప్రహ్లాదుడు ప్రార్థించి శాంతింపచేశాడు. ప్రహ్లాదుడు ఆ తర్వాత గొప్ప హరిభక్తితో ప్రజారంజకంగా పాలన చేశాడు.

6. మార్కండేయుడు

పూర్వం మృకండుడు, మరుద్వతి అనే దంపతులు ఉండేవారు. మృకండుడు అరణ్యంలో తపస్సు చేసేవాడు. వారికి సంతానం లేదు. సంతానం కోసం మృకండుడు వారణాసి వెళ్ళి శివుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై, "నీకు నూరు సంవత్సరాలు ఆయుర్దాయం గల తెలివితక్కువ కొడుకు కావాలా లేక పదహారు సంవత్సరాలు జీవించే అల్పాయుష్కుడు, తెలివిగలవాడు, నాకు పరమభక్తుడు అయిన కుమారుడు కావాలా?" అని ప్రశ్నించాడు. అప్పుడు మృకండుడు, "స్వామీ! తెలివిగలవాడు, శివభక్తుడు అయిన కొడుకు నాకు కావాలి. వాడు ఎక్కువ సంవత్సరాలు జీవించకపోయినా ఫర్వాలేదు!" అని కోరుకున్నాడు. కొన్నాళ్ళకు వాళ్ళకు ఒక పుత్రుడు జన్మించాడు. అతడికి మార్కండేయుడు అని నామకరణం చేసి ఎంతో ముద్దుగా పెంచారు. సంవత్సరాలు గడుస్తున్నాయి. మార్కండేయుడు చక్కగా విద్య నేర్చాడు.

వినయవిధేయతలను కలిగి ఉన్నాడు. తల్లిదండ్రుల మనస్సులోని బాధను గ్రహించి వారిని అడిగి విషయం తెలుసుకున్నాడు. "వారణాసికి వెళ్ళి, నా చివరిరోజులు శివుడి సన్నిధిలో గడుపుతాను", అని తల్లిదండ్రులకు చెప్పి వారి అనుమతి తీసుకున్నాడు. వారణాసికి చేరి అక్కడ దీక్షతో శివుణ్ణి అర్చించసాగాడు.

మార్కండేయుడికి పదహారేళ్ళు నిండగానే అతడి ప్రాణాలను తీసుకుపోవడానికి యమదూతలు వచ్చారు. కానీ మార్కండేయుడు శివదీక్షలో ఉన్నందున వారు అతణ్ణి సమీపించలేకపోయారు. అప్పుడు యముడే స్వయంగా వచ్చి మార్కండేయుణ్ణి తనతో రమ్మన్నాడు. మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకుని ప్రార్థించసాగాడు. అయినప్పటికీ యముడు తన పాశంతో మార్కండేయుణ్ణి బంధించాలని ప్రయత్నించాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై యమధర్మరాజును మందలించి పంపివేశాడు. మార్కండేయుణ్ణి మరణం లేకుండా (చిరంజీవిగా) ఉండమని దీవించాడు.

బాలభక్తులలో మార్కండేయుడి చరిత్ర చాలా గొప్పది. అది అందరికీ ఆదర్శప్రాయం.

7. అష్టావక్రుడు

పూర్వం యాజ్ఞ్యవల్క్యుడు అనే గొప్ప ఋషి ఉండేవాడు. ఆయన అడవిలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని శిష్యులకు వేదవేదాంగాలను బోధించేవాడు. అతని వద్ద కహోడుడు అనే శిష్యుడు ఉన్నాడు. అతడు చాలా తెలివిగలవాడు, వినయవంతుడు. యాజ్ఞ్యవల్క్యుడు కహోడుడికి తన కుమార్తె అయిన సుజాతను ఇచ్చి వివాహం చేశాడు. కహోడుడు యాజ్ఞ్యవల్క్యుడి ఆశ్రమంలోనే ఉండి శిష్యులకు వేదాలను బోధించసాగాడు. కొన్ని రోజులకు సుజాత గర్భాన్ని ధరించింది. తనకు పుట్టబోయే కుమారుడు మహాపండితుడు కావాలని ఆమె కోరుకునేది. అందుచేత వేదాధ్యయనం జరిగేటప్పుడు ఆమె శ్రద్ధగా వింటూ ఉండేది. గర్భంలోని శిశువు వేదాలు నేర్చుకోసాగాడు. ఇలా నెలలు గడిచాయి. ఒకరోజు కహోడుడు శిష్యులకు బోధిస్తూ, ఒక శ్లోకాన్ని తప్పుగా ఉచ్చరించాడు. వెంటనే గర్భంలో ఉన్న శిశువు తండ్రి తప్పును ఎత్తిచూపాడు. అది చూచి అక్కడ వారందరూ ఆశ్చర్యపోయారు. కహోడుడు కోపంతో మండిపడ్డాడు. "పుట్టకముందే ఇంత పొగరుతో నాకే వంకలు పెడుతున్నావు కాబట్టి నీ శరీరం

అష్టవంకరలతో ఉంటుంది, పో!" అని కహోడుడు గర్భంలో ఉన్న బిడ్డని శపించాడు.

కొద్దిరోజుల తర్వాత కహోడుడు జనక మహారాజును మెప్పించి ధనం సంపాదించడానికి మిథిలానగరానికి వెళ్ళాడు. అక్కడ ఒక యజ్ఞం జరుగుతోంది. ఆ సమయంలో దండి అనే పండితుడు అక్కడికి వచ్చాడు. అతడు మిథిలానగరంలోని పండితులతో వాదనకు దిగాడు. వాదనలో ఓడిపోయిన వారందరినీ నదిలోకి త్రోసి వెయ్యాలని నియమం పెట్టాడు. మిథిలానగరంలోని గొప్ప పండితులంతా దండితో వాదనకు దిగి ఓడిపోయి నదిపాలయ్యారు. కహోడుడు కూడా దండి చేతిలో ఓడిపోయి నదిలోకి త్రోసి వెయ్యబడ్డాడు.

ఇదే సమయంలో అక్కడ ఆశ్రమంలో అష్టావక్రుడు పుట్టాడు. అతని శరీరం ఎనిమిది వంకరలతో వికారంగా ఉంది. అతడు క్రమంగా పెరిగి పెద్దవాడయ్యాడు. తాతగారైన యాజ్ఞ్యవల్క్యుడు అష్టావక్రుడికి తండ్రిలేని లోటులేకుండా పెంచుతూ విద్యాబుద్ధులు నేర్పించాడు. అష్టావక్రుడు పన్నెండేళ్ళ వయస్సుకే మహాపండితుడయ్యాడు. తండ్రి, తాతలను మించినవాడయ్యాడు. అతడు తన తండ్రి నదిపాలైన సంగతి విన్నాడు. వాదనలో దండి పండితుణ్ణి ఓడించాలని నిర్ణయించుకున్నాడు. మిథిలానగరానికి తన మిత్రుడైన శ్వేతకేతువుతో కలిసి ప్రయాణమయ్యాడు. జనకమహారాజు మొదట బాలుడైన అష్టావక్రుణ్ణి దండితో వాదించడానికి అనుమతించలేదు. కానీ అతడి పట్టుదల, తేజస్సు, విద్వత్తు చూసి అబ్బురపడ్డాడు. చివరికి మనస్సు మార్చుకుని, అతడికీ దండికీ వాదనను ఏర్పాటు చేశాడు. అష్టావక్రుడు దండిని అవలీలగా ఓడించి, అతణ్ణి నదిలోకి త్రోసివెయ్యమని జనకమహారాజును కోరాడు.

కానీ దండి, తాను వరుణదేవుడి కుమారుణ్ణనీ, నదిలోకి త్రోసివెయ్యబడిన పండితులందరూ క్షేమంగా ఉన్నారనీ, వరుణదేవుడు జరిపిస్తున్న యజ్ఞంలో పాల్గొనడానికి వారందరూ పంపబడ్డారనీ చెప్పాడు. దండి సభలోని వారందరినీ నది దగ్గరకు తీసుకువెళ్ళి నదిలోనికి త్రోసివేయబడిన పండితులందరినీ నదిలోనుంచి బయటకు తీసుకువచ్చాడు. అష్టావక్రుడు తన తండ్రి అయిన కహోడుడికి నమస్కరించి ఆశీస్సులు పొందాడు. మిథిలానగరంలోని వారందరూ అష్టావక్రుడే అందరి కన్నా గొప్ప పండితుడని వేయినోళ్ళతో ప్రశంసించారు.

✡ ✡ ✡ ✡ ✡

మార్గదర్శక కథలు

1. ముందుకు సాగిపో!

కట్టెలు కొట్టుకుని జీవించేవాడు ఒకడు ఉండేవాడు. అతడు అడవిలో కట్టెలు కొట్టి తీసుకువచ్చి ఊరిలో అమ్మేవాడు. వాడు ఒకసారి అడవిలో కట్టెలు కొడుతున్నాడు. అప్పుడు అతడికి ఒక సాధువు ఎదురుపడి, "నాయనా, ముందుకు సాగిపో!" అని సలహా ఇచ్చి తనదారిన తాను వెళ్ళిపోయాడు. ఆ సలహా ఆ కట్టెలు కొట్టేవాడికి వెంటనే అర్థం కాలేదు. ఆ రోజుకు అమ్మగలిగినన్ని కట్టెలు కొట్టి తీసుకుపోయి, ఊరిలో అమ్మి, సాయంత్రానికి ఇంటికి చేరాడు. కానీ ఆ సాధువు చెప్పినమాట వాడి మనస్సులో మెదులుతూనే ఉంది.

"ఆ సాధువు నన్ను ఎందుకు ముందుకు సాగిపొమ్మన్నాడు?" అని ఆలోచించాడు. ఇలా ఆలోచిస్తూ ఉండగానే కొన్ని రోజులు గడిచిపోయాయి. ఒకరోజు వాడు, "ఆ సాధువు చెప్పినట్టు ఈ రోజు అడవిలో ముందుకు వెళ్ళిచూడాలి", అనుకున్నాడు. అడవిలో కొంతదూరం ముందుకు వెళ్ళి అక్కడ ఏముందో చూశాడు. వాడికి అక్కడ లెక్కలేనన్ని మంచిగంధం చెట్లు కనిపించాయి. తన అదృష్టానికి వాడు ఎంతో సంతోషపడి బండ్లతో మంచిగంధపు చెక్క తెచ్చి అమ్మి చాలా భాగ్యవంతుడయ్యాడు.

కాలం గడుస్తూనే ఉంది. మరి కొంతకాలానికి సాధువు తనతో, "ముందుకు సాగిపో!" అని చెప్పిన మాటలు వాడికి మళ్ళీ గుర్తుకు వచ్చాయి. అడవిలో మరికొంత దూరం ముందుకు వెళ్ళాడు. అక్కడ ఒక నది, దాని ఒడ్డున ఒక వెండి గని కనిపించాయి. వాడి ఆశ్చర్యానికి అంతులేదు. దానిలో నుంచి వెండిని త్రవ్వి తెచ్చి విక్రయించాడు. దానితో తన దగ్గర ఎంత ధనముందో తెలియనంత ధనవంతుడై పోయాడు.

కొంతకాలం గడిచింది. ఒకరోజు ఆ కట్టెలు కొట్టేవాడు ఆలోచిస్తూ, "ఆ సాధువు నన్ను ముందుకు సాగిపొమ్మన్నాడు కానీ అక్కడ గంధపుచెట్లు, వెండిగని ఉంటాయని చెప్పలేదు కదా! కాబట్టి అడవిలో ఇంకా ముందుకు పోయి, అక్కడ ఏమి ఉంటాయో చూస్తాను" అనుకున్నాడు. ఈసారి నదిని దాటి ఇంకా ముందుకు వెళ్ళాడు. అక్కడ వాడికి ఒక బంగారు గని కనిపించింది. "అరె! చూశావా! ఇందు కోసమే సాధువు నన్ను ముందుకు పొమ్మన్నాడు" అని అనుకున్నాడు. ఆనందంతో గంతులు వేశాడు.


కొంతకాలం తర్వాత ఇంకా ముందుకువెళ్ళి వజ్రాలు, వైఢూర్యాలు పొందాడు. వాటితో కుబేరుడంతటి వాడైపోయాడు.

ఈ కథను శ్రీ రామకృష్ణ పరమహంస బోధించారు. ఆయన, "మీరు ఏ పని చేసినా దానిలో ఇంకా ఇంకా ముందుకు సాగిపోండి. దానివల్ల మీకు మరింత విలువైనవి లభిస్తాయి. ఉన్నచోటే ఉండిపోతే ఏమిటి ప్రయోజనం?" అని చెప్పారు. కాబట్టి మనం చదువులో గానీ, ఇంకేదైనా విద్యను, కళను నేర్చుకోవడంలో గానీ, నేర్చుకున్నదానితో తృప్తిపడి ఆగిపోకూడదు. 'ఫర్వాలేదులే! ఇది చాలులే!' అనుకోకూడదు. మరింతగా నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. నేర్చుకున్న దాన్ని మరింతగా 'అభ్యాసం' చెయ్యాలి. అప్పుడు ఆ విద్యలో మరింత చక్కగా రాణించగలుగుతాము. గొప్పవాళ్ళం కాగలుగుతాము.

2. బుసకొట్టు! కాటు వేయవద్దు!

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి బయట ఒక పచ్చిక బయలు, ఆ పచ్చిక బయలులో ఒక పాముపుట్ట ఉండేవి. ఆ పుట్టలో ఒక భయంకరమైన విషసర్పం ఉండేది. ఆ మైదానంలో పిల్లలు తమ పశువులను మేపేవారు. అయితే వాళ్ళు ఆ పుట్ట వైపుకు మాత్రం వెళ్ళేవారు కాదు. ఎందుకంటే ఆ పుట్ట దరిదాపులలోకి వచ్చిన వారందరినీ ఆ పాము కాటువేసేది. అందువల్ల ఎవరూ దాని దగ్గరికి పోకుండా చాలా జాగ్రత్తగా మెలగుతూ ఉండేవారు.

ఒకరోజు ఒక సాధువు ఆ పచ్చికబయలులో నడుచుకుంటూ వెడుతున్నాడు. అతడు ఆ పాముపుట్ట వైపు నడవడం చూసి అక్కడ పశువులు కాస్తున్న పిల్లలు



అతడి దగ్గరికి పరుగుపరుగున వెళ్ళి, "అయ్యా! అక్కడ ఒక పెద్దపాము ఉంది. అది అందరినీ కరుస్తోంది! అటు వెళ్ళవద్దు!" అని చెప్పారు. ఆ సాధువు నవ్వుతూ, "ఫర్వాలేదులే! నాకు చాలా మంత్రాలు తెలుసు!" అని ముందుకు సాగిపోయాడు. కానీ ఆ పిల్లలు ఆయనను అనుసరించకుండా భయంతో అక్కడే ఆగిపోయారు. ఆ సాధువు పుట్టను సమీపించగానే, ఆ పిల్లలు చెప్పినట్టుగా ఒక పెద్దపాము బుసలుకొడుతూ ఆ సాధువును కాటువెయ్యడానికి ముందుకు వచ్చింది. ఆ పామును చూసిన సాధువు కొంచెం మట్టి తీసి మంత్రించి దానిమీద చల్లాడు. వెంటనే ఆ పాములోని దుష్టత్వం మాయమయింది. అది ఏమీ చేయలేక ఆయన కాళ్ళముందు పడి నమస్కారం చేసింది.

సాధువు ఆ పాముతో, "ఎందుకు అందరినీ కాటువేస్తున్నావు? ఇతరులకు హాని చెయ్యడం పాపం కదా! ఇకపై ఎవ్వరినీ కాటువేయవద్దు. నీకొక మంత్రం నేర్పిస్తాను. దాన్ని జపించడం అలవాటు చేసుకో! దానివల్ల నీ క్రూరత్వం నశిస్తుంది. అంతేకాక నీ పాపాలన్నీ పోయి, భగవంతుణ్ణి కూడా చూడగలుగుతావు!" అని ఆ పాముకు ఒక మంత్రాన్ని ఉపదేశించాడు. తాను చెప్పినట్టు చేస్తూ ఉండమని, తాను మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.



కొంతకాలం గడిచింది. ఆ పాము శ్రద్ధగా మంత్రాన్ని జపిస్తూ జీవిస్తోంది. ఎవ్వరినీ కాటువెయ్యడం లేదు. అక్కడ పశువులు కాస్తున్న పిల్లలు ఆ పాము ఎవ్వరినీ కాటువేయడం లేదని కనిపెట్టారు. క్రమంగా భయం తగ్గి దాని మీద రాళ్ళు విసిరి చూశారు. రాళ్ళు తగిలినా అది ఏమీ చేయలేదు. ఆ పిల్లల్లో ఒకడు ధైర్యం చేసి దాని తోకను పట్టుకుని లాగాడు. అయినా అది ఏమీ చేయలేదు. దానితో భయం పూర్తిగా పోయి, దాని తోకను పట్టుకుని గాలిలో గిరగిరా తిప్పి

రపీమని నేలకేసి కొట్టాడు. ఆ దెబ్బతో పాము రక్తం కక్కి, స్పృహతప్పి పడిపోయింది. అది కదలకుండా పడి ఉండడం చూసి, చచ్చిపోయిందనుకుని ఆ పిల్లలు ఆనందంగా వెళ్ళిపోయారు.



కానీ ఆ పాము చనిపోలేదు. కొంతసేపటి తర్వాత దానికి తెలివి వచ్చింది. ఎముకలు విరగడంతో చాలా నొప్పి కలిగి, కదలలేక పోయింది. అతికష్టం మీద పాకుతూ ఎలాగో తన పుట్టలోకి చేరింది. అప్పటి నుంచీ పగటి పూట బయటికి రావడం మాని వేసింది. రాత్రిపూట బయటికి వచ్చి ఆకులూ, రాలిన పళ్ళూ తింటూ కాలం గడపసాగింది. అందువల్ల చిక్కిశల్యమైపోయి ఎముకల గూడులా తయారయింది. కానీ మంత్రాన్ని జపించడం వల్ల దానికి ఆ పిల్లల మీద కోపం రాలేదు. వాళ్ళు తనకు హాని చేశారన్న విషయాన్ని కూడా క్రమంగా మర్చిపోయింది.

ఇలా ఒక సంవత్సరం గడిచింది. ఒకరోజు ఆ సాధువు మళ్ళీ వచ్చి ఆ పాము ఎక్కడ ఉందని ఆ పిల్లల్ని అడిగాడు. వాళ్ళు ఎంతో సంతోషంగా, ఆ పామును నేలకేసి కొట్టామనీ, అది చచ్చిపోయిందనీ చెప్పారు. కానీ ఆ సాధువు నమ్మలేదు. ఎందుకంటే తాను మంత్రం ఇచ్చాడు కదా! ఆ మంత్రం పూర్తిగా పనిచేసేంతవరకూ ఆ పాము చనిపోదని ఆయనకు తెలుసు. ఆయన పుట్ట దగ్గరికి వెళ్ళి, ఆ పామును పిలిచాడు. అది సాధువు గొంతు గుర్తుపట్టి, సంతోషంతో బయటికివచ్చి ఆయనకు నమస్కరించింది. "ఎలా ఉన్నావు?" అని ఆ సాధువు దాన్ని పలకరించాడు. తాను "హాయిగా ఉన్నాన"ని పాము బదులు చెప్పింది. "కానీ ఎందుకు ఇంత బలహీనంగా, సన్నగా ఉన్నావు?" అని తిరిగి ప్రశ్నించాడు. "మీరు ఇచ్చిన మంత్రాన్ని జపం చేస్తూ, ఎవ్వరినీ కాటువెయ్యకుండా, నేలమీద రాలిపడిన ఆకులు, పండ్లు మాత్రమే తింటూ ఉంటున్నాను. అందువల్ల కొద్దిగా చిక్కినట్లు కనిపిస్తున్నానేమో!" అని ఆ పాము సమాధానం చెప్పింది.

ఎవ్వరికీ హాని తల పెట్టకుండా, మంత్రాన్ని జపిస్తూ రోజులు గడుపుతూ ఉండడం వలన ఆ పిల్లలు తనను కొట్టారన్న విషయాన్ని కూడా పాము మర్చిపోయింది. దాని మనస్సు మంచితనంతో నిండిపోయింది. కానీ ఆ సాధువు, "ఆహారంలో మార్పువల్ల నీవు ఇలా చిక్కిపోవు! నీ శరీరానికి బలమైన దెబ్బలు తగిలినట్టున్నాయి. ఎముకలు కూడా విరిగినట్టున్నాయి. ఏదో జరిగి ఉండాలి. గుర్తు చేసుకో" అని మళ్ళీ అడిగాడు. అప్పుడు ఆ పాముకు ఆ పశువులుకాచే పిల్లలు తనను నేలకేసి కొట్టడం గుర్తుకు వచ్చింది. ఆ విషయాన్ని సాధువుతో చెప్పింది. అప్పుడు ఆ సాధువు ఆ పాముకు చీవాట్లు పెడుతూ, "నీ తెలివి తెల్లవారినట్లే ఉంది! నేను నీకు కాటువేయవద్దు అని చెప్పాను, కానీ బుసకొట్టి భయపెట్టవద్దని చెప్పలేదు కదా! నీ ఆహారపు అలవాట్లను మార్చుకోమనీ, ఎలుకలనూ, కప్పలనూ తినవద్దనీ, నేను చెప్పలేదు! నీ ధర్మానికి తగినట్లుగా నువ్వు నడుచుకో! ఇంతకు ముందు, నీకు ఎవరో హాని



చెయ్యబోతున్నారని ఊహించుకుని ముందుగానే వారిని కాటువేసి హింసించేదానివి. అది తప్పు! కానీ నీకు ఎవరైనా హాని చెయ్యబోతే వారిని బుసకొట్టి భయపెట్టాలి!" అని చెప్పాడు.

శ్రీరామకృష్ణ పరమహంస ఈ కథ చెప్పి ఇలా బోధించారు: "దుష్టుల్ని బుసకొట్టి భయపెట్టాలి. అలా భయపెట్టి వారిని దూరంగా ఉంచాలి. లేకపోతే మనకు అపకారం చేస్తారు. అలాగని మనం భయపడి ముందుగానే వారికి హాని చెయ్యకూడదు కూడా!"

3. తండ్రి ఉత్తరం

ఒక పల్లెటూరిలో రామయ్య అనే రైతు ఉండేవాడు. అతడికి ముగ్గురు పిల్లలు. వారిలో పెద్దవాడు కృష్ణయ్య చెన్నపట్నంలో (చెన్నై) కాలేజీలో చదువుతున్నాడు. ఒకసారి రామయ్య కుమారుడికి ఉత్తరం వ్రాస్తూ, "అబ్బాయీ!

నీవు దసరా సెలవులకు వచ్చేటప్పుడు మీ తమ్ముడికి కొంత మిఠాయి, మీ చెల్లెలికి రెండు బొమ్మలు తప్పక తీసుకురా" అని వ్రాశాడు.

కృష్ణయ్య సెలవులకు తన గ్రామానికి వచ్చాడు. కానీ మిఠాయి, బొమ్మలు తీసుకురాలేదు. వచ్చిన వెంటనే తండ్రికి గౌరవంగా నమస్కరించి, చెల్లెల్ని, తమ్ముణ్ణి ముద్దు చేశాడు. కొంతసేపయిన తర్వాత తండ్రి దగ్గరికి వచ్చి, "నాన్నా! మీరు వ్రాసిన ఉత్తరం అందింది. ఎంతో ప్రేమతో వ్రాశారు. చక్కని ఊదా రంగు సిరాను ఉపయోగించి, ఎంతో చక్కని దస్తూరీతో వ్రాశారు. అందులో నలభైయారు అక్షరాలు ఉన్నాయి. ఆ ఉత్తరానికి రోజూ పూలు పెట్టి పూజ చేశాను. ఇదుగో చూడండి మీరు వ్రాసిన ఉత్తరం!" అని ఆ ఉత్తరాన్ని తీసి చూపించాడు. అప్పుడు తండ్రి, "అంతా బాగానే ఉంది కానీ, నేను తెమ్మన్న బొమ్మలు, మిఠాయిలు ఏవి?" అని అడిగాడు. కృష్ణయ్య తేలేదని చెప్పాడు. అది విన్న తండ్రి సంతోషపడలేదు. ఎందుకంటే తాను చెప్పిన పనిని కుమారుడు ఏమాత్రం చెయ్యలేదు.

అందుచేత ఎవ్వరికైనా పనిచెయ్యడం ముఖ్యం కానీ ఆర్భాటంగా మాటలు చెప్పడం కాదు. పెద్దలు, మహాత్ములు చెప్పిన విషయాలను చిలకపలుకులలాగా వల్లె వేయడం వల్ల ఎంతమాత్రం ఉపయోగం లేదు. వివేకానంద స్వామి "ఒక గ్రాము ఆచరణ ఇరవైవేల టన్నుల బడాయి మాటల కన్నా గొప్పది" అని చెప్పారు. ప్రవక్తలైన మహమ్మదు, ఏసుక్రీస్తు, బుద్ధుడు, శ్రీకృష్ణుడు చెప్పిన బోధలను ఆచరణలో పెట్టి చూపాలి కానీ, వారి గొప్పతనాన్ని స్తుతించడం వలన ప్రపంచానికి మంచి జరగదు.

4. పద్దయ్య పూజ

ఒక పల్లెటూరిలో పద్మలోచనుడు అనే బాలుడు ఉండేవాడు. ఆ ఊరివాళ్ళంతా అతణ్ణి ముద్దుగా "పద్దయ్య" అని పిలిచేవారు. వాడొక ఆకతాయి పిల్లవాడు. అందరినీ ఆటలు పట్టిస్తూ తిరిగేవాడు.

ఆ ఊళ్ళోనే పాడుబడిపోయిన గుడి ఒకటి ఉండేది. అందులో విగ్రహం లేదు. బాగా పిచ్చి మొక్కలు పెరిగాయి. దాని మొండిగోడల మీద రావిచెట్లు, మర్రిచెట్లు బాగా వేళ్ళూనుకుని పెరిగాయి. గబ్బిలాలు గుంపులు గుంపులుగా అందులో తిరుగుతూ ఉండేవి. గుడి లోపల వాటి పెంటతో, దుర్గంధంతో నిండి ఉండేది. అందువల్ల గ్రామస్థులు ఆ గుడికి వెళ్ళడం మానుకున్నారు.

ఇలా ఉండగా ఒకరోజు సాయంకాలం హఠాత్తుగా ఆ గుడిలో నుంచి జేగంటల శబ్దమూ, శంఖారావమూ వినపడసాగాయి. గ్రామస్థులు అందరూ ఆశ్చర్యపోయారు. ఎవరో మహానుభావుడు వచ్చి గుడిని శుభ్రంచేసి, విగ్రహాన్ని పెట్టి, సాయంకాలం పూజ చేస్తున్నాడనుకున్నారు. తాము కూడా పోయి పూలు, పళ్ళు దేవుడికి నైవేద్యంగా అర్పిద్దామని అనుకున్నారు.

గ్రామస్థులు పూలు, అగరువత్తులు, కర్పూరం తీసుకుని గుడి దగ్గరికి చేరారు. గుడి తలుపులు మూసి ఉన్నాయి. గ్రామస్థులు భక్తితో గుడి బయట నిలబడి వేచిచూడసాగారు. ఎంతసేపు గడిచినా తలుపులు తెరుచుకోలేదు. ఇంకా ఘంటానాదం, శంఖారావం వినిపిస్తూనే ఉన్నాయి. అప్పుడు ఒక గ్రామస్థుడు ధైర్యం చేసి తలుపుల సందులలోంచి తొంగిచూశాడు. గుడి లోపల ఎప్పటిలాగానే అపరిశుభ్రంగా ఉంది. విగ్రహం లేదు, ఏమీ లేదు. పద్దయ్య మాత్రం ఒక మూల నిలబడి జేగంట వాయిస్తూ, శంఖం ఊదుతున్నాడు. అప్పుడు గ్రామస్థులు తలుపులు తెరిచి పద్దయ్యను, “ఇదేమిటి పద్దయ్యా! గర్భగుడి ఎలా ఉందో చూశావా? అసలే విగ్రహం లేదు. పైగా పిచ్చి మొక్కలతో, గబ్బిలాల పెంటతో అంతా కంపుకొడుతూ ఉంది. కనీసం నేలకూడా శుభ్రం చెయ్యలేదు. అవేమీ లేకుండా ఎందుకు నువ్వు ఊరికే జేగంట వాయిస్తూ, శంఖం ఊదుతున్నావు?” అని మందలించారు.

అదే విధంగా మన శరీరంలో కూడా హృదయమనే దేవాలయం ఉంది. అది పాడుబడిపోయింది. దానిలో చెడు ఆలోచనలతో కూడిన మనస్సు, చెడు విషయాల కోసం తిరుగాడే కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు అనే గబ్బిలాలు ఆ గుడిని అపరిశుభ్రం చేస్తున్నాయి. మనం ఆ దేవాలయాన్ని శుభ్రం చేసినప్పుడు భగవంతుడే వచ్చి ఆ దేవాలయంలో తనను తాను ప్రతిష్ఠించుకుంటాడు.

5. కృష్ణుడు నీ అన్న!

ఒక ఊళ్ళో ఒక పేద వితంతువు ఉండేది. ఆమెకు జటిలుడు అనే కొడుకు ఉండేవాడు. అతడు ఇంకా చిన్న పిల్లవాడు. ఆ ఊళ్ళో బడి లేదు. అందుకని ఆమె తన కొడుకును ప్రక్క ఊరిలో ఉన్న బడిలో చేర్పించింది. ఆ ఊరికి వెళ్ళాలంటే ఒక చిన్న అడవిని దాటి వెళ్ళాలి.

ముందు కొన్ని రోజులు తల్లి జటిలుణ్ణి బడికి తీసుకువెళ్ళి దిగబెట్టి, సాయంత్రం మళ్ళీ తీసుకువచ్చేది. కానీ అలా చేయడం వల్ల ఆమెకు

పనిచేసుకోవడం కష్టమయింది. కొన్ని రోజులు అలవాటు అయిన తర్వాత ఆమె ఆ పిల్లవాణ్ణే వెళ్ళమని చెప్పింది. జటిలుడు కూడా తాను ఒంటరిగా బడికి వెళ్ళగలనని చెప్పాడు.

మొదటిరోజు వెళ్ళివచ్చాడు. కానీ రెండవరోజు తిరిగివచ్చేటప్పుడు వాడికి భయం వేసింది. "అమ్మా! ఒక్కణ్ణే అడవిలో నడచి రావడానికి భయంగా ఉందమ్మా!" అని తల్లితో చెప్పాడు. కానీ ఆమె ఏమి చేయగలదు? అందుకని ఆమె కొంచెం ఆలోచించి, "నాయనా! నీకు ఎందుకు భయం? కృష్ణుణ్ణి పిలువు!" అని చెప్పింది. జటిలుడు, "కృష్ణుడు ఎవరమ్మా?" అని ప్రశ్నించాడు. "కృష్ణుడు నీ అన్న! వాడు అడవిలో ఉంటాడు. నువ్వు పిలిస్తే నీకు తోడుగా వస్తాడు!" అని తల్లి అతడితో చెప్పింది. అది విని జటిలుడు సంతోషించాడు. వాడికి ధైర్యం వచ్చింది.

మరునాడు జటిలుడు మామూలుగా బడికి వెళుతున్నాడు. అతడికి భయం వేసింది. "అన్నా! కృష్ణా!" అని పిలిచాడు. కానీ ఎవ్వరూ రాలేదు. జటిలుడు ఇంకా భయపడిపోయి, ఏడుస్తూ, "అన్నా! కృష్ణా! ఎక్కడున్నావు? నా దగ్గరికి రావా? నాకు భయం వేస్తున్నది!" అని గట్టిగా పిలిచాడు. అప్పుడు కృష్ణుడు (భగవంతుడు) ఆర్తితో పిలిచిన ఆ పిలుపు విని రాకుండా ఉండలేకపోయాడు. "జటిలా! నేనిక్కడే ఉన్నానురా! భయపడకు! నేను నీకు తోడుగా వస్తానుగా!" అంటూ అతణ్ణి ఓదార్చి అడవి దాటించి బడి దగ్గరికి చేర్చాడు. కృష్ణుడు తిరిగి వెళ్ళిపోతూ, "నువ్వు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తానురా!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మనందరికీ ఒక సందేహం ఉంటుంది. "దేవుడు అసలు ఉన్నాడా? ఉంటే మనకెందుకు కనపడడు?" అని మనం అందరం అనుకుంటూ ఉంటాం. ఈ ప్రశ్నకు శ్రీ రామకృష్ణ పరమహంస చక్కగా సమాధానం చెప్పారు. "మనం దేవుణ్ణి చూడాలనుకుంటే జటిలుడికి ఉన్నటువంటి ఆర్తి మనకు ఉండాలి. అటువంటి ఆర్తితో దేవుడు మాత్రమే కావాలి అని కోరుకోవాలి. అప్పుడు ఆయన తప్పక మనకు కనిపిస్తాడు. ఆకాశంలో మబ్బులు క్రమ్మినప్పుడు సూర్యుడు కనపడడు. అంతమాత్రాన సూర్యుడే లేడని అంటామా? అదే విధంగా మన మనస్సులలో అజ్ఞానమనే మబ్బులు క్రమ్ముకున్నాయి, కనుక మనకు దేవుడు కనపడడం లేదు. ఎప్పుడైతే మనం నిజంగా దేవుణ్ణి కోరుకుంటామో అప్పుడు ఆ మబ్బులు తొలగిపోయి దేవుడు కనిపిస్తాడు."

6. ఇద్దరు రైతులు

ఒక ఊరిలో ఇద్దరు రైతులు ఉండేవారు. ఒకడి పేరు రామన్న, మరొకడి పేరు సోమన్న. వాళ్ళు చాలాకాలంగా అదే గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారు. ఒక ఏడాది వానలు కురవక పొలాలకు నీళ్ళు అందలేదు. రైతులందరూ దిక్కుతోచక గాబరా పడుతున్నారు. రామన్న, సోమన్న దూరంగా ఉన్న నది నుండి కాలువలు త్రవ్వుకుని తమ పొలాలకు నీరు పెట్టుకుందామనుకున్నారు.

రామన్న ఉదయమే కాలువ త్రవ్వడం మొదలు పెట్టాడు. చకచకా పనిచెయ్యసాగాడు. క్రమంగా సూర్యుడు పైకెక్కాడు. స్నానానికి వేళయింది. అతని భార్య స్నానానికి రమ్మని కూతురు ద్వారా కబురు పెట్టింది. కూతురు పొలానికి వెళ్ళి తండ్రితో, "నాన్నా వంటికి నూనె రాసుకుని స్నానం చేసి రమ్మని అమ్మ చెప్పమంది!" అని చెప్పింది. "ఇప్పుడు కాదు. ఇంకా చాలా పని ఉంది. తర్వాత వస్తానని చెప్పు! ఫో ఇక్కడ నుంచి!" అని రామన్న కూతుర్ని పంపివేశాడు.

క్రమంగా మధ్యాహ్నమయింది. సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు. రామన్న కాలువ త్రవ్వుతూ పనిచేస్తున్నాడు. స్నానం మాటే మర్చిపోయాడు. అప్పుడు అతని భార్య పొలానికి వచ్చింది. భర్తతో, "ఇంకా స్నానమే చెయ్యలేదా? అక్కడ వండిన వంట చల్లారిపోతోంది. నీకు ఏ పని పట్టుకున్నా ఒళ్ళు తెలియదు. పని ఆపి స్నానం చెయ్యి. భోజనం చేసిన తర్వాత చూసుకోవచ్చు. ఇంటికి పోదాం!" అని పిలిచింది. రామన్న కోపంతో మండిపడ్డాడు. చేతిలో పలుగు పట్టుకుని, "నీకు అసలు బుద్ధి ఉందా? పొలం ఎండిపోతోంది. ఇప్పుడు పని చెయ్యకపోతే పొలానికి నీరు ఎలా వస్తుంది? పంట పండకపోతే నువ్వూ, పిల్లలూ ఏమి తింటారు? మీరంతా ఆకలితో మాడి చావాల్సి వస్తుంది. పని పూర్తయ్యేదాకా స్నానం చెయ్యను సరికదా మంచినీళ్ళు కూడా ముట్టను! ఫో అవతలికి!" అంటూ భార్యను తరిమివేశాడు. అతడి కోపం చూసి భార్య భయపడి వెళ్ళిపోయింది.

రామన్న రెక్కలు ముక్కలు చేసుకుని సాయంత్రానికి పొలానికి నీరు పెట్టాడు. నీరు గలగలా పొలంలోకి పారుతుంటే అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది. సంతోషంగా ఇంటికి వెళ్ళాడు. స్నానానికి నూనె, నీళ్ళు ఇమ్మన్నాడు. హాయిగా స్నానం చేసి, భోజనం చేసి, గుర్రు పెట్టి నిద్రపోయాడు.

అతడి పొలం చక్కగా పండింది.

అలాగే సోమన్న కూడా ప్రొద్దున్నే కాలువ త్రవ్వడం మొదలు పెట్టాడు. కొంత ప్రొద్దెక్కాక భార్య వచ్చి రమ్మని పిలిచింది. వెంటనే సోమన్న పని ఆపివేసి ఇంటికి వెళ్ళిపోయాడు. మరునాడు కూడా ఇలాగే జరిగింది. నాలుగు రోజులు గడచినా సోమన్న పొలానికి నీరు పెట్టలేక పోయాడు. పొలం ఎండిపోయింది. తిండి గింజలు దొరకక సోమన్న కుటుంబం నానాబాధలూ పడ్డారు.

కాబట్టి మనకు కూడా రామన్నకు ఉన్నటువంటి పట్టుదల ఉండాలి. చేపట్టిన పనిని పూర్తయ్యే వరకూ వదలకూడదు. అప్పుడే మనం గొప్పవాళ్ళం కాగలుగుతాము.

"వైరాగ్యం అంటే ఏమిటి?" అని మనందరికీ సందేహం కలుగుతూ ఉంటుంది. వైరాగ్యం అంటే అన్నీ వదిలిపెట్టి సన్న్యాసం తీసుకోవడం అని అనుకుంటూ ఉంటాము. కానీ అదే కానవసరం లేదు. చేపట్టిన పని మీదనే మనస్సును పూర్తిగా పెట్టి, మిగిలిన విషయాల గురించి ఆలోచించకుండా ఉండడమే "వైరాగ్యం". ఇది సన్న్యాసులకే కాక అందరికీ అవసరమే. అంతేకాక చేపట్టిన పనిని రామన్న చూపించినటువంటి విపరీతమైన పట్టుదలతో చెయ్యాలని శ్రీరామకృష్ణ పరమహంస బోధించారు. దానినే "తీవ్రవైరాగ్యం" అంటారని ఆయన చెప్పారు. మరి ఇటువంటి సుగుణాన్ని అలవరచుకోవడానికి కావలసిన పద్ధతి ఏమిటి? మళ్ళీమళ్ళీ ఆ విధమైన పట్టుదలతో పనిచెయ్యడానికి ప్రయత్నించడం ద్వారా మనం దాన్ని అలవాటు చేసుకోవచ్చు. దీనినే "అభ్యాసం" అంటారని శ్రీరామకృష్ణ పరమహంస బోధించారు.

7. నూతిలో కప్ప

ఒక నూతిలో ఒక కప్ప ఉండేది. అది అక్కడే పుట్టింది. అక్కడే పెరిగింది. దానికి వేరే లోకం తెలియదు. మిగిలిన కప్పలతో హాయిగా ఆడుకుంటూ అక్కడే జీవిస్తోంది.

ఒకసారి సముద్రం పొంగి గొప్ప ఉప్పెన వచ్చింది. ఉప్పెనతో పాటు కొట్టుకు వచ్చిన ఒక సముద్రపు కప్ప ఈ బావిలో పడింది. నూతిలో కప్ప ఈ క్రొత్తగా వచ్చిన కప్పను, "నువ్వెక్కడ నుంచి వచ్చావు?" అని అడిగింది. "నేను సముద్రం నుంచి వచ్చాను", అని ఆ క్రొత్త కప్ప సమాధానం చెప్పింది. "సముద్రమా! అదేమిటి? ఆ పేరు కూడా వినలేదే!" అని నూతిలో కప్ప

ఆశ్చర్యాన్ని ప్రకటించింది. "సముద్రం చాలా పెద్దది. చాలా లోతుగా ఉంటుంది! అసలు సముద్రం ఎంత పెద్దదో చెప్పలేం!" అని సముద్రపు కప్ప బదులు పలికింది.

కానీ నూతిలో కప్పకి ఆ మాటలు నమ్మబుద్ధికాలేదు. తన కాళ్ళను బారజాపి "మీ సముద్రం ఇంత ఉంటుందా?" అని అడిగింది. "లేదు లేదు, సముద్రం చాలా పెద్దది" అని సముద్రపు కప్ప చెప్పింది. నూతిలో కప్ప నూతిలో ఒక మూలనుండి ఇంకో మూలకి గంతువేసి, "మీ సముద్రం ఇంత ఉంటుందా?" అని మళ్ళీ అడిగింది. అప్పుడు సముద్రపు కప్ప, "ఇదేం పోలిక! వట్టి అవివేకం! సముద్రం చాలా పెద్దది! దాన్ని ఈ నూతితో పోల్చడం కుదరదు!" అని చెప్పింది. అది విని నూతిలో కప్ప, "కాదుకాదు! ఈ నూతి కంటే పెద్దదిగా మరొకటి ఉండడానికి వీల్లేదు! ఇది వట్టి అబద్ధాలకోరు. దీన్ని తరిమివేయండి రా!" అని తన తోటి కప్పలతో చెప్పింది. అన్నీ కలసి ఆ సముద్రపు కప్పను తరిమివేశాయి.

చికాగోలో జరిగిన విశ్వమతమహాసభలో ప్రసంగించినప్పుడు వివేకానంద స్వామి ఈ కథను చెప్పారు. వివిధ మతాల మధ్య వివాదాలు ఎందుకు వస్తాయో ఈ విధంగా వివరించారు. ఆ నూతికప్ప ఎలాగైతే తన చిన్న నూతిలో కూర్చుని అదే అన్నిటికన్నా గొప్పదని అనుకుందో అదే విధంగా సంకుచిత మనస్తత్వాలు గలవారు తమ మతమే అన్నిటికన్నా గొప్పదని తలపోస్తారనీ, తాము తప్ప వేరెవ్వరూ గొప్పవారు కావడానికి వీల్లేదని అనుకుంటారనీ, ఆ విధంగా ఉండకూడదనీ ఆయన బోధించారు.

8. బుద్ధుడు - ఆవగింజలు

బుద్ధుడు అవతారపురుషుడు. ఆయన దుఃఖాన్ని పోగొట్టే ఉపాయాన్ని కనుక్కున్నాడు. ఒకసారి బుద్ధభగవానుడి దగ్గరకు ఒక స్త్రీ వచ్చింది. ఆమెకు లేకలేక పుట్టిన కుమారుడు చనిపోయాడు. భరించలేని దుఃఖంతో ఏడుస్తూ ఆ పిల్లవాడి శవాన్ని తీసుకువచ్చి ఆయన పాదాల దగ్గర ఉంచింది. భోరున ఏడుస్తూ ఆమె, "స్వామీ! నా ఒక్కగానొక్క బిడ్డ చనిపోయాడు. మీరు వాణ్ణి బ్రతికించాలి. నా దుఃఖాన్ని పోగొట్టాలి. లేకపోతే నేను ఇక్కడే ప్రాణాలు విడుస్తాను" అని చెప్పింది. బుద్ధభగవానుడు దయతో ఆమె వైపుకు తిరిగి "అమ్మా! మీ కొడుకుని నేను బ్రతికిస్తాను. నాకు కొన్ని ఆవగింజలు తెచ్చి పెట్టగలవా!" అని అడిగాడు. అంతవరకూ నిరాశతో క్రుంగిపోయి ఉన్న ఆమె ఉత్సాహంతో లేచి, ఆవాల



కోసం బయలుదేరింది. వెంటనే బుద్ధుడు ఆమెను ఆపి, "అమ్మా! ఒక చిన్న షరతు. ఏదోవొక చోటినుంచి ఈ ఆవాలు తెస్తే సరిపోదు. ఎప్పుడూ దుఃఖం అంటే ఏమిటో ఎరుగని ఇంటిలో నుంచి మాత్రమే ఈ ఆవాలు తీసుకు రావాలి!" అని చెప్పాడు. ఆమెకు అది అంత కష్టమైన పనిలాగా తోచలేదు. ఆమె ఒక ఇంటికి వెళ్ళి తన కుమారుణ్ణి బ్రతికించడానికి ఆవాలు కావాలని అడిగింది. ఆ ఇంటిలో వాళ్ళు వెంటనే తెచ్చారు. కానీ "మీ ఇంటిలో ఎప్పుడూ దుఃఖం కలగలేదా!" అని అడిగినప్పుడు, కొన్ని రోజుల క్రితం తమ తండ్రి చనిపోవడం వల్ల దుఃఖం కలిగిందని చెప్పారు. అందువల్ల ఆమెకు ఆవాలు తీసుకోవడానికి వీలు లేకపోయింది. తర్వాత ఆమె ఎన్నో గడపలెక్కి దిగింది. ప్రతి ఇంటిలోనూ ఎవరో ఒకరు చనిపోయారనో, లేక ఏదోవొక కారణంవల్ల దుఃఖం కలిగిందనో చెపుతూనే వచ్చారు. తిరిగితిరిగి వేసారి మధ్యాహ్నానికి వట్టిచేతులతో తిరిగి వచ్చింది. దుఃఖమనేది తనకే గాక అందరికీ కలుగుతుందని ఆమెకు తెలిసి వచ్చింది. బుద్ధభగవానుని వల్ల జ్ఞానోదయం కలిగి ఆ శవాన్ని దహనం చేసి ఆయన శిష్యురాలైంది.

ఈ ప్రపంచంలో అన్నీ ఏదోవొక నాడు అంతరించేవే. ఏదీ ఎల్లకాలం ఉండదు.

9. నీ పొరుగువారిని నీవలె ప్రేమించు!

"నీ పొరుగువారిని నీవలె ప్రేమించు!" అని క్రైస్తవ మతంలో చెప్పబడింది. నిజమైన మంచితనం గల పొరుగువాడెవరో తెలిపేందుకు ఏసుక్రీస్తు ఒక కథ చెప్పారు.

ఒకసారి ఒక బాటసారి జరూసలేము నుండి బయలుదేరి పోతున్నాడు. దారిలో అతడు కొందరు దొంగల చేతిలో చిక్కాడు. వారు అతని వద్ద ఉన్న డబ్బు, వస్తువులు దోచుకుని, అతణ్ణి చితక్కొట్టి, కొన ఊపిరితో రోడ్డు ప్రక్కన పడవేసి వెళ్ళిపోయారు. అప్పుడొక మతగురువు ఆ దారిన వెళ్ళడం తటస్థించింది. ఆ మతగురువు అతణ్ణి చూసీచూడనట్లు ప్రక్కగా వెళ్ళిపోయాడు. అలాగే ఒక వ్యాపారస్థుడు కూడా ఆ దారిన ప్రయాణిస్తూ అతణ్ణి చూసి, పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఒక దయగల సమరీయుడు అటుపోతూ, ఆ బాటసారిని చూసి జాలిపడ్డాడు. అతడి దగ్గరకు వెళ్ళి, గాయాలకు కట్టుకట్టి, తన బండిమీద ఎక్కించుకుని ఒక పూటకూళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి ప్రేమతో అతడికి ఆ రోజు సేవచేశాడు. మరునాడు అతడు కొంత డబ్బును ఆ పూటకూళ్ళ వాడికిచ్చి, "ఇతని మంచి చెడ్డలు కనిపెట్టు. ఇతడి కోసం నీవు ఇంకా ఎక్కువ ఖర్చుచేస్తే నేను మళ్ళీ వచ్చినప్పుడు నీకా డబ్బు ఇస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.




"కష్టాలలో ఉన్న వారిమీద జాలిపడి ఆదుకొన్నవాడే నిజమైన పొరుగువాడు" అని ఈ కథ తెలియజేస్తోంది. కాబట్టి కష్టాలలో ఉన్న వారెవరైనా సరే, వారిని మన ఇరుగుపొరుగు వారిలాగా భావించి సేవచెయ్యాలి.

10. మహమ్మదు ప్రవక్త - నీగ్రో బానిస

అది 1400 సంవత్సరాల క్రితం మాట. మహమ్మదు ప్రవక్త "మక్కా"ను జయించి మదీనాలో ఉన్నారు. మదీనా చారిత్రాత్మకమైనది. చాలా పవిత్రస్థలం.

బిలాల్ అనే ఒక నీగ్రో బానిస అక్కడ నివసించేవాడు. ఆ కాలంలో నీగ్రోలు హీనంగా చూడబడేవాళ్ళు. కానీ ప్రవక్త దృష్టిలో అందరూ సమానమే. ఒకరోజు

నమాజుకు వేళయింది. మహమ్మదు ప్రవక్త నమాజు చేయడానికి అందరినీ పిలవమని బిలాల్‌ను ఆదేశించారు. ప్రవక్త ఆదేశానుసారం ఆ నీగ్రో వెంటనే మిద్దె మీదకి వెళ్ళి, నమాజుకు పిలవడానికి నిలబడ్డాడు. నల్లని రంగు, మొద్దు పెదవులు ఉన్న అతణ్ణి చూచి గర్విష్టులైన అరబ్బులు, "ఛీ! ఈ నల్ల నీగ్రో బానిస మనను నమాజుకు పిలవడమా! వీడు నాశనంగానూ!" అన్నారు. వారికి సమాధానం చెప్తున్నారా అన్నట్లుగా ప్రవక్త ఇలా చెప్పారు, "మన గర్వం, పాపం, అజ్ఞానం తొలగించిన అల్లాకు జయమగుగాక! ప్రజలారా, ఇది గమనించండి. ప్రజలంతా రెండు తెగలుగా విభజింపబడ్డారు. దేవుని నమ్మిన పుణ్యాత్ములు ఒకరు. పాపాత్ములు, కఠినాత్ములు ఇంకొకరు. అలా కాకపోతే అంతా దేవుని సంతానమే."



ఈ మాటలతో మహమ్మదు ప్రవక్త వారిలో గొప్ప మార్పును తెచ్చారు. గౌరవనీయులు, మర్యాదస్తులైన అరబ్బులు తమ కుమార్తెలను ఆ నీగ్రో బానిసకిచ్చి పెళ్ళి చేయడానికి ముందుకు వచ్చారు. ఎంత మార్పు! ఎంత సమభావం!

"ఇస్లాం మతస్థుడు ఏ దేశపు వాడైనా మొత్తం ప్రపంచంలో వున్న ముస్లింలందరూ అతణ్ణి తమ సోదరుడిగా భావిస్తారు. ఒక 'రెడ్ ఇండియన్' ఇస్లాం మతాన్ని స్వీకరిస్తే, టర్కీ సుల్తాను అయినా సరే అతడితో కలసి ఆహారం తీసుకోవడానికి సందేహించడు" అని వివేకానంద స్వామి అన్నారు.

ఒక విత్తనం నేలను, నీటిని, గాలిని ఉపయోగించుకుని ఆ విత్తనం ఏ చెట్టుదో అటువంటి చెట్టుగా ఎదుగుతుంది. కానీ తానే ఆ నేలగానో, నీటిగానో, గాలిగానో మారిపోదు. మనం హిందువుల ఆధ్యాత్మికతను, బౌద్ధమతస్థుల కరుణను, క్రైస్తవుల పనిచేసేగుణాన్ని, మహమ్మదీయుల సోదరభావాన్ని కలబోసిన ఒక నూతన సమాజాన్ని నిర్మించాలని వివేకానంద స్వామి బోధించారు.

11. కార్తికేయుడు

కార్తికేయుడు పార్వతీదేవికి, శివుడికి పుట్టిన కొడుకు. కార్తికేయుడు జీవితమంతా పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయాడు. అలా ఎందుకు జరిగిందో తెలిపే కథ ఒకటి ఉంది. దాన్ని శ్రీరామకృష్ణ పరమహంస బోధించారు. ఆ కథను తెలుసుకుందాం.

కార్తికేయుడు ఒకసారి ఒక పిల్లితో ఆడుకుంటున్నాడు. ఆటలో దాని ముఖం మీద గిల్లాడు. తరువాత అతడు తన తల్లి దగ్గరికి వెళ్ళినప్పుడు ఆమె బుగ్గమీద ఒక గాయం కనిపించింది. "అమ్మా! నీ బుగ్గమీద ఎంత దెబ్బ తగిలిందో చూడు! ఎలా తగిలింది అమ్మా!" అని అడిగాడు. పార్వతీదేవి, "నువ్వే కదా, నాయనా! నన్ను గిల్లావు!" అని సమాధానం చెప్పింది.

కార్తికేయుడు నివ్వెరపోయి, "అమ్మా! నిన్ను నేను ఎప్పుడు గిల్లాను? నాకేమీ గుర్తు లేదే!" అన్నాడు. పార్వతీదేవి, "నాయనా! ఈ రోజు ఉదయం ఆ పిల్లిని గిల్లావు కదా! మర్చిపోయావా? అని అడిగింది. కార్తికేయుడు, "అది నిజమే! మరి నేను ఆ పిల్లిని గిల్లితే నీ బుగ్గమీద ఎందుకు గాయం అయింది?" అని మళ్ళీ అడిగాడు. అప్పుడు ఆ జగజ్జనని, "నాయనా! ఈ ప్రపంచంలోని ప్రతి ప్రాణిలోనూ నేను ఉన్నాను. నేను కానిది వేరుగా ఏదీ లేదు. ఈ సృష్టి అంతా నేనే! అందువల్ల నువ్వు ఎవరిని గాయపరిచినా నన్ను గాయపరచినట్టే!" అని చెప్పింది. అది విని కార్తికేయుడు చాలా ఆశ్చర్యపోయాడు. జీవితంలో తానెప్పటికీ పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయించుకున్నాడు. అందరు స్త్రీలలోనూ తన తల్లి మూర్తీభవించి ఉంది కదా! ఇంక ఎవరిని పెళ్ళి చేసుకుంటాడు?

సృష్టిలోని ప్రతివొక్క జీవి ఆ జగజ్జనని సంతానమే. ఈ విశ్వమే ఒక శరీరం అనుకుంటే అందులో మనమంతా వివిధ భాగాలు. "తోటివారికి సహాయం చెయ్యడం ద్వారా మనకు మనమే సహాయం చేసుకుంటున్నాం. అలాగే ప్రక్క వారికి హాని చెయ్యడం ద్వారా మనకు మనమే హాని చేసుకుంటున్నాం," అని వివేకానంద స్వామి బోధించారు.

12. గృహస్థు - సన్న్యాసి

పూర్వం ఒక రాజు "గృహస్థు గొప్పవాడా? సన్న్యాసి గొప్పవాడా?" అని తన దగ్గరికి వచ్చిన వారిని అందరినీ ప్రశ్నించేవాడు. కానీ ఆ రాజుకు తృప్తి కలిగించే సమాధానం ఎవ్వరూ ఇవ్వలేకపోయారు.

చివరికి ఒక వృద్ధ సన్యాసి తన రాజ్యానికి రాగా, రాజు అతణ్ణి కూడా అదే ప్రశ్న వేశాడు. దానికి ఆ వృద్ధసన్యాసి, “రాజా! ఎవరి స్థానంలో వారు గొప్ప!” అని బదులు చెప్పాడు. ఆ విషయాన్ని నిరూపించమని రాజు ఆ వృద్ధసన్యాసిని కోరాడు. “ఋజువు చేస్తాను గానీ అందుకోసం మీరు కొన్ని రోజులు నాతోపాటు రావాలి” అన్నాడు సన్యాసి. రాజు దానికి సమ్మతించి మారువేషంలో, ఆ వృద్ధసన్యాసితో బయలుదేరాడు. వారు అనేక దేశాలను దాటి చివరికి ఒక పెద్దరాజ్యం యొక్క రాజధాని నగరాన్ని చేరారు. అక్కడ ఆ దేశపు రాజకుమార్తె యొక్క స్వయంవరం జరుగుతోంది. నగరం అంతా పండుగ వాతావరణంతో కోలాహలంగా ఉంది. ఒక అందమైన యువకుణ్ణి వివాహం చేసుకోవాలని ఆ రాజకుమారి కోరుకుంది. అంతకు ముందు చాలాసార్లు ఇలాంటి స్వయంవరం ఏర్పాట్లు జరిగాయి. కానీ ఆ రాజకుమారి తనకు నచ్చిన వరుణ్ణి ఎన్నుకోలేకపోయింది. రాజకుమారి చేతిలో వరమాలతో నగర వీధులలో ఏనుగు మీద ఎక్కి తిరుగుతూ తనకు నచ్చే వరుణ్ణి అన్వేషిస్తోంది. ఆ సమయంలో అక్కడికి ఒక యువసన్యాసి వచ్చాడు. అతడు, ‘సూర్యుడే ఆకాశం నుంచి దిగి వచ్చాడా!’ అన్నంత దివ్యసుందరమూర్తిలా ఉన్నాడు. అతడు ఒక మూల నిలబడి ఆ జరుగుతున్న స్వయంవరాన్ని చూస్తున్నాడు. చెలికత్తెలు రాజకుమార్తెను అక్కడకు తీసుకురాగానే ఆమె జగన్మోహనాకారుడైన ఆ యువసన్యాసిని చూసి అతని మెడలో పూలమాలను వేసింది. ఆ యువసన్యాసి, “ఇదేం అవివేకం? నేను సన్యాసిని! నాకు పెళ్ళి ఏమిటి?” అంటూ ఆ పూలమాలను తీసిపారవేశాడు. అప్పుడు ప్రక్కనే ఉన్న ఆ దేశపురాజు, “ఇతడు పేదవాడు కాబట్టి రాజకుమారిని పెళ్ళిచేసుకోవడానికి జంకుతున్నాడు కాబోలు” అనుకుంటూ అతడితో, “నా కుమార్తెతోబాటు అర్ధరాజ్యం కూడా మీదవుతుంది. నా తరువాత నా రాజ్యమంతా మీదే!” అని చెప్పాడు. కానీ ఆ యువసన్యాసి, “చాలు! చాలు! పెళ్ళి వద్దు, ఏమీ వద్దు!” అంటూ రివ్వున అక్కడనుండి వెళ్ళిపోయాడు.

రాజకుమారి ఆ యువసన్యాసిని మోహించి, “చేసుకుంటే ఇతణ్ణే పెళ్ళి చేసుకోవాలి, లేదా మరణమే శరణ్యం!” అంటూ అతణ్ణి ఒప్పించడానికి అతని వెనుకనే నడిచిపోసాగింది.

ప్రక్కనే ఉండి వృద్ధసన్యాసి, మారువేషంలో ఉన్న రాజు ఇదంతా చూస్తున్నారు. ఆ వృద్ధసన్యాసి, “వీరి వెంట వెళదాం పదండి!” అన్నాడు.

వారిద్దరూ ఆ రాజకుమారి వెనుక కాస్త దూరంలో నడవసాగారు.

యువసన్యాసి పరుగులాంటి నడకతో చకచకా నడుస్తూ, ఒక అరణ్యంలో ప్రవేశించాడు. రాజకుమారి అతణ్ణి వెంబడిస్తూనే ఉంది. రాజు, వృద్ధసన్యాసి వాళ్ళ వెనుకే వున్నారు. యువసన్యాసికి ఆ అరణ్యం బాగా తెలిసినది కావడంతో హఠాత్తుగా అదృశ్యమై పోయాడు. అతణ్ణి కనిపెట్టడానికి రాజకుమారి ఎంతో ప్రయత్నించి, చివరకు ఒక చెట్టుకింద కూలబడి విలపించసాగింది. పాపం ఆమెకు ఆ అరణ్యం నుండి బయటపడే మార్గం కూడా తెలియదు. అప్పుడు రాజు, వృద్ధసన్యాసి ఆమె వద్దకు వెళ్ళి, “అమ్మా! విచారించవద్దు, ఈ అరణ్యం నుండి బయటపడే మార్గం మేము చూపిస్తాం. కానీ ఇప్పుడు చీకటి పడింది. ఇక్కడున్న పెద్ద చెట్టుక్రింద ఈ రాత్రికి విశ్రమించి, ఉదయం కాగానే బయలుదేరుదాం” అన్నారు.

ఆ చెట్టు మీదనే గూడు కట్టుకుని ఒక పావురాల జంట నివసిస్తోంది. గూటిలో వాటి పిల్లలు మూడు ఉన్నాయి. మగ పావురం కిందవున్న ముగ్గురినీ చూసి తన భార్యతో ఇలా అంది. “ప్రేయసీ! ఇప్పుడు ఏమి చెయ్యాలి? వీళ్ళు మన ఇంటికి వచ్చిన అతిథులు కదా! ఇది శీతాకాలం కూడా. చలి కాచుకోవడానికి వీరి దగ్గర నిప్పు కూడా లేదు.” ఇలా అంటూ ఆ పక్షి రివ్వున ఎగిరిపోయి ముక్కున ఒక చంద్రనిప్పు కరచుకుని వచ్చి అతిథులముందు పడవేసింది. వాళ్ళు దానికి ఎండుటాకులు, కట్టెలుచేర్చి మంట చేసుకున్నారు. కానీ ఆ పావురం అంతటితో తృప్తి చెందక తన భార్యతో ఇలా అంది. “ప్రియా! ఇప్పుడేం చేద్దాం? వీరికి ఆకలిగా వుంది, మన వద్ద పెట్టడానికి ఏమీలేదు. మనమేమో గృహస్థులం, ఇంటికి వచ్చిన వారి ఆకలి తీర్చడం గృహస్థధర్మం కదా. నాకు చేతనైన పని నేను చెయ్యాలి, కాబట్టి నా శరీరాన్ని వీరికి అర్పిస్తాను.” ఇలా అంటూ ఆ పావురం అగ్నిజ్వాలలోకి దూకింది. ఆ పావురం అగ్నిలో పడిపోవడం చూసి, అతిథులు రక్షించడానికి ప్రయత్నించారు కానీ లాభం లేకపోయింది.

అప్పుడు ఆడపావురం తన భర్త చేసిన పనిని చూసి, “ఇక్కడ ఉన్నవారు ముగ్గురు. వీరు తినడానికి ఒక చిన్నపక్షి శరీరం ఎంత మాత్రమూ చాలదు. భర్త ప్రయత్నాన్ని వృథా కానీయకుండా చూడడమే కదా భార్య ధర్మం! కాబట్టి నా శరీరాన్ని కూడా వీరికి సమర్పిస్తాను” అనుకుంది. ఇలా అనుకుని ఆ ఆడపావురం తాను కూడా అగ్నిలోకి దూకింది. తమ తల్లిదండ్రులు చేసిన

ఆత్మార్పణను చూసిన పావురాల పిల్లలు ఇలా అనుకున్నాయి: “మన తల్లిదండ్రులు తమ శక్తికొద్దీ ప్రయత్నించినా, అతిథులకు తగినంత ఆహారం సమకూరలేదు. తల్లిదండ్రుల ఉద్దేశ్యాన్ని నెరవేర్చడం పిల్లల ధర్మం కదా! కాబట్టి మన శరీరాలను కూడా వారికి అర్పిద్దాం!” ఇలా ఆలోచించి ఆ పక్షిపిల్లలు కూడా అగ్నిలో దూకాయి.

కళ్ళ ముందు జరిగినదంతా చూసి వారు ఆశ్చర్యచకితులై, ఆ పక్షులను తినలేకపోయారు. ఏమీ తినకుండానే ఆ రాత్రి గడిపారు. ఉదయం కాగానే ఆ రాజు, వృద్ధ సన్న్యాసి రాజకుమారికి దారి చూపించగా, ఆమె తన తండ్రి దగ్గరకు వెళ్ళిపోయింది.

అప్పుడు వృద్ధసన్న్యాసి రాజుతో ఇలా అన్నాడు, “రాజా! ఎవరి స్థానంలో వారు గొప్ప అనే విషయం నీకిప్పుడు స్పష్టమైంది కదా! సంసారివై ఉండాలనుకుంటే ఏ క్షణంలోనైనా ఇతరుల మేలుకోసం ఆత్మార్పణ చేయడానికి సంసిద్ధుడవై, ఆ పక్షులలాగా జీవించు. అలా జీవించడమే గృహస్థధర్మం. సంసారాన్ని త్యాగం చేయాలనుకుంటే సౌందర్యరాశి అయిన రాజకుమారిని, రాజ్యాన్ని గడ్డిపోచలాగా వదిలిపెట్టిన ఆ యువసన్న్యాసిలా బ్రతుకు. సంపదలను, సౌందర్యాన్ని, అధికారాన్ని కన్నెత్తి అయినా చూడవద్దు. అలా జీవించడమే సన్న్యాసధర్మం. గృహస్థు, సన్న్యాసి – ఎవరి స్థానంలో వారు గొప్ప. అంతేకానీ ఒకరి ధర్మాన్ని మరొకరి ధర్మంతో పోల్చకూడదు. ఒకరి కంటే మరొకరు గొప్ప అని అనకూడదు.”

ఈ కథను వివేకానంద స్వామి బోధించారు. “అన్ని పనులూ గొప్పవే. ఒకటి గొప్పది కాదు, మరొకటి తక్కువది కాదు. మనం ఎలా జీవించాలనుకుంటున్నామో ముందు నిర్ణయించుకోవాలి. జీవితంలో ఏది సాధించాలనుకుంటున్నామో కూడా నిర్ణయించుకోవాలి. అలా ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత మిగిలిన ఆలోచనలన్నింటినీ విడిచిపెట్టి దాని కోసమే పనిచెయ్యాలి. మనం ఎంచుకున్న పనిలో లోతుగా మునిగిపోవాలి. ఇలా చెయ్యడం ద్వారా మాత్రమే మనం బాగుపడి, ఇతరులకు కూడా సహాయపడగలుగుతాము” అని వివేకానంద స్వామి బోధించారు.

✡ ✡ ✡ ✡ ✡

పంచతంత్ర కథలు

1. మేకును పీకిన కోతి కథ




అవ్యాపారేషు వ్యాపారం
యో నరః కర్తుమిచ్ఛతి ।
స ఏవ నిధనం యాతి
కీలోత్పాటీవ వానరః ॥

(అర్థం: ఎవడైతే తనకు సంబంధం లేని పనుల్లో జోక్యం చేసుకుంటాడో వాడు మేకును పీకిన కోతిలాగా నశిస్తాడు.)

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు అరిదుర్గం. ఆ ఊరిలో శుభదత్తుడు అనే వర్తకుడు ఉన్నాడు. ఆ ఊరికి దగ్గరగా ఉన్న ఒక తోటలో ఒక పాడుబడిన దేవాలయం ఉంది. అతడు ఆ దేవాలయాన్ని బాగు చేయించడం మొదలుపెట్టాడు. అందుకోసం అతడు కలప కొని వడ్రంగులచేత దూలాలుగా కోయిస్తున్నాడు. వడ్రంగులు ప్రతి దూలాన్నీ మధ్యకి కోస్తూ, రంపాన్ని సులువుగా అటూయిటూ లాగేందుకు వీలుగా దానిలో ఒక కొయ్యమేకును కొట్టేవారు. ఒకనాడు వడ్రంగులు ఒక దూలాన్ని రంపంతో కొంతవరకు కోసి, భోజనానికి వేళ కావడంతో ఇళ్ళకు వెళ్ళారు. దూలంలోకి కొట్టిన కొయ్యమేకు ఇంకా అలాగే ఉంది. ఆ సమయంలో చాలా కోతులు అక్కడకు వచ్చాయి. ఆ కోతులన్నీ ఆ ఆలయం మీద, చుట్టుపక్కల కుప్పిగంతులు



వేయసాగాయి. ఆ గుంపులోని ఒక కోతి ఆ దూలాలు ఉన్నచోటుకు వచ్చింది. ఊరికే ఉండలేక సగం కోసిన దూలం మీద కూర్చుని ఆడుతోంది. చీలిక మధ్యలోకి కాలు దూర్చి కూర్చుంది. చేతులతో కొయ్యమేకును ముందుకీ వెనక్కీ నాలుగుసార్లు ఊపి, బలంగా పైకిలాగింది. హఠాత్తుగా మేకు ఊడిరావడంతో దూలం చీలికలు రెండూ 'ఠపీ'మని ఏకం అయ్యాయి. వాటి మధ్య కోతి నలిగి చచ్చిపోయింది.



నీతి: తనకు సంబంధించని పనులలో జోక్యం చేసుకోకూడదు.

2. నక్క - యుద్ధభేరి కథ

పూర్వమేవ మయా జ్ఞాతం పూర్ణమేతద్ధి మేదసా ।
అనుప్రవిశ్య విజ్ఞాతం యావచ్చర్మ చ దారు చ ॥

(అర్థం: విషయం తెలియక ముందు నక్క ఆ భేరిని చూసి అది క్రొవ్వుతో నిండి ఉందనుకుంది. నిజానికి భేరి లోపల ఖాళీగా ఉండి, పైన చర్మం, చెక్క మాత్రమే ఉన్నాయి.)

ఒక అడవిలో ఒక నక్క ఉండేది. దానికి చాలా రోజులు ఆహారం





దొరకలేదు. అది ఆకలితో అల్లాడుతూ తిండికోసం అక్కడా ఇక్కడా తిరిగింది. తిరిగి తిరిగి ఒక యుద్ధభూమికి చేరింది. అక్కడ దానికి చాలా శవాలు ఆహారంగా కనిపించాయి. ఆ యుద్ధభూమికి ఒక మూల ఒక చెట్టు క్రింద ఒక యుద్ధభేరి పడివుంది. చెట్టుకొమ్మలు గాలికి ఊగి, ఆ భేరీకి తగిలినప్పుడల్లా అది గట్టిగా శబ్దం చేస్తోంది. ఆ ధ్వనికి నక్క బెదిరిపోయి, ఏమీ తినకుండా చాలాసేపు ఒక ప్రక్కన నక్కి కూర్చున్నది. అంతలో దానికి ఒక ఆలోచన కలిగింది. "నేను శబ్దాన్ని విన్నందుకే ఎందుకు భయపడాలి? సుఖదుఃఖాలలో కాస్త ఆలోచించి, తెలివితో మెలిగినప్పుడే మనం సుఖపడగలం. అటువంటివాడే బుద్ధిమంతుడు" అనుకుని ఆ నక్క ధైర్యంగా వెళ్ళి ఆ భేరీని చూసింది. ఆ శబ్దాల వెనుకనున్న రహస్యం దానికి తెలిసిపోయింది. ఆ భేరీ నిండా కొవ్వు కూరి పెట్టారనుకుని ఆశతో దాన్ని కొరికి చూసింది. దానిలో ఏమీ లేదని, ఉన్నవి చర్మం, చెక్క మాత్రమేనని గ్రహించి ఆశ్చర్యపోయింది. యుద్ధభూమిలో పడి ఉన్న ఆహారాన్ని చాలా రోజులపాటు ఆనందంగా తింది.

నీతి: దేని గురించైనా విన్నంత మాత్రంతోనే బెదిరిపోకూడదు. పరిస్థితిని పరిశీలించకుండా ముందుగానే ఏదేదో ఊహించుకుని భయపడడం తప్పు.



3. కాకి - పాము కథ



ఉపాయేన హి యత్ కుర్యాత్
తన్న శక్యం పరాక్రమైః ।
కాక్యాః కనకసూత్రేణ
కృష్ణసర్పో నిపాతితః ॥

(అర్థం: కాకి బంగారు గొలుసుతో పామును చంపినట్టు, పరాక్రమం చేత సాధించలేని దాన్ని ఉపాయంతో సాధించాలి.)

పూర్వం ఒక మర్రిచెట్టు మీద ఒక కాకి గూడు కట్టుకుని నివసించేది. అదే చెట్టుక్రింద పుట్టలో ఒక త్రాచుపాము ఉండేది. కాకి ఆహారం కోసం బయటకు పోయిన సమయం కనిపెట్టి, త్రాచుపాము చెట్టు ఎక్కి, కాకి పెట్టిన గుడ్లన్నీ తినివేసేది. తిరిగివచ్చిన కాకి పాము చేసిన దుర్మార్గాన్ని తెలుసుకుని ఎంతో బాధపడేది. ఇలా కొన్నిసార్లు జరిగింది. ఆ పాము పీడ ఎలా విరగడ చేసుకోవాలా అని కాకి తీవ్రంగా ఆలోచించింది.



కాకికి రాజుగారి ఉద్యానవన సరోవరంలో అంతఃపుర స్త్రీలు జలకాలాడడం గుర్తుకు వచ్చింది. వారు ఆ సమయంలో తమ నగలు ఒడ్డున పెట్టడం కూడా గుర్తుకు వచ్చింది. అప్పుడు దానికి ఒక ఉపాయం తట్టింది.

కాకి వెంటనే అక్కడకు చేరుకుని, ఒక రత్నహారాన్ని తన ముక్కున కరచుకుని వారికి కనిపించేలా తక్కువ ఎత్తులో ఎగురసాగింది. అంతఃపుర స్త్రీల కేకలు విన్న రాజసేవకులు కాకిని అనుసరించి పరుగెత్తసాగారు.



కాకి మెల్లగా ఎగురుకుంటూ రత్నహారాన్ని తెచ్చి పాము పుట్టలో జారవిడిచింది. హారం కోసం వచ్చిన రాజభటులు పుట్టను త్రవ్వగా పాము బుసలు కొడుతూ బయటకు వచ్చింది. రాజభటులు పామును చంపి హారాన్ని తీసుకుపోయారు. ఆ విధంగా తన బుద్ధి కుశలతతో కాకి పాము పీడను తొలగించుకుంది.

నీతి: ఉపాయంతో ఎటువంటి కష్టాన్నైనా తప్పించుకోవచ్చు.

4. సింహం - కుందేలు కథ

బుద్ధిర్యస్య బలం తస్య నిర్బుద్ధేస్తు కుతో బలం ।
వనే సింహో మదోన్మత్తః శశకేన నిపాతితః ॥

(అర్థం: మదించిన సింహాన్ని బావిలోకి దూకేలా చేసిన కుందేలులాగా బుద్ధి ఉన్నవాడికే బలం ఉపయోగపడుతుంది. బుద్ధిలేనివాడికి ఎంత బలం ఉన్నా ఏమిటి ప్రయోజనం?)

ఒక అడవిలో ఒక సింహం ఉండేది. అది మృగాలన్నింటినీ చకచకా చంపి వేయసాగింది. ఇలా అయితే అడవి త్వరలోనే ఖాళీ అవుతుందని మృగాలు దాని దగ్గరకు వచ్చి ఇలా చెప్పుకున్నాయి. "రాజా! ప్రతిదినం ఇన్ని ప్రాణాలు తీయడం దేనికి? ఒకసారి తినేది ఒక జంతువునే కదా? రోజూ ఒక మృగాన్ని మీ దగ్గరకు పంపుతాం. దానితో మీకు తృప్తి కలుగుతుంది. మీకు వేటాడే పని కూడా తప్పుతుంది."

అందుకు సింహం అంగీకరించింది. రోజూ ఒక మృగం దాని దగ్గరకు ఆహారంగా వస్తూ ఉండేది. ఒకసారి ఒక కుందేలు వంతు వచ్చింది. కుందేలు

ఈ గండం నుంచి బయటపడేది ఎలాగని ఆలోచించసాగింది. అది సింహం దగ్గరకు పోతూపోతూ ఒక బావిలోకి తొంగిచూసింది. అందులో తన ప్రతిబింబం కనబడడంతోనే, ఆ సింహాన్ని ఎలా చంపవచ్చునో అన్న ఉపాయం దానికి తట్టింది. చాలాసేపు పొదలలో తిరిగి, ఆలస్యంగా ఆ సింహం దగ్గరికి చేరింది. సింహం కోపంతో మండిపడుతూ, "నీకెంత పొగరు? ఇంత ఆలస్యంగా వస్తావా!" అని గర్జించింది. భయం నటిస్తూ కుందేలు, "రాజా! నేను వచ్చే దారిలో ఇంకొక సింహం ఎదురుగా వచ్చి నన్ను నిలవమని ఆజ్ఞాపించింది. నేను తమకు ఆహారంగా వెళుతున్నాననీ, కాబట్టి నన్ను విడిచి పెట్టమని చెప్పగా – 'వాడెవడు'? ఈ అరణ్యానికి రాజును నేనే! ఇక్కడ నా మాటే చెల్లుబడి కావాలి!' అంటూ పట్టుపట్టింది. నేను అతికష్టంమీద ఆ సింహానికి ఏవేవో మాయమాటలు చెప్పి తప్పించుకుని వచ్చేసరికి ఇంత ఆలస్యం అయింది" అని చెప్పింది.

అప్పుడు ఆ సింహం కోపంతో, "ఆ క్రొత్త సింహం ఎక్కడ ఉందో చూపించు. దాన్ని నేను చంపుతాను" అంది. కుందేలు ఆ సింహాన్ని బావి దగ్గరకు తీసుకునిపోయి క్రొత్త సింహం అందులో దాగి ఉందని చెప్పింది.

సింహం తన ప్రతిబింబాన్ని చూసి ఇంకొక సింహం అనుకుని భ్రమించి, గర్జించింది. బావిలో నుంచి ప్రతిధ్వని వినిపించింది. ఆ ప్రతిధ్వనిని విని ఆ సింహం కూడా గర్జిస్తున్నదనుకుని పట్టలేని కోపంతో ఆ బావిలోకి దూకింది. బయటకు రాలేక అక్కడే ప్రాణాలు విడిచింది.

నీతి: బుద్ధిబలం లేని కండబలం నిరర్థకం.

"ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వాటిమధ్య పిడుగువంటి పదార్థంతో చేసిన మనస్సు" కావాలని వివేకానంద స్వామి బోధించారు. కాబట్టి మనకు బుద్ధిబలం, కండబలం రెండూ కావాలి, ఒక్కటే చాలదు.

5. నీలిరంగు కుండలో పడిన నక్క కథ

త్యక్తాశ్చాభ్యాంతరా యేన బాహ్యాశ్చాభ్యన్తరీ కృతాః ।
స ఏవ మృత్యుమాప్నోతి యథా రాజా కకుద్రుమః ॥

(అర్థం: కకుద్రుముడనే నక్క (రాజుగా నటించి) ఎలాగైతే ప్రాణాలు పోగొట్టుకుందో అదే విధంగా లోపల పరాక్రమం లేకుండా పైపై మెరుగులతో చేసే నటనలు చేటు తెస్తాయి.)

ఒక అడవిలో కకుద్రుముడు అనే నక్క ఉంది. ఒకనాడు అది ఆహారం కోసం అడవికి దగ్గరలో ఉన్న ఊరిలోకి ప్రవేశించింది. ఊరకుక్కలు దానిని



తరిమాయి. అది పారిపోతూ, ఒక చాకలి గుడిసెలో దూరింది. అందులో ఉన్న ఒక బానలో పడిపోయింది. ఆ బానలో నీలిరంగు ఉంది. ఆ రంగులో మునిగిన నక్క నీలంగా తయారయింది. ఊరకుక్కలు దాని కోసం కొంతసేపు వెతికి, వెళ్ళిపోయాయి. తర్వాత నక్క బానలోనుండి బయటపడి, ఎలాగో అడవికి చేరింది, అప్పుడు అడవిలో జంతువులన్నీ ఆ నీలిరంగు నక్కను చూచి క్రొత్త జంతువు అనుకుని భయపడి పారిపోతున్నాయి. ఇది గమనించి ఆ నక్క 'తంతే బూరెల బుట్టలో పడ్డాను!" అనుకుంది. దానికి ఒక మంచి ఉపాయం తట్టింది. అన్ని జంతువులూ తనను చూసి భయపడుతున్నాయి కాబట్టి తానే వాటికి రాజు కావచ్చునని అనుకుంది. ఆ పారిపోయే జంతువుల్ని పిలిచి ఆ నక్క, "మీరేమీ భయపడవలసిన పనిలేదు. ఆ బ్రహ్మదేవుడు నన్ను మీకు రాజుగా పంపించాడు. నేను ఈ వనానికి రాజును. మీరంతా నా ఆజ్ఞను పాటించాలి" అని అంది.

ఆ వింత మృగాన్ని దేవుడే పంపించాడని ఆ జంతువులు నమ్మాయి. పెద్దపెద్ద జంతువులే దానికి లొంగిపోయాయి. చివరికి సింహం, పులి కూడా తాము వేటాడి తెచ్చిన మాంసాన్ని ఆ నక్క ముందు ఉంచేవి. ఆ నక్క కొద్దిగా మాంసాన్ని వాటికి ఇచ్చి మిగిలిన మాంసాన్ని కడుపారా తినేది. ఇలా ఉండగా ఒక వెన్నెలరాత్రి అడవిలోని నక్కలన్నీ పెద్దగా ఊళ వెయ్యడం మొదలు పెట్టాయి. ఆ కూతలు చెవిన పడగానే నక్క మైమరచి పోయింది. తాను కూడా వాటితో గొంతు కలిపి ఊళ వేసింది. అప్పుడు అది మామూలు నక్కేనని అన్ని మృగాలకూ



తెలిసిపోయింది. అవి ఆ నీలినక్కను చంపివేశాయి.

నీతి: మోసం ఎల్లకాలం సాగదు.

6. టిట్టిభ పక్షుల కథ

శత్రోర్విజ్ఞానమజ్ఞాత్వా వైరమారభతే హి యః ।
స పరాభవమాప్నోతి సముద్రః టిట్టిభాద్యథా ॥

(అర్థం: టిట్టిభ పక్షుల యొక్క పట్టుదలను తప్పుగా అంచనా వేసిన సముద్రుడు వాటితో వైరానికి దిగి పరాభవం పాలైనట్టు, శత్రువు యొక్క శక్తిసామర్థ్యాలను సరిగా తెలుసుకోనివాడు ఓడిపోతాడు.)

ఒకానొక కాలంలో సముద్రం దగ్గర రెండు టిట్టిభపక్షులు నివసిస్తూ ఉండేవి. ఆ రెండు పక్షులు ఎంతో సంతోషంగా ఉండేవి. ఆడపక్షి గుడ్లు పెట్టే సమయం వచ్చింది. ఆ పక్షి దంపతులు ఎక్కడ గుడ్లు పెట్టాలన్న విషయం మీద వాదులాడుకోసాగాయి. మగపక్షి ఆ సముద్రపు ఒడ్డునే ఇసుకలో గుడ్లు పెట్టమని చెప్పింది. కానీ ఆడపక్షి సముద్రపు అలలలో గుడ్లు కొట్టుకుపోతాయేమోనని భయపడసాగింది. కానీ మగపక్షి ఆడపక్షి మాట వినలేదు. సముద్రుడి వల్లనే కాదు, ఎవరివల్లా, ఏ భయమూ ఉండదని నొక్కి చెప్పింది. ఆ మాటలు విని సముద్రుడు నవ్వుకున్నాడు.

ఆడపక్షి సముద్రతీరానే గూడు కట్టి, గుడ్లు పెట్టింది. ఆ పక్షులు ఆహారం కోసం బయటికి వెళ్ళినప్పుడు సముద్రుడు తన అలలలో ఆ గూటిని, గుడ్లను

సముద్రంలోకి లాగుకొనిపోయాడు.

గూడు గుడ్లతో సహా మాయమైనందుకు పక్షులు చాలా బాధపడ్డాయి. సముద్రుడి మీద కోపించి, నీటిని తోడివేసి ఆ సముద్రాన్ని ఎండగట్టాలని నిశ్చయించుకున్నాయి. తమ ముక్కులతో నీటిని తోడి దూరంగా పోయసాగాయి. అంతులేని మహాసముద్రాన్ని తమ చిన్నచిన్న ముక్కులతో ఎండగట్టడం సాధ్యమయ్యే పనేనా? అయినా ఆ పక్షులు అలా పట్టువదలకుండా అసాధ్యమైన ఆ పనిని చేస్తూనే ఉన్నాయి.

వాటి పట్టుదలను చూసి పక్షుల రాజైన గరుత్మంతుడు జాలిపడ్డాడు. సముద్రుడి మీదకు యుద్ధానికి వచ్చాడు. సముద్రుడు భయపడి వాటి గుడ్లను తిరిగి ఇచ్చాడు. ఆ పక్షులు సుఖంగా జీవించాయి.

నీతి: పట్టువదలకుండా పనిచేసేవాడికి అన్నీ సానుకూలమవుతాయి.

7. పక్షి - కోతుల కథ

ఉపదేశో న దాతవ్యో యాదృశే తాదృశే జనే ।
పశ్య వానరమూర్ఖేణ సుగృహీ నిర్గృహీ కృతః ॥

(అర్థం: మూర్ఖులైన కోతులకు సలహా ఇచ్చి వాటి కోపానికి గురై తన గూటిని పోగొట్టుకున్న పక్షిలాగా, అనర్హులైన వారికి ఉపదేశం చేస్తే మనమే ఇక్కట్ల పాలవుతాము.)

ఒక అడవిలో ఒక జమ్మిచెట్టు ఉంది. దానిమీద ఒక పక్షి నివసించేది. అది చలికాలం. పైగా జోరుగా వాన కురిసింది. అందువల్ల చలి మరింతగా పెరిగింది. ఆ అడవిలో ఒక కోతుల గుంపు ఉంది. ఆ కోతులు ఆ వానలో ముద్దగా తడిసిపోయాయి. చలి భరించలేక గజగజ వణుకుతూ వచ్చి ఆ చెట్టు క్రింద చేరాయి.

ఆ సమయానికి చీకటి పడడంతో మిణుగురు పురుగులు అడవిలో ఎగురుతున్నాయి. ఆ మెరుస్తున్న మిణుగురు పురుగులను చూచి కోతులు ఆ పురుగులలో నిప్పు ఉందని అనుకున్నాయి. వాటితో నిప్పు రాజేసి, చలిమంట వేసుకుందామని ఆలోచించాయి. అడవిలో తిరిగి పుల్లలు ఏరుకు వచ్చాయి. ఆ మిణుగురు పురుగులను తెచ్చి వాటి చుట్టూ పుల్లలను చేర్చి ఊదడం ప్రారంభించాయి. ఎంతసేపు శ్రమపడినా మంట రగులుకోలేదు. కోతుల చలి తీరలేదు. ఇదంతా చెట్టుమీద ఉన్న ఆ పక్షి చూస్తోంది. దానికి ఆ పురుగులలో నిప్పు ఉండదని తెలుసు. చాలాసేపు చూసి, చివరకు ఆ పక్షి ఊరుకోలేక ఆ

కోతులతో, "అది నిప్పు కాదు. మిణుగురు పురుగుల కుప్ప. వాటితో మీ చలి తీరదు. మీ చలి తీరాలంటే నిప్పు సంపాదించండి" అని సలహా చెప్పింది. ఆ సలహా విని ఒక మూర్ఖపుకోతి, "నువ్వా పక్షీ! నాకు సలహా చెప్పేదానివి?" అంటూ కోపంగా చెట్టెక్కి పక్షి గూటిని నాశనం చేసింది.

నీతి: ఎవరికి పడితే వారికి ఉచిత సలహాలు ఇవ్వకూడదు.

8. ఎలుకలు తిన్న త్రాసు కథ

తులాం లోహసహస్రస్య యత్ర ఖాదంతి మూషికాః ।
రాజన్ తత్ర హరేచ్ఛ్యేనో బాలకం నాత్ర సంశయః ॥

(అర్థం: ఎక్కడైనా ఎలుకలు ఇనుపత్రాసును తినడం నిజమైతే, అక్కడ ఒక పిల్లవాణ్ణి గ్రద్ద తన్నుకుపోవడం కూడా నిజమౌతుంది.)

ఒక పట్టణంలో ఒక ధనికుడు ఉన్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చి, ఆస్తి మొత్తాన్ని పోగొట్టుకున్నాడు. పూలు అమ్మినచోట కట్టెలు అమ్మడం ఇష్టంలేక ఆ దేశం వదలివెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. అతడి ఇంట్లో తాతలకాలంనాటి ఒక ఇనుప త్రాసు ఉండేది. అది చాలా మంచిది. అటువంటి త్రాసు దొరకడం చాలా కష్టం. ఆ త్రాసును వదులుకోవడం అతడికి ఇష్టం లేదు. దాన్ని తన స్నేహితుడైన ఒక వర్తకుని ఇంటిలో ఉంచి దేశదేశాలు తిరిగాడు. చాలా ధనం కూడా సంపాదించాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత తిరిగివచ్చి తన త్రాసును తనకు తిరిగి ఇవ్వమని ఆ వర్తకుణ్ణి అడిగాడు. కానీ వర్తకుడు ఆ త్రాసును కాజెయ్యాలని అనుకున్నాడు. "నీ త్రాసును ఎలుకలు తినేశాయి" అని ఆ ధనికుడితో చెప్పాడు. "అలాగా! అయితే సరేలే!" అని ఆ తెలివిగల ధనికుడు అప్పటికి ఊరుకున్నాడు. కానీ ఆ వర్తకుడికి బుద్ధి చెప్పడానికి ఒక ఎత్తు వేశాడు. స్నానం చెయ్యడానికి నదికి వెడుతూ ఆ వర్తకుడి కుమారుణ్ణి తనతోపాటు తీసుకుని వెళ్ళాడు. స్నానం చేసి తిరిగి వస్తూ ఆ పిల్లవాణ్ణి ఒకచోట దాచిపెట్టాడు. ఏడుస్తూ వర్తకుని దగ్గరకు వచ్చి, "నీ కొడుకుని గ్రద్ద తన్నుకు పోయింది," అని చెప్పాడు.

అప్పుడు ఆ వర్తకుడు, "దుర్మార్గుడా! ఎక్కడైనా బాలుణ్ణి గ్రద్ద తన్నుకుపోతుందా?" అని న్యాయాధికారి దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. న్యాయాధికారి ఆ ధనికుణ్ణి, "గ్రద్ద బాలుణ్ణి ఎలా తన్నుకుపోగలదు?" అని అడిగాడు. ఆ మాటకు ఆ ధనికుడు, "ఇందులో అనుమానపడవలసింది ఏమీలేదు! ఈ నగరంలో ఇనుప త్రాసును తినే ఎలుకలే ఉంటే, బాలుణ్ణి

ఎత్తుకుపోయే గ్రద్దలు ఉండవా?” అని అన్నాడు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు. న్యాయాధికారి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నాడు. వర్తకుడికి పిల్లవాణ్ణి, ధనికుడికి త్రాసుని ఇప్పించాడు.

నీతి: తెలివి ఒక్కరి సొత్తే కాదు.

9. రాజుగారి పెంపుడు కోతి

పండితోఽపి వరం శత్రుః న మూర్ఖో హితకారకః ।
వానరేణ హతో రాజా విప్రాశ్చౌరేణ రక్షితాః ॥

(అర్థం: మూర్ఖుడైన మిత్రుని కంటే తెలివిగల శత్రువే మెరుగు. తెలివి తక్కువ కోతిని చేరదీసి రాజు మృత్యువును కొని తెచ్చుకున్నాడు గదా!)

ఒక రాజుగారు ఒక కోతిని పెంచారు. ఆయన దానిని చాలా ప్రేమగా చూసుకునేవాడు. అది రాజుగారి అంతఃపురం అంతా తిరుగుతూ ఉండేది. రాజుగారు దానికి మంచి వేషం వేయించేవారు. ఒక కత్తిని కూడా దానికి ఇప్పించారు. అది ఆ కత్తిని పట్టుకుని ఒక సైనికుడిలా ఠీవిగా నడుస్తూ ఉండేది.

ఒకరోజు మధ్యాహ్నం ఆ రాజుగారు నిద్రపోతున్నారు. ఆ కోతి విసెనకర్రతో విసరసాగింది. అప్పుడు ఒక ఈగ అక్కడికి వచ్చి రాజుగారి మీద వాలింది. కోతి దానిని తోలివేసింది. కానీ ఆ ఈగ మళ్ళీమళ్ళీ రాజుగారి మీద వాలసాగింది. ఆ కోతి ఎంత తోలినా ప్రయోజనం లేకపోయింది. చివరికి ఆ కోతి విసిగి పోయి, ఆ ఈగని ఎలాగైనా సరే చంపాలనుకుంది. కత్తితో బలంగా ఒక వేటువేసింది. ఆ దెబ్బకు ఈగ చావలేదు కానీ రాజుగారి ప్రాణం పోయింది.

నీతి: తెలివితక్కువవాళ్ళని, జంతువుల్ని చేరదీసినప్పుడు వాటితో కలగబోయే ప్రమాదాన్ని గురించి మెలకువతో ఉండాలి.

10. నక్క అత్యాశ

అతితృష్ణా న కర్తవ్యా తృష్ణాం నైవ పరిత్యజేత్ ।
అతితృష్ణాభిభూతస్య శిఖా భవతి మస్తకే ॥

(అర్థం: తన అత్యాశ వల్ల వింటిదెబ్బ తిని నక్క చనిపోయినట్లు, పిసినారివాడు తన దురాశవల్లే నశిస్తాడు.)

ఒక అడవిలో ఒక వేటగాడు ఉండేవాడు. అతడు విల్లంబులు ధరించి ఒకరోజు వేటకు వెళ్ళాడు. అడవిలో మాటు వేసి ఒక జింకను చంపాడు. ఆ జింకను మోసుకుని వెడుతూ ఉండగా, ఒక అడవిపంది వాడికి ఎదురు

వచ్చింది. వేటగాడు ఆ పందిమీద గురిపెట్టి బాణం వేశాడు. బాణం దెబ్బకు ఆ పంది బాగా గాయపడింది. కానీ అది "ఘుర్‌ఘుర్"మంటూ ఆ వేటగాడిపై దూకి వాణ్ణి తన కోరలతో పొడిచి చంపివేసింది. బాణం దెబ్బ తగిలిన ఆ పంది కూడా అక్కడే పడి మరణించింది.

కొంతసేపటికి అక్కడికి ఒక నక్క వచ్చి, అక్కడ మరణించిన జింక, వేటగాడు, అడవి పంది శవాలను చూసింది. కొన్ని నెలలవరకూ తనకు ఆహారానికి లోటులేదని సంబరపడింది. కానీ పిసినారితనంతో, ఎదురుగా ఉన్న అంత మంచి మాంసాన్ని తినకుండా, "ముందుగా ఆ వింటినారిని కొరికి తింటే ఈ రోజుకు సరిపోతుంది కదా!" అనుకుంది. నక్క ఇలా అనుకుని ఆ వింటిత్రాడు కొరికింది. వంకరగా ఉండే ఆ వింటిబద్ద వెంటనే "ధన్" మని చక్కబడి నక్క గొంతులో దిగబడింది. ఆ దెబ్బకు నక్క మరణించింది.

నీతి: అత్యాశ పనికిరాదు.

11. పిచ్చుక - కుందేలు కథ

క్షుద్రమర్థపతిం ప్రాప్య న్యాయాన్వేషణతత్పరౌ ।
ఉభావపి క్షయం ప్రాప్తౌ పురా శశక పింజలౌ ॥

(అర్థం: కపటి అయిన పిల్లిని నమ్మి కుందేలు, పిచ్చుక మోసపోయినట్టు దుర్మార్గుణ్ణి సలహా అడిగితే మొదటికే మోసం వస్తుంది.)

పూర్వం ఒక అడవిలోని చెట్టుతొర్రలో ఒక పిచ్చుక నివసిస్తూ ఉండేది. ఆ పిచ్చుక కొన్నాళ్ళు ఆ తొర్రలో ఉండి ఎక్కడికో ఎగిరిపోయింది. చాలా రోజులు ఆ తొర్ర ఖాళీగా ఉంది. కొన్నిరోజులకు ఒక కుందేలు వచ్చి ఆ తొర్రలో నివాసం ఏర్పాటు చేసుకుంది.

ఒకరోజు ఆ పిచ్చుక తిరిగివచ్చి ఆ తొర్రలో ఉన్న కుందేలుని చూచి ఆ తొర్ర తనదని, వెంటనే ఖాళీ చెయ్యమని అడిగింది. ఖాళీ చెయ్యనని కుందేలు మొండికేసింది. ఇలా వారిద్దరి మధ్య వాదులాట మొదలైంది. చివరకు ఆ రెండూ కలిసి ఇంకొకరిని న్యాయం అడుగుదాం అనుకుని బయలుదేరాయి.

వాటికి దారిలో ఒక పిల్లి కనిపించింది. ఆ పిల్లి ఒక చెరువు గట్టున ఒంటికి బూడిద పూసుకుని, మునిలాగా నిలబడి, "ఈ జీవితం నీటి బుడగలాంటిది. ఇది శాశ్వతం కాదు. చివరకు నిలిచేది మనం చేసుకున్న పుణ్యం ఒక్కటే!" అని ధర్మపన్నాలు పలుకుతోంది. ఆ పిల్లిని చూసి పిచ్చుక, కుందేలు సరైన చోటికి వచ్చామనుకుని చాలా సంతోషించాయి. పిల్లి దగ్గరకు వెళ్లి న్యాయం చెప్పమని

కోరాయి. ఎవరిది దోషమైతే వారిని తినవచ్చని ఆ పిల్లితో చెప్పాయి. కానీ పిల్లి అంటే ఉన్న సహజమైన భయంతో కొద్దిగా దూరంగా నిలబడి మాట్లాడసాగాయి. ఆ మాటలు విన్న ఆ పిల్లి, "శివశివా! నేను మాంసం తినడం మానేశాను. ముసలిదాన్ని అయిపోయాను. నాకు చెవుడు కూడా వచ్చింది. కొంచెం దగ్గరగా వచ్చి చెవిలో చెపితే వింటాను" అని అంది. పిచ్చుక, కుందేలు దాని మాటలకు మోసపోయి, మరింత దగ్గరగా వెళ్ళాయి. అవి దగ్గరకు రాగానే ఆ పిల్లి వాటిని రెంటినీ పట్టుకుని చంపి, తినివేసింది.

నీతి: దుర్మార్గుడికి న్యాయం, ధర్మం ఉండవు.

"అందరిలోనూ దేవుడున్నాడనే మాట నిజమే. కానీ దుర్మార్గులకు దూరంగా ఉండాలి. పులిలో దేవుడున్నాడు కదా అని పులిని కౌగిలించుకోవాలనుకుంటే అది మన ప్రాణాలకే ముప్పు తెస్తుంది. కాబట్టి దుర్మార్గులకు దూరంగానే ఉండి నమస్కరించి మనదోవ మనం చూసుకోవడం ఉత్తమం!" అని శ్రీరామకృష్ణ పరమహంస బోధించారు.

12. మోసపోయిన బ్రాహ్మణుడి కథ

బహుబుద్ధిసమాయుక్తాః సువిజ్ఞానా బలోత్కటాః ।
శక్తా వంచయితుం ధూర్తా బ్రాహ్మణం ఛాగలాదివ ॥

(అర్థం: బ్రాహ్మణుడు తెలివిగలవాడైనప్పటికీ, వంచించడంలో ఆరితేరిన దొంగల మాటలను గ్రుడ్డిగా నమ్మడం వలన, తన మేకను పోగొట్టుకుని మోసపోయాడు.)

ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. ఒకసారి ఆ బ్రాహ్మణుడు యజ్ఞం చేయాలని అనుకున్నాడు. ఎవరినో యాచించి ఒక మేకను సంపాదించాడు. ఆ మేక మెడకు తాడు కట్టి ఊరికి ప్రయాణం మొదలుపెట్టాడు. ఆ మేక అతడితో నడవకుండా మొరాయించింది. గతిలేక అతడు దానిని భుజాలపై ఎక్కించుకుని నడవడం మొదలుపెట్టాడు.

ఆ బ్రాహ్మణుడు అలా ఒక మేకను మోసుకుపోవడాన్ని ముగ్గురు దొంగలు చూశారు. మోసంతో ఆ మేకను సంపాదించాలని అనుకొన్నారు. ఒక పథకం పన్నారు. ముగ్గురూ విడిపోయి ఒక్కొక్కరిగా ఆ బ్రాహ్మణుడికి ఎదురుపడ్డారు.

వారిలో మొదటివాడు బ్రాహ్మణుడికి ఎదురువెళ్ళి, "అయ్యా! మీరు ఎంతో పవిత్రంగా ఉండాలి కదా, మరి ఆ కుక్కను ఎందుకు మోస్తున్నారు?" అని అడిగాడు. ఆ మాటకు బ్రాహ్మణుడు కోపంతో, "నీకు కళ్ళు లేవా? దీన్ని కుక్క అంటావేమిటి?" అని గద్దించాడు. అప్పుడు ఆ మొదటి దొంగ, "అయ్యా! కోపం

తెచ్చుకోవద్దు? మీకు ఇష్టంగా ఉంటే ఆ కుక్కనే మోసుకుని వెళ్ళండి! అయినా నాకెందుకు?" అంటూ తనదారిన తాను వెళ్ళిపోయాడు.

బ్రాహ్మణుడు ఇంకొంత దూరం నడిచాక, రెండవ దొంగ ఎదురుగా వచ్చి, "కుక్కని మోసుకుపోతున్నారేమిటి?" అని ప్రశ్నించాడు. వాణ్ణి కూడా ఆ బ్రాహ్మణుడు విదిలించి వేశాడు.

ఇంకా కొంతదూరం తరువాత మూడవ దొంగ వచ్చి మొదటి ఇద్దరూ అన్న మాటలనే తాను కూడా అని, బ్రాహ్మణుణ్ణి వెక్కిరించాడు.

ఇలా వరుసగా తాను మోసేదాన్ని "మేక కాదు, కుక్క!" అంటూ ముగ్గురు ఎదురుపడేసరికి ఆ బ్రాహ్మణుడికి అనుమానం కలిగింది. తనకు మేకలాగానే కనిపిస్తున్నా బయటివారికి అది కుక్కలాగా కనబడుతోంది కాబట్టి అదేదో భూతం అనుకుని, ఆ మేకను క్రింద పారేసి, భయంతో పారిపోయాడు. ఆ ముగ్గురు దొంగలు ఆ మేకను తీసుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

నీతి: నలుగురూ ఒకే మాట చెప్పినంత మాత్రాన ఏ విషయాన్నీ త్వరపడి నమ్మకూడదు. మన వివేకాన్ని, బుద్ధిని ఉపయోగించి నిజాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

13. నక్క - మాట్లాడే గుహ

అనాగతం యః కురుతే స శోభతే స శోచ్యతే యో న కరోత్యనాగతం ।
వనేఽత్ర సంస్థస్య సమాగతా జరా బిలస్య వాణీ న కదాపి మే శ్రుతా ॥

(అర్థం: రాబోయే ప్రమాదాన్ని ముందే పసిగట్ట గలిగిన నక్క, తెలివిగా సింహం బారి నుంచి తప్పించుకుంది.)

ఒకానొక అడవిలో ఒక సింహం ఉంది. ఒకరోజు అది ఎంత తిరిగినా కొంచెం కూడా ఆహారం సంపాదించలేకపోయింది. తిరిగితిరిగి అలసి పోయింది. అప్పుడు ఒక గుహను చూసింది. దానిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటోంది.

ఆ గుహ ఒక నక్కది. ఆ నక్క అడవిలో వేటాడి సాయంత్రానికి తిరిగి గుహకు వచ్చింది. కానీ గుహ మొదట్లో దానికి సింహం అడుగుజాడలు కనిపించాయి. ఆ అడుగుజాడలు గుహలోకి వెళ్ళాయి కానీ తిరిగి బయటకురాలేదు. ఆ నక్క వాటిని చూసి భయపడింది. గుహలో సింహం ఉందని అర్థం చేసుకుంది. వెంటనే దానికి ఒక ఉపాయం తోచింది. అది గుహతో మాట్లాడుతున్నట్టుగా ఇలా అంది. "ఏమండీ, గుహగారూ!

బాగున్నారా!" అని పలకరించింది. లోపల ఉన్న సింహం ఈ మాటలు వింది. "రోజూ ఈ గుహ నక్కతో మాట్లాడుతుంది. కాబోలు!" అనుకుంది. ఇంతలో నక్క మళ్ళీ ఇలా అంది. "ఏమండీ! గుహగారూ! ఏమిటి మీరు మాట్లాడడం లేదు. నామీద కోపం వచ్చిందా? మీరు సమాధానం చెప్పకపోతే నేను వేరే చోటికి వెళ్ళిపోతాను లెండి!" అంది. ఆకలితో ఉన్న ఆ తెలివితక్కువ సింహం, "నేను గొంతు మార్చి గుహలాగా మాట్లాడతాను. అప్పుడు నక్క లోపలికి వస్తుంది. నేను దాన్ని చంపి హాయిగా తింటాను" అనుకుంది. అయితే, సింహం మాట్లాడడం మొదలు పెట్టిన వెంటనే గుహలో సింహం ఉందని గ్రహించి నక్క పారిపోయింది.

నీతి: ఉపాయంతో అపాయం నుంచి తప్పించుకోవచ్చు.

14. కప్పలను మోసిన త్రాచుపాము కథ

స్కంధేనాపి వహేచ్ఛత్రుం కాలమాసాద్య బుద్ధిమాన్ ।
మహతా కృష్ణసర్పేణ మండూకా బహవో హతాః ॥

(అర్థం: కాలం తనది కానప్పుడు పాము కప్పలను మోసినట్లు, మనకు అనుకూలం కాని పరిస్థితులలో మన కంటే తక్కువ వారికి అణిగిమణిగి ఉండాలి.)

పూర్వం ఒక అడవిలో ఒక త్రాచుపాము ఉండేది. అది ముసలిది అయిపోయింది. దానికి వేటాడే శక్తి తగ్గిపోయింది. అందువల్ల అది, "నేను శక్తి లేకపోయినా, యుక్తితో వేటాడతాను" అనుకుంది. ఇలా అనుకుని అది ఒక చెరువు గట్టుమీద పడుకుంది. ఏమీ తినకుండా, కళ్ళు తెరవకుండా అక్కడే కదలకుండా ఉండసాగింది. దాన్ని చూసిన కప్పలు ఆ పాము హింస చెయ్యదనీ, తపస్సు చేసుకుంటోందనీ అనుకున్నాయి.

ఒక కప్ప పాము దగ్గరకు వచ్చి, "ఎందుకీ తపస్సు! సుఖంగా ఉండకుండా ఎందుకు ఉపవాసాలు చేస్తున్నావు?" అని అడిగింది. అప్పుడు ఆ పాము, "పూర్వం నేను ఒక ముని కుమారుణ్ణి కాటువేశాను. అందుకు కోపించిన ముని కప్పలను మోస్తూ జీవించమని నన్ను శపించాడు!" అని సమాధానం చెప్పింది. ఆ మాటలు విన్న కప్పలు ఎంతో సంతోషించాయి. ఆ పాముని గుడ్డిగా నమ్మి, దానిమీద ఎక్కి కూర్చున్నాయి.

ఆ పాము కప్పలను, ఆ కప్పల యొక్క రాజును తన వీపుమీద ఎక్కించుకుని చాలా రోజులు మోసింది. ఒకరోజు ఆ కప్పలరాజు పాముతో, "నువ్వు ఇంత నెమ్మదిగా ప్రాకుతున్నావెందుకు? త్వరగా ప్రాకరాదా?" అని అడిగింది. ఆ

పాము, "తిండి లేనందువల్ల నేను చిక్కిపోతున్నాను! నీరసంగా ఉంది!" అని చెప్పింది.

"నువ్వు రాజుగారి వాహనానివి. నువ్వు ఇంత నీరసించిపోవడం నాకు అవమానకరం. నీకు ఇష్టమైన ఆహారమేమిటో చెప్పు. నేను దానిని సమకూరుస్తాను" అని కప్పలరాజు అంది. అప్పుడు ఆ పాము, "రాజా! నా ఆహారం కప్పలు!" అని బదులు చెప్పింది. మూర్ఖుడైన ఆ కప్పలరాజు కొంచెం సేపు తటపటాయించి, "అలా అయితే చిన్నచిన్న కప్పలను తిని నీ ఆకలి తీర్చుకో!" అంది.

ఆ మాటకు సరేనని పాము ఒక్కొక్క కప్పనే మింగివేయసాగింది. చిట్టచివరికి ఒకరోజు కప్పలరాజునే మింగి వేసింది.

నీతి: దుర్మార్గులు మంచి మాటలతో మోసగిస్తారు.

15. కోతి - మొసలి కథ

సముత్పన్నేషు కార్యేషు బుద్ధిర్యస్య న హీయతే ।
స ఏవ దుర్గం తరతి జలస్థో వానరో యథా ॥

(అర్థం: ఎలాగైతే నీటి మధ్యలో ఉన్నప్పుడు కూడా కోతి అపాయం నుంచి తప్పించుకుందో అదే విధంగా బుద్ధిమంతులు తమకు ఎదురయ్యే సమస్యలను తెలివితో పరిష్కరిస్తారు.)

పూర్వం ఒక నదీతీరంలో ఒకచోట ఒక పెద్ద నేరేడు చెట్టు ఉంది. అది ఎప్పుడూ పళ్ళతో నిండుగా, నది మీదకి వంగి అందంగా ఉండేది. ఆ చెట్టుమీద ఒక కోతి ఉంది. అది ఎంతో హాయిగా ఆ నేరేడుపళ్ళను తింటూ ఉండేది. ఒకరోజు ఒక మొసలి అక్కడికి వచ్చింది. ఆ కోతి దానికి కొన్ని నేరేడుపళ్ళను ఇచ్చింది. నేరేడు పళ్ళను తిన్న మొసలికి ఆ కోతితో మంచి స్నేహం కుదిరింది. రోజూ మొసలివచ్చి కోతితో కబుర్లు చెపుతూ, కొన్ని నేరేడుపళ్ళు తిని, మరికొన్ని పళ్ళను తీసుకుపోయి తన భార్యకు ఇచ్చేది. ఒకరోజు ఆ మొసలి భార్య, "ఇంత తియ్యని నేరేడు పళ్ళను తినే ఆ కోతి గుండె ఇంకెంత రుచిగా ఉంటుందో! నాకు దాని గుండెను తినాలని ఉంది" అని అంది. ఆ మాట విన్న ఆ మగ మొసలి, కోతి తనకు మిత్రుడని, అతణ్ణి చంపకూడదని చెప్పింది. కాని ఆ మొసలి భార్య మొండిపట్టు పట్టింది. ఇక ఆ మొసలి చేసేదిలేక, తన గుండెను రాయి చేసుకుని, ఆ కోతి గుండె కోసం బయలుదేరింది.

కోతిని తన ఇంటికి విందుకి రమ్మని ఆ మొసలి బ్రతిమాలింది. తన వీపుపై ఎక్కించుకుని నీటిలో ఈదుతూ బయలుదేరింది. కానీ తెలివితక్కువతనంతో, నది మధ్యలోకి రాగానే అసలు విషయం బయట పెట్టింది. తాను అపాయంలో చిక్కుకున్నట్లు కోతి గ్రహించింది. తెలివిగా, “అయ్యో! మిత్రమా! ఈ విషయం నువ్వు నాకు ముందే ఎందుకు చెప్పలేదు? నేను నా గుండెను చెట్టుకొమ్మకి తగిలించి వచ్చాను. మనం బయలుదేరేటప్పుడే చెపితే నాతోపాటు తీసుకువచ్చేవాణ్ణి కదా!” అంది. అప్పుడు ఆ మొసలి ఆ కోతిని తిరిగి నేరేడుచెట్టు దగ్గరికి చేర్చింది. ఆ కోతి గబగబా చెట్టు ఎక్కి, “ఓరీ మూర్ఖుడా! గుండె శరీరంలో ఉండక ఇంకెక్కడ ఉంటుంది? ఓరీ పాపీ! భార్య చెప్పిన మాట విని మిత్రద్రోహం తలపెడతావా! నీ మాటలు ఇక నమ్మను. నీ స్నేహం ఇక నాకు వద్దు. నీ దారిన నువ్వు ఫో! ఇక ఇక్కడికి రావద్దు!” అని ఆ మొసలికి చీవాట్లు పెట్టింది. మంచి స్నేహితుణ్ణి కోల్పోయినందుకు విచారిస్తూ మొసలి వెళ్ళిపోయింది.

నీతి: నమ్మినవాణ్ణి మోసగించడాన్ని మించిన పాపం మరొకటి లేదు.

16. పులితోలు కప్పుకున్న గాడిద కథ

సుగుప్తం రక్ష్యమాణోపి దర్శయన్ దారుణం వపుః ।
వ్యాఘ్రచర్మ ప్రచ్ఛన్నో వాక్కృతే రాసభో హతః ॥

(అర్థం: పులి చర్మాన్ని ధరించి చూడడానికి భయంకరంగా కనిపించడంవల్ల ముందు బాగానే రక్షణ పొందినా, నోరు తెరిచేసరికి నిజం బయటపడి ఆ గాడిద మృత్యువు పాలైంది.)

పూర్వం ఒక చాకలి ఉండేవాడు. వాడు గాడిద మీద ఉతకవలసిన బట్టలమూటలు వేసి నదికి తీసుకుని వెళ్ళేవాడు. కానీ పిసినారి కావడం చేత, దాన్ని సరిగా మేపేవాడు కాదు. పైగా ప్రతిరోజూ ఆ గాడిద మోయలేనంత బరువును దానిమీద వేసేవాడు. పాపం ఆ గాడిద ఈసురోమంటూ ఆ బరువులను మోసేది.

ఒకరోజు అతడు తన గాడిదతో అడవిలోకి పుల్లలకోసం బయలుదేరాడు. పెద్ద మోపు కట్టి ఆ గాడిద వీపుమీద వేశాడు. ఆ గాడిద పుల్లలను మోయలేక అక్కడే కూలబడింది. వాడు దానిమీద బరువు తీసివేశాడు. పుల్లల్ని బాగా తగ్గించి మోపుకట్టి దానిమీద వేశాడు. తిరిగి వస్తూ, ఈ బక్కచిక్కిన గాడిదతో బ్రతుకీడ్చేది ఎలాగని ఆలోచిస్తున్నాడు. అదే సమయంలో ఆ చాకలివాడికి ఒక చచ్చిన పులి

కనపడింది. ఆ పులి కళేబరాన్ని చూడగానే పైసా ఖర్చు లేకుండా తన గాడిదను చక్కగా మేపేందుకు వాడికి ఒక ఉపాయం తట్టింది. ఆ పులి చర్మాన్ని జాగ్రత్తగా ఒలిచి, దాన్ని తీసుకుని గాడిదతో పాటు ఇల్లు చేరాడు.

ఆ రోజునుండి ప్రతిరాత్రీ ఆ చాకలివాడు తన గాడిదకు పులితోలు కప్పి పొలాల మీదకి తోలేవాడు. గాడిద రాత్రంతా హాయిగా చేలల్లో మేస్తూ ఉండేది. దాన్ని చూసి, పులి అనుకుని భయపడి, పొలాల్లో కాపలా ఉన్నవాళ్ళు పారిపోయేవాళ్ళు. కొద్ది రోజులలోనే ఆ గాడిద బాగా బలిసింది. చాకలివాడు వేసే బరువుల్ని సునాయాసంగా మోయసాగింది.

ఒకనాటి రాత్రి ఆ గాడిద పొలాల్లో మేస్తుండగా మరొక గాడిద దూరం నుంచి ఓండ్ర పెట్టింది. అది విని పులిచర్మం కప్పుకుని మేస్తున్న గాడిద కూడా ఓండ్రపెట్టడం మొదలు పెట్టింది. దాని అరుపులు విన్న కావలివాళ్ళకు అది పులి కాదనీ, గాడిద అనీ తెలిసిపోయింది. కోపంతో దానిని దుడ్డు కర్రలతో బాదారు. ఆ దెబ్బలకు గాడిద ప్రాణాలు విడిచింది.

నీతి: పైపై మెరుగులు నిజస్వభావాన్ని ఎక్కువకాలం దాచలేవు.

ఆధునిక భారతదేశంలోని యువత పాశ్చాత్య దేశాలను గ్రుడ్డిగా అనుకరించడాన్ని వివేకానంద స్వామి నిరసించారు. "నవీన భారతదేశంలోని యువత, 'పాశ్చాత్యుల ఆలోచనలు, భాష, ఆహారపు అలవాట్లు, దుస్తులు, సంప్రదాయాలను అనుకరిస్తే, మనం కూడా వారిలాగా సుసంపన్నంగా, శక్తిమంతంగా తయారవుతాం!' అని అనుకుంటున్నారు. కానీ ప్రాచీన భారత దేశం, 'మూర్ఖులారా! కేవలం అనుకరణ ద్వారా ఇతరుల గొప్పతనం మీదవుతుందా? ఏదైనా సరే మనం కష్టపడి అభ్యాసం చెయ్యడం ద్వారా మాత్రమే మన సొంతం అవుతుంది. పులి చర్మాన్ని కప్పుకున్నంత మాత్రాన గాడిద పులి అవుతుందా?' అని మనల్ని ప్రశ్నిస్తోంది" అని బోధించారు.

17. బ్రాహ్మణుడి భార్య - ముంగిసల కథ

అపరీక్ష్య న కర్తవ్యం కర్తవ్యం సుపరీక్షితం ।
పశ్చాద్భవతి సంతాపో బ్రాహ్మణ్యా నకులాద్యథా ॥

(అర్థం: చక్కగా పరీక్షించి చూసి, మన కర్తవ్యాన్ని నిశ్చయించుకోవాలి. ఆలోచించకుండా చేసేది కర్తవ్యం కాదు. ఆలోచించకుండా పని చేస్తే, ముంగిసను చంపిన బ్రాహ్మణుని భార్యలాగా జరిగిపోయినదానికి పశ్చాత్తాపపడవలసి వస్తుంది.)

పూర్వం అధిష్ఠానం అనే నగరంలో ఒక పేద బ్రాహ్మణుడు తన భార్య, కుమారులతో నివసించేవాడు. వాళ్ళ ఇంటిలో ఒక ముంగిస ఉండేది. ఆ ముంగిసను ఆ బ్రాహ్మణుని భార్య చాలా ప్రేమతో చూసేది.

ఒకసారి ఆ ఇల్లాలు పసివాడైన తన కొడుకుని ఉయ్యాలలో ఉంచి నీళ్ళు తేవడం కోసం బిందెతో నది దగ్గరికి వెళ్ళింది. ఎంతైనా ఆ ముంగిస జంతువు కదా! అది పిల్లవాడికి హాని చేస్తుందేమోనన్న భయం ఆమెకు ఉండేది. తన భర్తతో ముంగిస పిల్లవాడి దగ్గరకు వెళ్ళకుండా చూడమని చెప్పింది. కానీ ఆ విషయాన్ని మరచిపోయిన బ్రాహ్మణుడు, పట్టణంలో భిక్షకు వెళ్ళిపోయాడు.

కొంతసేపటికి అక్కడికి ఒక పాము వచ్చింది. వెంటనే ముంగిస దానితో పోరాడి, దాన్ని పట్టుకుని చీల్చివేసింది. దాని మూతి మీద, శరీరం నిండా రక్తం మరకలు అయ్యాయి. ఆ ముంగిస ఇంటి వాకిలిలో బ్రాహ్మణుని భార్య కోసం ఎదురు చూస్తూ నిలబడింది. నీటిబిందెతో ఇల్లు చేరిన బ్రాహ్మణుడి భార్య ముంగిస నోటికి ఉన్న రక్తపు మరకలు చూసి కంగారు పడిపోయింది. ముంగిస తన కుమారుణ్ణి చంపివేసిందని అనుకుంది. పట్టలేని కోపం వచ్చి నీటిబిందెతో ముంగిసను కొట్టింది. ముంగిస చచ్చిపోయింది. తర్వాత బ్రాహ్మణుడి భార్య ఇంటిలోకి వెళ్ళి చూసింది. ఆమె కుమారుడు క్షేమంగా ఉయ్యాలలో ఆడుకుంటున్నాడు. చచ్చిన పాము రక్తపు మడుగులో పడి ఉంది. నిష్కారణంగా తాను ముంగిసను చంపానని ఆమె ఎంతగానో బాధపడింది.

నీతి: తొందరపాటుతో ఏ పనీ చెయ్యరాదు. క్షణికమైన ఆవేశమే అన్ని అనర్థాలకూ మూలం.

కోపం ఏ రకమైనదైనా చెడ్డదేననీ, దానిలో మళ్ళీ మంచి, చెడు అని వేరువేరు రకాలు ఉండవనీ వివేకానంద స్వామి బోధించారు. శాంతస్వభావంతో, సమంగా ఆలోచించగలిగే మనిషి మాత్రమే చక్కగా పనిచెయ్యగలుగుతాడని ఆయన బోధించారు.

18. నలుగురు సోదరులు - అస్థిపంజరం కథ

వరం బుద్ధిః న సా విద్యా విద్యాయా బుద్ధిరుత్తమా ।
బుద్ధిహీనా వినశ్యంతి యథా తే సింహకారకాః ॥

(అర్థం: శాస్త్రజ్ఞానం ఎంతవున్నా లోకజ్ఞానం లేకపోతే సింహాన్ని బ్రతికించిన ముగ్గురు అన్నలలాగా వినాశం పొందుతాము.)

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరిలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. వారిలో మొదటి ముగ్గురు మంత్రశాస్త్రంలో ఆరితేరినవారు. వారిలో చివరివాడికి చదువు అబ్బలేదు. కానీ వాడు తెలివితేటలు, సూక్ష్మబుద్ధి కలవాడు, చురుకైనవాడు.

ఒకరోజు అన్నదమ్ములు తమ విద్యను రాజుగారి దగ్గర ప్రదర్శించి ధనం సంపాదించాలని అనుకున్నారు. వారంతా రాజధానికి బయలుదేరారు. వారితోపాటు చివరివాడు కూడా బయలుదేరగా, వాణ్ణి తమతో రావద్దన్నారు. చదువురానివాడు తమతో రావడం దండగ అని వారు అనుకున్నారు. కానీ చివరివాడు వారిని ఎంతగానో బ్రతిమాలాడు. ఎలాగైతేనేం, చివరకు అతణ్ణి తమతో తీసుకుని వెళ్ళడానికి అన్నలు అంగీకరించారు.

వారు కొండలూ, కోనలూ దాటి వెళుతుండగా ఒక సింహం అస్థిపంజరం కనిపించింది. అన్నదమ్ములు ఆ అస్థిపంజరానికి ప్రాణం పోసి తమ విద్యను పరీక్షించుకోవాలి అనుకున్నారు.

అప్పుడు చివరివాడు అది ప్రమాదకరమని, ఆ పని చెయ్యవద్దని తన అన్నల్ని హెచ్చరించాడు. కానీ వాడి మాటలు పట్టించుకోకుండా వారు సింహం ఎముకల్ని ఒకచోట చేర్చి మంత్రాలు చదవడం మొదలు పెట్టారు. చివరివాడు ఇక లాభం లేదు అనుకుని ప్రక్కనున్న చెట్టు ఎక్కి కూర్చున్నాడు. అన్నలు చదివిన మంత్రాల మహిమతో సింహం క్షణంలో ప్రాణంతో లేచి నిలబడింది. క్రూరంగా ఆ ముగ్గురినీ చంపి తన దారిన తాను వెళ్ళిపోయింది.

నీతి: నైపుణ్యాన్ని సంపాదించడమే చదువు కాదు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకోగలిగే విచక్షణాశక్తిని ఇచ్చేదే అసలైన విద్య.

19. మూడు చేపల కథ

అనాగతవిధాతా చ ప్రత్యుత్పన్నమతిస్తథా ।
ద్వావేతౌ సుఖమేధేతే యద్భవిష్యో వినశ్యతి ॥

(అర్థం: మూడు చేపల కథలోని మొదటి చేపలాగా రాబోయే ప్రమాదాన్ని ముందుగానే ఊహించి, బయటపడే ఉపాయాన్ని ఆలోచించాలి లేదా రెండవ చేపలాగా ప్రమాదంలో చిక్కుకున్నాక బయటపడే తెలివితేటలుండాలి. ఈ రెండూ లేనివాడు మూడవ చేపలాగా నశిస్తాడు.)

ఒక కొలనులో చాలా చేపలు ఉండేవి. వాటిలో మూడు చేపలు చాలా సఖ్యంగా ఉండేవి. వాటి పేర్లు అనాగతవిధాత (దీర్ఘదర్శి), ప్రత్యుత్పన్నమతి (ప్రాప్తకాలజ్ఞుడు), యద్భవిష్యం (దీర్ఘసూత్రుడు). అనాగతవిధాత రాబోయే సమస్యల్ని, ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి, బయటపడే ఉపాయాన్ని ఆలోచించేది. ప్రత్యుత్పన్నమతి అప్పటికప్పుడు, సమయస్ఫూర్తితో, ఏదోవొక ఉపాయంతో తప్పించుకునేది. యద్భవిష్యం, ఏదోవొకటి జరుగుతుందిలే అని ఊరుకునేది. ఒకసారి అనావృష్టివల్ల చాలాకాలం వానలు కురవలేదు. కొలనులో నీరు తరిగిపోవడం మొదలు పెట్టింది. అది గమనించిన అనాగతవిధాత తన ఇద్దరు మిత్రులతో, "కొలనులో నీరు ఇంకా తగ్గిపోతే చేపలవాళ్ళు మనల్ని సులభంగా పట్టుకుంటారు. అందుకని బాగా నీరున్న వేరే కొలనులోకి ఇప్పుడే వెళ్ళిపోదాం" అని చెప్పింది. ప్రత్యుత్పన్నమతి, "ఇక్కడ ఎంతో సుఖంగా ఉంది. చేపలవాళ్ళు వచ్చినప్పుడు ఏదో ఒక ఉపాయంతో తప్పించుకోవచ్చులే!" అని దాటవేసింది. యద్భవిష్యం కూడా ప్రత్యుత్పన్నమతినే సమర్థించింది.

తన మిత్రులతో ఉంటే ప్రమాదం తప్పదని నిశ్చయించుకుని, అనాగతవిధాత ముందుగానే ఆ కొలనులోకి ప్రవహించే ఒక కాలువకు ఎదురీది వేరే పెద్దకొలనుకు సురక్షితంగా చేరుకుంది. అక్కడ దానికి ఎటువంటి అపాయమూ లేదు.

ఆ చేపలు ఊహించినట్టుగానే కొలనులో నీటిమట్టం బాగా తగ్గిపోయింది. జాలరులు రానే వచ్చారు. వలలువేసి చేపల్ని పట్టసాగారు. ప్రత్యుత్పన్నమతి, యద్భవిష్యం ఇద్దరూ వలలో పడిపోయారు. ప్రత్యుత్పన్నమతి తాను ప్రమాదంలో చిక్కుకున్నట్టు గ్రహించి చచ్చినట్టు నటించసాగింది. జాలరులు వలను పైకిలాగినప్పుడు దాన్ని చచ్చిన చేప అనుకుని ఒడ్డుకు విసిరేశారు. జాలరులు వేరే చేపల్ని పడుతున్నప్పుడు ప్రత్యుత్పన్నమతి చల్లగా నీటిలోకి జారుకుని అక్కడ నుంచి పారిపోయింది. యద్భవిష్యం వలలో చిక్కుకుని కొట్టుకోసాగింది. జాలరులు దాన్ని పట్టి తీసుకుపోయారు.

నీతి: సమస్యలను ముందుగానే తెలుసుకోగలిగే సూక్ష్మబుద్ధిని అలవరచుకోవడం ఉత్తమం. లేకపోతే ప్రమాదం నుంచి బయటపడే సమయస్ఫూర్తి అయినా ఉండాలి. ఆ రెండూ లేనివాడికి నాశనం తప్పదు.

20. బ్రాహ్మణుడు - పేలపిండి

అనాగతవతీం చింతామసంభావ్యాం కరోతి యః ।

స ఏవ పాండురః శేతే సోమశర్మ పితా యథా ॥

(అర్థం: రాబోయే కాలాన్ని గురించి పగటికలలు కంటూ, చేస్తున్న పనిని నిర్లక్ష్యం చేస్తే సోమశర్మ తండ్రి కథలో లాగా సంపాదించిన కొద్ది పేలపిండి కూడా నేలపాలవుతుంది.)

పూర్వం ఒక ఊరిలో ఒక పేద బ్రాహ్మణుడు ఉన్నాడు. అతను మహా



బద్ధకస్తుడు. అతని వద్ద ఒక చెంబు తప్ప వేరే ఆస్తి ఏమీ లేదు. అతడు ఒకరోజు ఎన్నో అవస్థలుపడి ఆ చెంబు నిండా పేలాల పిండిని సంపాదించాడు. ఆ చెంబు తన ప్రక్కనే ఉంచుకుని ఒక చెట్టుకింద నిద్రపోయాడు. ఆ నిద్రలో భయంకరమైన కరవు వచ్చినట్లు కలగన్నాడు. ఆ కరవు సమయంలో ఆ పేలాల పిండిని అమ్మి చాలా ధనం సంపాదించినట్లు, ఆ ధనంతో ఒక ఆవును కొని మేపి చాలా పెద్ద ఆవులమందగా చేసినట్లు, ఆ ఆవులను అమ్మి గుర్రాలను కొన్నట్లు, అలాఅలా ఒక మేడ కట్టినట్లు, ఒక చక్కని అమ్మాయిని వివాహం చేసుకున్నట్లు, ఒక కొడుకు పుట్టినట్లు, ఆ పిల్లవాడికి సోమశర్మ అనే పేరు పెట్టినట్లు, హాయిగా ఉన్నట్లు కలగన్నాడు. ఒకరోజు ఆ పిల్లవాడు అల్లరి చేస్తుంటే వాణ్ణి సముదాయించమని భార్యను ఆజ్ఞాపించాడు. ఆమె పట్టించుకోలేదు. అతడికి భార్య మీద చాలా కోపం వచ్చింది. ఆమెను తన్నాలని కాలు గట్టిగా జాడించాడు. ఆ కాలు తగిలి చెంబులో పేలాల పిండి మొత్తం నేలమీద పడి పాడయిపోయింది. కల చెదిరి ఆ బ్రాహ్మణుడు ఏడుస్తూ కూర్చున్నాడు.

నీతి: పూనుకుని పనిచేసేవాడు గొప్పవాడవుతాడు గానీ పగటికలలు కనే వాడు కాదు.

21. పేను - నల్లి కథ

న హ్యవిజ్ఞాత శీలస్య ప్రదాతవ్యః ప్రతిశ్రయః ।
మత్కుణస్య చ దోషేణ హతా మందవిసర్పిణీ ॥

(అర్థం: క్రొత్తవాడి స్వభావం ఏమిటో తెలియకుండా ఆశ్రయమిస్తే నల్లి చేసిన తప్పువల్ల పేనుకు ముప్పు వాటిల్లినట్లు క్రొత్తవాడి చేష్టలవల్ల మనకు చేటు కలగవచ్చు.)

మందవిసర్పిణి అనే ఒక పేను ఉండేది. అది చాలాకాలంగా ఒక రాజుగారి హంసతూలికాతల్పాన్ని అంటి పెట్టుకుని, రాజుగారిని కుట్టి రక్తం త్రాగుతూ సుఖంగా జీవిస్తోంది. నెమ్మదిగా ప్రాకుతుంది కనుక మందవిసర్పిణి అని దానికి పేరు. అయితే ఏమాత్రం నొప్పి కలగనివ్వదు కనుక దానివల్ల రాజుగారికి ఏ బాధా లేదు.

అయితే ఒకనాడు ఒక నల్లి వచ్చి ఆ పేనుని ఆశ్రయం కోరింది. ప్రతిరోజూ పంచభక్ష్యపరమాన్నాలు భోజనం చేసే రాజుగారి రక్తం చాలా బాగుంటుందని, దాన్ని ఒక్కసారి రుచిచూసి వెళ్ళిపోతానని ఆ నల్లి పేనుని వేడుకుంది. మొహమాటం కొద్దీ ఆ పేను సరేనని ఒప్పుకుంది. అయితే, "రాజుగారికి

నిద్రపట్టేవరకూ ఆగి, మెల్లగా నొప్పి పెట్టకుండా పని కానివ్వు" అంటూ క్రొత్తగా వచ్చిన ఆ నల్లికి పేను ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. కానీ, రాజుగారు వచ్చి మంచం మీద నడుం వాల్చారో లేదో నల్లి ఆత్రంగా పుటుక్కున పొడిచి రక్తాన్ని జుర్రింది. ఆ బాధకు తట్టుకోలేక రాజు సేవకుణ్ణి పిలిచాడు. సేవకుడు దీపం తెచ్చి పట్టెమంచం, పరుపు అంతా గాలించాడు. ఈలోగా నల్లి పరుగెత్తి పారిపోయి పట్టెసందులో నక్కింది. ఏమీ తెలియని పేను దుప్పటిని అంటిపెట్టుకుని సేవకుడి కంటబడింది. అదే రాజును కుట్టిందనుకుని సేవకుడు ఆ పేనును పట్టుకుని నేలరాచి చంపేశాడు.

నీతి: గుణము, శీలము తెలియకుండా ఎవ్వరినీ చేరదీయరాదు.

22. రెండు హంసలు - తాబేలు కథ

సుహృదాం హితకామానాం న కరోతీహ యో వచః ।
స కూర్మ ఇవ దుర్బుద్ధిః కాష్ఠాద్భ్రష్టో వినశ్యతి ॥

(అర్థం: తన మేలు కోరి చెప్పిన స్నేహితుని మాట ప్రకారం చేయనివాడు నోటితో పట్టుకున్న కఱ్ఱపుల్లను వదిలిపెట్టి క్రిందపడిన తాబేలులాగా నశిస్తాడు.)

ఒక కొలనులో ఒక తాబేలు, రెండు హంసలు ఎంతో స్నేహంగా ఉండేవి. కొన్నాళ్ళకు ఆ కొలనులోని తామరతూడులు అయిపోయాయి. దానితో హంసలు





రెండూ ఆహారం కోసం దూరంగా ఉన్న కొలనుకు పోవలసి వచ్చింది. అక్కడ చాలా తామరలు ఉన్నాయి. అయితే తాబేలు కూడా వాటితో వెళ్ళడానికి తయారయింది.

"మేము ఆకాశంలో ఎగురుతూ వెళతాం. కాబట్టి నీకు మాతోపాటు రావడం కుదరదు. నువ్వు ఇక్కడే ఉండు. మేము తరచుగా వచ్చి నిన్ను చూసి వెళతాం" అని హంసలు చెప్పినా తాబేలు వినలేదు. తాను కూడా వెళ్ళవలసిందేనని పట్టుబట్టింది.

అప్పుడు ఆ హంసలు తాబేలును చూసి జాలిపడ్డాయి. ఒక ఉపాయాన్ని ఆలోచించాయి. ఒక కర్రపుల్లను తెచ్చి, దాని మధ్యలో నోటితో గట్టిగా కరిచి పట్టుకోమని ఆ తాబేలుకు చెప్పాయి. "నోరు తెరిస్తే క్రిందపడి ఛస్తావ"ని కూడా హెచ్చరించాయి. ఆ రెండు హంసలూ ఆ కర్రపుల్ల రెండు చివరల్నీ తమ ముక్కులతో కరచిపట్టుకుని ఎగిరి పోసాగాయి. నేలమీదనుండి ఈ వింతను చూసిన జనం ఈలలువేసి, చప్పట్లు చరచసాగారు. తాను నోరు తెరువరాదన్న హెచ్చరికను మరచిపోయి, "ఏమిటా కలకలం?" అని తాబేలు అడగబోయింది. ఇంకేముంది? క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకుంది.

నీతి: మేలుకోరేవారి మాట వినకపోవడం వినాశనాన్ని కొనితెచ్చుకోవడమే.

ఒకసారి శ్రీరామకృష్ణ పరమహంస తమ శిష్యుడైన యోగానంద స్వామికి కొన్ని బొద్దింకల్ని చంపమని చెప్పారు. కానీ అతడు వాటిని చంపడం ఎందుకులే అని దూరంగా పారవేసి వచ్చాడు. కానీ శ్రీరామకృష్ణ పరమహంస అతణ్ణి, "వాటిని చంపావా, లేదా?" అని మళ్ళీ అడిగారు. అతడు ఆ బొద్దింకల్ని చంపలేదని సమాధానం చెప్పినపుడు, "చెప్పినది చెప్పినట్టుగా చెయ్యాలి. ఎందుకంటే ఒక చిన్నపనిలో అశ్రద్ధ చూపిస్తే, అదే ఇతర విషయాలలోకి చాప క్రింద నీరులా ప్రవేశిస్తుంది. మనల్ని హీనస్థితికి దిగజార్చుతుంది" అని మందలించారు. అందువల్ల పెద్దలు, శ్రేయోభిలాషులు చెప్పేమాటల్ని శ్రద్ధగా అమలు చెయ్యాలి.

23. తండ్రి - నలుగురు కొడుకుల కథ

బహూనామప్యసారాణాం సమవాయో హి దుర్జయః ।
తృణైరావేష్ట్యతే రజ్జుః ఏన నాగోఽపి బధ్యతే ॥

(అర్థం: అతి సామాన్యులే అయినా నలుగురు కలసికట్టుగా పనిచేసినప్పుడు తిరుగులేని బలం కలవారవుతారు. గడ్డిపోచలతో పేనబడిన త్రాడు ఏనుగునైనా కట్టివెయ్యగలుగుతుంది కదా!)

ఒక ఊరిలో ఒక తండ్రికి నలుగురు కొడుకులున్నారు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయినా, ఇంకా తమలో తాము పోట్లాడుకుంటూనే ఉండేవారు. ఇది చూసి తండ్రికి బాధ కలిగింది. ఆయన వారికి బుద్ధి చెప్పదలుచుకున్నాడు.

ఆ తండ్రి కొన్ని కర్రల్ని తెచ్చి ఒక్కొక్కటి ఇచ్చి వాటిని విరవమన్నాడు. వాళ్ళు వాటిని సునాయాసంగా విరిచివేశారు. తరువాత తండ్రి నాలుగుకర్రలని కలిపి, మోపులా గట్టిగా కట్టివేసి ఒక్కొక్కడికీ దాన్ని ఇచ్చి విరవమన్నాడు. వాళ్ళు విరవలేకపోయారు. నలుగురూ కలిసి ఒకేసారి ప్రయత్నించినా ఆ మోపు విరగలేదు.

అప్పుడు తండ్రి వారితో, "నాయనలారా! విడివిడిగా ఉన్నప్పటికంటే మోపుగా ఉన్నప్పుడు ఈ కర్రలకు ఎంత బలం వచ్చిందో చూశారు కదా! అలాగే, మీలో మీరు కలహించుకుంటే బలహీనపడిపోతారు. ఐకమత్యంతో కలసి ఉంటే మహాబలవంతులవుతారు" అని హితవు చెప్పాడు. ఆనాటి నుండి ఆ అన్నదమ్ములు కలిసికట్టుగా ఉండసాగారు.

నీతి: ఐకమత్యమే మహాబలం.

వివేకానంద స్వామి కలసి పనిచెయ్యడం గురించి ఇలా చెప్పారు. “భారతదేశంలో ముగ్గురు మనుష్యులు ఏ పనినీ ఐదు నిమిషాలపాటు కలిసి చెయ్యలేరు. ఎందుకంటే మనలో ప్రతి ఒక్కరూ అధికారం కోసం పోరాడేవారే.” కలిసి సంఘటితంగా పనిచెయ్యలేకపోవడమే భారతదేశపు దీనస్థితికి కారణం అని, సంఘటితంగా పనిచెయ్యడం ద్వారానే తిరిగి మన దేశాన్ని బలమైనదిగా చెయ్యగలమని వివేకానంద స్వామి బోధించారు.

24. తెలివి తక్కువ నక్క కథ

ఒక అడవిలో గొర్రెలు చాలా ఉన్నాయి. ఒకరోజు రెండు గొర్రెపోతుల మధ్య పోట్లాట మొదలైంది. అవి తలలతో ఒకదానినొకటి ఢీకొంటూ భయంకరంగా పోరాడసాగాయి. అవి వెనక్కి వెళ్ళి, చాలావేగంతో ముందుకు వచ్చి ఢీకొనసాగాయి. ఈ పోరాటాన్ని ఒక నక్క చూసింది. గొర్రెలలో ఒకటి తప్పకుండా మరణిస్తుందని, దానిని తినవచ్చునని ఆ నక్కకి ఆశ కలిగింది. గొర్రెపోతులు ఢీకొన్నప్పుడు వాటి తలలలోంచి రక్తం కారసాగింది. కొంతసేపటికి అవి ఢీకొట్టే చోట నేల రక్తంతో తడిసిపోయింది. నక్కకి ఆ రక్తాన్ని చూడగానే నోరు ఊరి, మతిపోయింది. గొర్రెపోతులు మరొకసారి కుమ్ముకోవడానికి వెనక్కి నడిచినప్పుడు ఆ నక్క ఉండబట్టలేక ఆ రక్తాన్ని నాకుదామని ముందుకు దూకింది. ఆ నక్క నేలపైవున్న రక్తాన్ని మైమరిచి నాకుతుండగా, మళ్ళీ గొర్రెపోతులు రెండూ వచ్చి బలంగా ఢీ కొట్టుకున్నాయి. వాటి మధ్యలో నలిగి నక్క మరణించింది.

నీతి: అత్యాశ పనికిరాదు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో లేదో చూడకుండా దేనికీ తొందరపడకూడదు.

25. పావురాల సంఘబలం

ఒక అడవిలో కొన్ని పావురాలు ఉండేవి. చిత్రగ్రీవం అనే పావురం వాటి రాజు. చిత్రగ్రీవం ఎప్పుడూ తన వారి సంక్షేమం కోసం పాటుపడేవాడు.

ఒకరోజు ఒక వేటగాడు ఆ అడవికి వచ్చి కొన్ని నూకలు నేలమీద చల్లి, వాటిమీద వల పన్నాడు. పక్షులు ఎప్పుడు వాలతాయా అని దూరంగా నక్కి చూస్తున్నాడు.

ఇంతలో చిత్రగ్రీవుడి పావురాల బృందం అక్కడికి ఎగురుతూ వచ్చింది. ఆ పావురాలకు నూకలను చూసి నోరు ఊరింది. కొన్ని పావురాలు అక్కడ వాలి

నూకలను తిందామని అన్నాయి. చిత్రగ్రీవం అడవిలో నేలపై నూకలు కనిపించడం విడ్డూరమని, దీనిలో ఏదో మోసం ఉందని వారించాడు. కానీ మిగిలిన పావురాలు ఆ మాటలను పెడచెవిని పెట్టి, నూకలను తిందామని నేలమీద వాలి ఆ వలలో చిక్కుకున్నాయి. చిత్రగ్రీవం అది చూసి ఎంతో బాధపడ్డాడు. 'చావైనా, బ్రతుకైనా తన పరివారంతోనే ఉండడం తన ధర్మం!' అని తాను కూడా దిగి వలలో చిక్కుకున్నాడు. వలలో చిక్కుకున్న పావురాలు ఒకదానినొకటి నిందించుకోవడం మొదలు పెట్టాయి. అప్పుడు ధైర్యవంతుడైన ఆ చిత్రగ్రీవం, "కష్టాలు వచ్చినప్పుడే గుండెబలం కావాలి, సమస్యలు వచ్చినప్పుడు భయపడకూడదు. మనం అందరం కలసికట్టుగా ఒకేసారి ఎగిరి, ఈ వలను మొత్తం ఎగరేసుకు పోదాం" అని మిగిలిన పావురాలతో చెప్పాడు.

ఇంతలో దూరం నుంచి వేటగాడు వాటిని పట్టుకోవాలని రాసాగాడు. చిత్రగ్రీవం చెప్పినట్టుగా అన్ని పావురాలు కలిసి, ఒక్కసారిగా పైకి ఎగిరాయి. వాటితోపాటు వలను కూడా ఎగరేసుకు పోసాగాయి. బోయవాడు దీనిని చూచి ఆశ్చర్యపోయాడు. అప్పుడు చిత్రగ్రీవం తన తోటి పావురాలతో, "ఇక్కడకి దగ్గరలో నా ప్రియమిత్రుడైన హిరణ్యకుడు అనే ఎలుకల రాజు ఉన్నాడు. మనం అతని వద్దకు వెళితే అతడు ఈ వలను కొరికి మనలను విడిపిస్తాడు" అని చెప్పాడు. పావురాలు వలతో సహా హిరణ్యకుడు నివసించే బిలం ముందు వాలాయి. హిరణ్యకుడు చిత్రగ్రీవుని గొంతువిని బయటకు వచ్చాడు. తన స్నేహితుడు వలలో చిక్కుకుని ఉండడం చూసి, "నువ్వు నా ప్రాణమిత్రుడివి, కనుక మొదట నీ బంధనాలను కొరుకుతాను. తర్వాత నీ మిత్రులను విడిపిస్తాను" అన్నాడు. కానీ చిత్రగ్రీవం తన స్వార్థాన్ని చూసుకోకుండా, "వీళ్ళంతా నాకు అత్యంత ఆప్తులు. ముందుగా వీరిని విడిపించు. అప్పుడే నాకు తృప్తి కలుగుతుంది" అని చెప్పాడు. హిరణ్యకుడు చిత్రగ్రీవం యొక్క ధర్మగుణానికి ఎంతో సంతోషించి, తన మూషిక సైన్యాన్ని పిలిచాడు. వారంతా కలిసి వలను కొరికి పావురాలను విముక్తుల్ని చేశారు.

నీతి: కలసికట్టుగా ఉంటే చెయ్యలేని పని లేదు. తెలివిగల మిత్రుణ్ణి మించిన వరం లేదు.

✡ ✡ ✡ ✡ ✡




స్వామి వివేకానంద

మహావ్యక్తి కథ

(వివేకానంద స్వామి సంక్షిప్త జీవిత చరిత్ర)

ప్రతి వ్యక్తీ సుఖం కావాలని కోరుకుంటాడు. కానీ, మహావ్యక్తి మాత్రమే నిజంగా సుఖంగా ఉండగలడు. దుఃఖానికి కారణం భయం. మహావ్యక్తికి భయమనేది లేదు. అందువల్ల అతడే నిజంగా సుఖంగా ఉండగలడు. ఒక మహావ్యక్తి కథ చెబుతాను, వినండి! అప్పుడు మహావ్యక్తి అంటే ఎలా వుంటాడో మీకే తెలుస్తుంది. వివేకానంద స్వామి ఒక మహావ్యక్తి. ఆయన 1863లో కలకత్తాలో జన్మించారు. అతడికి తల్లితండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ్ దత్త. చిన్నతనంలో అతడు తన స్నేహితులతో కలసి తపస్సు చేసే ఋషులలాగా నటిస్తూ ఆటలాడేవాడు. నరేంద్రుడు బుద్ధుడిలాగానో, ఒక మహారాజులాగానో నటిస్తూ ఆటలలో పాల్గొనేవాడు.

ఒకసారి వాళ్ళు ధ్యానం ఆట ఆడుతున్నారు. నరేంద్రుడు కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. కానీ మిగిలిన పిల్లలు మధ్యమధ్యలో కళ్ళు తెరిచి చూస్తున్నారు. అప్పుడు వాళ్ళు ఒక పెద్ద త్రాచుపాము తమవైపు ప్రాకుతూ రావడాన్ని చూశారు. ఆ పిల్లలు చెల్లాచెదరుగా పారిపోతూ, “నరేన్! త్రాచుపాము! పారిపో!” అని కేకలు పెట్టారు. నరేంద్రుడికి ఆ కేకలు వినబడలేదు. అతడు భగవంతుడి మీద ధ్యానంలో మునిగి ఉన్నాడు. ఆ ఏకాగ్రతలో అన్నింటినీ మరచిపోయాడు. అతణ్ణి ఏమీ చేయకుండా, కొంతసేపటికి, ఆ పాము తనదారిన తాను వెళ్ళిపోయింది.



మరొకనాడు పిల్లలందరూ కలిసి ఒక ఉయ్యాలను వ్రేలాడదీయడానికి ప్రయత్నిస్తున్నారు. స్తంభాలుగా పాతవలసిన దుంగలు బాగా బరువుగా ఉన్నాయి. ఆ పిల్లలు వాటిని నిలబెట్టలేకపోయారు. వారిచుట్టూ పెద్దవాళ్ళు కొందరు చూస్తూ నిలుచున్నారు. కానీ ఎవరూ వారికి సహాయం చేయడం లేదు. వారిలో ఒక ఇంగ్లీషు నావికుడు

ఉన్నాడు. అతడు వారికి సహాయం చేయడానికి ముందుకు వచ్చాడు. దుంగలను ఎత్తుతుండగా ఒకటి ఆ నావికుడి తలమీద పడి గాయమై, రక్తం ధారలు కట్టింది. నావికుడు స్పృహ తప్పి పడి పోయాడు. బాలురు అతడు చనిపోయాడని అనుకున్నారు. వారిలో చాలామంది కాలికి బుద్ధి చెప్పారు. కాని నరేంద్రుడు, మరి ముగ్గురు మిత్రులు మాత్రం పారిపోలేదు. నరేంద్రుడు నావికుడి తలకు కట్టుకట్టాడు. అతడి ముఖం మీద నీరుచల్లి విసరసాగాడు. కొంత సేపటికి నావికుడు కళ్లు తెరిచాడు. బాలురు అతణ్ణి దగ్గరలో ఉన్న ఒక పాతశాలలోనికి తీసుకుని వెళ్ళి పడుకోబెట్టారు. డాక్టర్‌ను పిలుచుకు వచ్చారు. గాయం మానేవరకు అతడికి సేవచేశారు. అతణ్ణి బ్రతికించుకోగలిగినందుకు వారు సంతోషించారు. నావికుడు స్పృహతప్పి, చనిపోయినట్టే కనిపించినా, వారు భయపడలేదు. కనుకనే వారు పారిపోలేదు.



నరేంద్రుడికి ఆటలంటే చాలా ఇష్టం. బాగా ఆడేవాడు కూడా. కానీ అతడు చదువును నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి చదివేవాడు. విద్యార్థి దశలో కూడా అతడు ఎల్లప్పుడూ గాఢమైన ఆలోచనలో మునిగి ఉండేవాడు. పరీక్షలలో పాసు కావడం, మంచి ఉద్యోగం సంపాదించుకోవడం, పెళ్ళి చేసుకోవడం, ఇవే జీవితలక్ష్యాలు కానవసరం లేదని, ఇవే మానవుణ్ణి సంతృప్తి పరచలేవని అతడు భావించేవాడు. వీటికి మించినది ఏదో మానవుడికి లక్ష్యమై ఉండాలి. అయితే, ఆ లక్ష్యం ఏదో అతడు నిర్ణయించుకోలేక పోయాడు. ఒకటి మాత్రం అతడు నిర్ణయించుకున్నాడు. "మానవునికి జ్ఞానం కావాలి, సచ్ఛీలం (మంచి నడవడిక) కావాలి."

దేవుడున్నాడని పెద్దలు అంటారు. కానీ ఎక్కడా కనపడడు కదా! నరేంద్రుడికి ఒక సందేహం కలిగింది. 'మానవుడు ఆ దేవుణ్ణి ఎలా చూడగలడు?' కలకత్తా అంతా కలయతిరిగి, దేవుణ్ణి చూచిన మనుష్యుల కోసం

వెతికాడు. ఎవరిని అడిగినా దేవుడు ఉన్నాడంటారు తప్ప తాము చూశామని చెప్పేవారు కనపడలేదు.



చిట్టచివరకు నరేంద్రుడు శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. "స్వామీ! మీరు దేవుణ్ణి చూశారా?" అని సూటిగా అడిగాడు. "చూశాను!" అని శ్రీరామకృష్ణ పరమహంస తడుముకోకుండా జవాబు చెప్పారు. "నా ఎదురుగా నిన్ను చూస్తున్నంత నిశ్చయంగా, ఉహూ, కాదు, నిన్ను చూస్తున్నదాని కంటే స్పష్టంగా, భగవంతుణ్ణి చూశాను. భగవంతుణ్ణి చూడవచ్చు. నేను నీతో మాట్లాడుతున్నట్టే మనం ఆయనతో మాట్లాడవచ్చు" అని చెప్పారు.

రామకృష్ణుల నుంచి నరేంద్రుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. నిర్భయత్వాన్ని (భయపడకుండా ఉండడాన్ని) నేర్చుకున్నాడు. స్వావలంబనాన్ని (తనమీద తాను ఆధారపడడాన్ని) నేర్చుకున్నాడు. మహాపురుష లక్షణాలను అలవరచుకున్నాడు. బుద్ధిబలం అవసరం. కానీ, దానితోపాటు శారీరకబలం కూడా కావాలి. శరీరం, బుద్ధి ఇవి రెండూ సమగ్రంగా, సమానంగా అభివృద్ధి చెందాలి. వీటిని మించి ఆత్మబలం కావాలి. మనలో ఆత్మ ఉన్నది అని తెలుసుకున్నప్పుడు మనకు గొప్ప శక్తి కలుగుతుంది. దానినే ఆత్మబలం అంటారు. ఆత్మబలమే నిజమైన బలం. మంచి శీలాన్ని అలవరచుకోవడమే నిజమైన విద్య.

నరేంద్రుడు "స్వామి వివేకానంద" అనే పేరుతో సన్యాసం తీసుకున్నాడు. అయితే సన్యాసం తీసుకున్నవారే మహాపురుషులు కాగలరని అనుకోనవసరం లేదు. సత్ప్రవర్తనను అలవరచుకోగలిగితే మనలో ఎవరమైనా మహావ్యక్తులం కావచ్చు.


ఉత్తరాన హిమాలయం నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు కొన్ని సంవత్సరాలపాటు స్వామీజీ (వివేకానంద స్వామి) భారతదేశమంతా

పర్యటించారు. ఒక్కొక్కసారి ఆయనకు భోజనం దొరికేది కాదు. ఒక్కొక్కసారి రాత్రివేళ ఆయనకు వసతి దొరికేది కాదు. కాని, వివేకానంద స్వామి తన హృదయంలోని భగవంతుణ్ణి ఎప్పుడూ విస్మరించలేదు. భగవంతుడు తనకు తోడుగా ఉన్నాడన్న విశ్వాసంతో ఆయన ఆకలి, దప్పిక, చలి, ఎండ, అపాయాలు, వేటినీ లెక్కచేసేవారు కాదు. దేశం నలుమూలల సంచారం చేస్తూ స్వామీజీ భారతీయ జీవనస్వరూపాన్ని తిలకించారు. నిరుపేదల తలలపై దారిద్ర్యదేవత చేస్తున్న విలయతాండవాన్ని చూచి చలించిపోయారు. సమాజంలో భారతీయ మహిళల నికృష్ట పరిస్థితిని చూసి ఆవేదన చెందారు. దేశ సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్నారు.



భారతదేశపు దక్షిణాగ్రంలో ఉన్న కన్యాకుమారిని చేరుకున్నారు. అక్కడ ఆయన సముద్రశాఖను ఈది, తీరానికి అరమైలు దూరాన సముద్రం మధ్యలో ఉన్న ఒకపెద్ద కొండరాయి మీదకు ఎక్కారు. అక్కడ ధ్యానంలో నిమగ్నమై పోయారు. ఆయన ధ్యాననేత్రానికి భారత భవిష్యత్తు విస్పష్టంగానే కాక ఉజ్జ్వలంగా సాక్షాత్కరించింది. అయితే, ఆ భవిష్యత్తును భారతీయులు తమ స్వయంకృషితోనే నిర్మించుకోవాలనీ, ఎవరో వచ్చి సహాయం చేస్తారనుకుంటే కుదరదనీ, స్వామీజీ గ్రహించారు. ముఖ్యంగా భారతీయులకు కావలసింది శీలబలం. ఆ బలంతో మాత్రమే వారు తమ సమస్యలను పరిష్కరించుకోగలరు.

కానీ, మహాపురుషుడికి మాతృదేశం ఏది? పరాయి దేశం ఏది? లోకమంతా తనదే కాదా? భారతదేశానికే కాక అఖిల ప్రపంచానికి సేవచేయాలన్న ఆరాటం వివేకానంద స్వామిలో ఉప్పెనలాగా పొంగి పొరలింది. పశ్చిమ దేశాలవారిని, తూర్పు దేశాలవారిని, సకల మానవాళిని ఉద్ధరించాలన్న తీవ్రమైన తపనతో ఆయన విశాలహృదయం నిండిపోయింది. ప్రతి మానవుడు అభివృద్ధి సాధించాలని, పూర్ణజీవితాన్ని అనుభవించాలని ఆయన కాంక్షించారు.



చికాగోలో వివేకానంద స్వామి

వివేకానంద స్వామి 1893లో అమెరికా వెళ్ళారు. అక్కడ చికాగో నగరంలో ఒక మహాసభ జరుగుతోంది. ప్రపంచంలోని అన్ని మతాలవారు అక్కడ సమావేశమయ్యారు. ప్రతివారూ తమ మతమే అన్నిటికంటే గొప్పదని చాటుకుంటున్నారు. కానీ స్వామీజీ వారికి హిందూమతం అన్ని మతాల పట్ల సహనాన్ని చూపడమే కాక అన్ని మతాలూ సత్యమైనవే అని ఒప్పుకుంటుందని చెప్పారు. అన్ని నదులూ సముద్రం లోనికే ప్రవహించినట్లు అన్ని మతాలూ ఒకే దేవుని వద్దకు చేరుస్తాయని వివరించారు. స్వామీజీ ప్రసంగాన్ని విన్నవారు అందరూ అక్కడి వక్తలందరిలోకీ వివేకానందుడే గొప్పవాడని కొనియాడారు.

ఈ సభలో ఆయన అనేక ప్రసంగాలు చేశారు. ఒక ప్రసంగంలో వారికి 'నూతిలో కప్ప' కథను చెప్పారు. ఒక నూతిలో ఒక కప్ప నివసించేది. దానికి ప్రపంచంలో మరెన్నో నూతులు ఉంటాయని తెలియదు. ఆ నూతుల్లో మరెన్నో కప్పలుంటాయని అది ఎరుగదు. ఆ నూతుల కంటే గొప్పదైన మహాసముద్రాన్ని గురించి అది కనీసం ఊహించనైనా లేదు. (ఈ కథను మీరు ఈ పుస్తకంలో మార్గదర్శక కథలు అన్న అధ్యాయంలో చూడవచ్చు.) తమ మతమే గొప్పదని చెప్పుకుంటున్న వేర్వేరు మతాలవారు ఆ నూతిలో కప్పను పోలినవారేనని స్వామీజీ చెప్పారు. వేరే మతమైనా తమ మతాన్ని పోలినదైతేనే మంచిదని వారు సంకుచితమైన మనస్సుతో ఆలోచిస్తారు. తమ మతంలాగా లేని ఇతర మతాలు మంచివి కావని వారు భావిస్తారు. ఇది తప్పు. మనం నూతిలో కప్పలలాగా ఉండకూడదు. మన మతం మనకు మంచిదే, అలాగే ఇతర మతాలు ఇతరులకు మంచివి. అన్ని మతాలు ఆత్మబలాన్ని బోధిస్తున్నాయి. అన్ని మతాలు మనిషిని భగవంతుని వద్దకు తీసుకువెళ్ళే దారులే. దేవుడు ఒక్కడే! దీన్ని అందరూ

అంగీకరిస్తారు. అందువల్ల అన్నిదారులు ఆ దేవుడి వద్దకే చేరుతాయి. ఒక్కొక్క మతం ఒక్కొక్క పేరుతో దేవుణ్ణి పిలుస్తుంది. కానీ అన్ని పిలుపులు దేవుడికి వినిపిస్తాయి. ఏ పేరుతో పిలిచినా దేవుడు పలుకుతాడు.

స్వామీజీ ప్రఖ్యాతి అమెరికా అంతటా ప్రాకింది. ఆయన వాక్యాలు కారుచీకటిలో కాంతికిరణాలలాగా మెరిశాయి. మానవుల హృదయాలలోని అజ్ఞానపు చీకట్లను అవి పారద్రోలాయి. మానవ జీవితలక్ష్యాన్ని అవి చెయ్యెత్తి చూపించాయి. పరిపూర్ణ జీవితాన్ని ఎలుగెత్తి చాటాయి.

అమెరికాలో ఉన్నప్పుడు ఒకసారి స్వామీజీ వసతి కోసం ఒక హోటలుకు వెళ్ళారు. హోటలు మేనేజరు స్వామీజీని చూసి ఒక నీగ్రో అనుకుని ఆయనకు గది ఇవ్వడానికి నిరాకరించాడు. స్వామీజీ బాధపడలేదు. తాను నీగ్రోను కానని, భారతీయుణ్ణని చెప్పుకోలేదు. తనకన్నా మరొక మనిషి హీనుడని చెప్పి తాను లాభపడడం ఆయనకు ఏ విధంగానూ, ఎంతమాత్రమూ ఇష్టం లేదు. మరునాడు పత్రికలన్నీ స్వామీజీ ప్రసంగాన్ని ప్రకటించి ఆయనపట్ల గౌరవాన్ని వెల్లడించాయి. హోటల్ మేనేజర్ తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడ్డాడు.

అమెరికా పశ్చిమభాగంలో వివేకానంద స్వామి పర్యటిస్తుండగా ఒక గ్రామంలో "కౌబాయిస్" (పశువుల కాపరులు) ఆయనపట్ల దురుసుగా ప్రవర్తించారు. దేవుణ్ణి చూచినవాడు భయాన్ని ఎరుగడని వారు విన్నారు. వివేకానందుడు ఏపాటి ధైర్యవంతుడో పరీక్షించాలని వారు అనుకున్నారు. స్వామీజీ ఆరుబయట సమావేశంలో ప్రసంగిస్తున్నారు. బోర్లించిన ఒక కొయ్యతొట్టె ఆయన ఉపన్యాస వేదిక. దానిపై ఆయన నిలబడి ఉన్నారు. ఉన్నట్టుండి ఆయన చెవుల పక్కనుంచి తుపాకీ గుండ్లు దూసుకు పోయాయి. అది కౌబాయిస్ చేసిన పని. కాని వివేకానంద స్వామి తొణకలేదు, బెణకలేదు. ఏమీ జరగనట్టే ప్రసంగాన్ని కొనసాగించారు. అప్పుడు ఆయనకు భయమన్నదే లేదని ఆ కౌబాయిస్ గ్రహించి సిగ్గుపడ్డారు.



ఇంకొక సంఘటన. ఒకసారి స్వామీజీ ఒక నది ప్రక్కన నడుస్తున్నారు. ఆ నది వంతెన మీద కొందరు పిల్లలు నిలబడి నదిలో నీటిమీద తేలుతున్న కోడిగ్రుడ్ల డొల్లలను గురి చూసి తుపాకితో పేలుస్తున్నారు. ఆ డొల్లలను దారాలతో గుచ్చి దండగా చేసి, దానిని వంతెనకు కట్టి ఉంచడంచేత అవి ప్రవాహంలో కొట్టుకుపోవడం లేదు. నీటిలో చిరు కెరటాలవల్ల గుడ్లడొల్లలు పైకి, క్రిందికి ఎగిరెగిరిపడుతున్నాయి. అందువల్ల ఆ పిల్లలకు గురి తప్పిపోతోంది. అది చూస్తున్న స్వామీజీ పెదవులపై మందహాసం తొణికిసలాడింది. ఆయన చిరునవ్వులను చూసి ఆ పిల్లలు స్వామీజీని, "మీరు కొట్టండి చూద్దాం?" అని సవాలు చేశారు. ఆయన వారి ఆటతుపాకీని తీసుకుని జాగ్రత్తగా గురిచూసి కొట్టారు. ఆయన అన్ని డొల్లలను గురి తప్పకుండా కొట్టగలిగారు. ఆ పిల్లలు చాలా ఆశ్చర్యపడ్డారు. బహుశా స్వామీజీ ఇండియాలో షూటింగ్ నేర్చుకుని ఉంటారనుకున్నారు. కానీ, తానెప్పుడూ తుపాకీని పట్టుకోలేదని ఆయన వారికి చెప్పారు. వారి ఆశ్చర్యానికి మేరలేదు. అప్పుడు స్వామీజీ తన రహస్యాన్ని వారికి వెల్లడించారు. "మనస్సును ఏకాగ్రం చేయాలి. అంతకంటే విశేషమేమీ లేదు" అని చెప్పారు.

నిజమే. బలమైన శరీరం, బలమైన మనస్సు కలవాడికే మనస్సు ఏకాగ్రం అవుతుంది. అతడి మనస్సు నిశ్చలంగా వుంటుంది. సీతాకోక చిలుకలాగా ఒకచోటనుంచి మరొక చోటికి తిరుగుతూ ఉండదు. అందువల్లనే అది అన్నింటిని నిశితంగా అర్థం చేసుకోగలుగుతుంది. అందుచేతనే స్వామీజీ శరీరాన్నీ, మనస్సునీ బలమైనవిగా చేసుకోమని మళ్ళీమళ్ళీ బోధించారు.

స్వామీజీ అమెరికా అంతటా పర్యటించి ఉపన్యాసాలిచ్చారు. అంతేకాక యూరోపు దేశాలలో కూడా పర్యటించి ఉపన్యాసాలిచ్చారు. అమెరికాలోనూ, యూరోపులోనూ వేదాంత సమాజాల్ని స్థాపించారు. స్వామీజీ భారతదేశానికి తిరిగి రాగానే తన సేవాపథకాన్ని ఆచరణలో పెట్టారు. "రామకృష్ణ మిషన్" అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. మానవుణ్ణి మాధవుడిగా సేవించడమే దాని లక్ష్యం. కష్టసమయాల్లో బాధితుల్ని ఆదుకోవడం ద్వారా, ఆస్పత్రులు, పాఠశాలలు, విద్యార్థుల వసతిగృహాలు మొదలైన వాటిద్వారా ఈ సంస్థ విభిన్నమతాల వారికి, జాతుల వారికి, వర్గాల వారికి సేవచేస్తున్నది.



మహావ్యక్తి కావడం కష్టమే. కానీ అది అసాధ్యం కాదు. వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకోండి. ఆయనను అనుకరించండి. శక్తిని సాధించాలంటే గొప్పపనులు చేయనక్కరలేదు. స్వామీజీ తన చిన్న, పెద్ద కర్తవ్యాలను ఎంత నిస్వార్థబుద్ధితో నెరవేర్చేవారో, అంత నిస్వార్థబుద్ధితో మీరు కూడా రోజూ చెయ్యవలసిన పనులను, విధులను నెరవేర్చండి. ఆయనలాగా ప్రేమతో, వివేకంతో మీ పనులు మీరు చేయండి. చిక్కులు ఎదురైనప్పుడు ఆయనైతే ఏమి చేసి వుండేవారో ఊహించుకుని అలా చేయండి. వివేకానందుని జీవితకథను, ఆయన ఉపదేశాలను చదవండి, మననం చేయండి. అందువల్ల మీ బలం సర్వతోముఖంగా పెరుగుతుంది. మీ వ్యక్తిత్వం బలంగా రూపొందినప్పుడు, మీరు దేశాన్ని కూడా బలోపేతం చేయగలరు. మనమందరం మహావ్యక్తులం కావడానికి ప్రయత్నిస్తే ఈ ప్రపంచం మరింత ఆహ్లాదకరంగా రూపొందుతుంది.

✡ ✡ ✡ ✡ ✡

ఉద్బోధ

(వివేకానంద స్వామి సూక్తులు)

1. మానవునిలోని దివ్యత్వం

1. శక్తి అంతా మీలోనే ఉంది. మీరు ఏమైనా చెయ్యగలరు, అన్నీ సాధించగలరు. దీన్ని నమ్మండి. మిమ్మల్ని మీరు బలహీనులుగా భావించకండి. ధీరులై లేచి నిలబడి, మీలోని దివ్యత్వాన్ని ప్రకటించండి.

2. అందరూ తమలో ఆత్మ (గొప్ప శక్తి) ఉందని తెలుసుకోవాలి. ఒక జాలరి తనలో ఆత్మ ఉందని తెలుసుకుంటే అతడు మరింత నిపుణుడైన జాలరి అవుతాడు. ఒక విద్యార్థి తనను తాను ఆత్మగా భావిస్తే మరింత ప్రతిభను చూపగలుగుతాడు. ఒక న్యాయవాది తనను తాను ఆత్మ స్వరూపునిగా తెలుసుకుంటే మరింత మంచి న్యాయవాది అవుతాడు.

3. బలహీనతను వదిలించుకోవాలంటే బలాన్ని గురించి ఆలోచించాలి. అంతేకానీ బలహీనతను గురించే ఆలోచిస్తే ప్రయోజనం లేదు. మనందరిలో ఆత్మ ఉంది. అదే మన నిజస్వభావం. ఈ నిజస్వభావం ఏమిటో అందరికీ బోధించండి! మీకు మీరే బోధించుకోండి! నిద్రిస్తున్న మీ ఆత్మను ఎలుగెత్తి పిలవండి! అది ఎంత చక్కగా మేలుకుంటుందో చూడండి. ఎప్పుడైతే ఈ నిద్రిస్తున్న ఆత్మ తనను తాను తెలుసుకుని, పనికి ఉద్యమిస్తుందో అప్పుడు శక్తి వస్తుంది, ఖ్యాతి వస్తుంది, మంచి వస్తుంది, పవిత్రత వస్తుంది, విశిష్టమైన ప్రతిఒక్కటీ వస్తుంది.

4. మీరంతా దేవుని సంతానం! అమృతత్వాన్ని పంచుకు పుట్టిన, పవిత్రమైన, పరిపూర్ణమైన జీవులు! నేలమీద వెలసిన దేవతలు మీరు! అటువంటి మీరు పాపులా? ఒక మనిషిని పాపి అనడమే పాపం! మానవతకే అది మాయని మచ్చ. ఓ సింహాలలారా! ఉద్యమించండి! మిమ్మల్ని మీరు గొర్రెలమని అనుకుని భ్రమపడుతున్నారు. ఆ భ్రమను విదిల్చిపారవెయ్యండి! మీరు అమరులైన ఆత్మలు! ధన్యులు, స్వేచ్ఛాజీవులు! మీరు జడపదార్థం కాదు, శరీరాలు కారు. భౌతికమైన వస్తువులూ, పదార్థాలే మీ సేవకులు. అంతేకానీ భౌతికమైన వస్తువులకు మీరు సేవకులు కారు.

5. ప్రతి మనిషిలోనూ దివ్యత్వం దాగి ఉంది. అయితే దాన్ని వెలికి తీయడం సాధ్యమే. మనకు లోపల, వెలుపల ఉన్న ప్రకృతిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆ దివ్యత్వాన్ని వెలికితీసి, ప్రకటించడమే జీవితగమ్యం. దాన్ని పని ద్వారా (కర్మయోగం), ఆరాధన ద్వారా (భక్తియోగం), మానసిక నియంత్రణ ద్వారా (రాజయోగం), నిత్య-అనిత్యాల విచక్షణ (జ్ఞానయోగం) ద్వారా సాధించవచ్చు. ఈ నాలుగు పద్ధతులలో ఏదోవొక పద్ధతి ద్వారా గానీ, ఒకటి కన్నా ఎక్కువ పద్ధతుల ద్వారా గానీ, అన్ని పద్ధతులను కలిపి గానీ ఆచరించండి. ముక్తి పొందండి. మతాలలోని సారాంశమంతా ఇదే. మతబోధనలు, నమ్మకాలు, పూజాపురస్కారాలు, మతగ్రంథాలు, దేవాలయాలు, దేవుళ్ళ రూపాలు - ఇవి ఎన్ని అయినా ఉండవచ్చు, కానీ అవి ముఖ్యమైనవి కావు.

2. మన మహిళలు

6. వేదాలలోనూ, ఉపనిషత్తులలోనూ స్త్రీలు అత్యున్నత సత్యాలను బోధించి, పురుషులతో సమానమైన గౌరవాన్ని అందుకున్నారు.

7. మహిళల స్థితిగతులను మెరుగుపరచకుండా ప్రపంచ సంక్షేమానికి ఎటువంటి ఆస్కారం లేదు. పక్షికి ఒక రెక్కతో ఎగరడం సాధ్యం కాదు కదా!

8. మన స్త్రీలు విద్యతో పాటు శూరత్వాన్ని, ధీరత్వాన్ని కూడా అలవరచుకోవాలి. ఈ రోజున, వారికి ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలో నేర్చుకోవలసిన అవసరం కూడా ఉంది. ఝాన్సీరాణి ఎంత గొప్పదో చూశారా!

9. ఏ కుటుంబాలలో స్త్రీలు సంతోషంగా ఉండి, చక్కగా గౌరవించబడతారో అటువంటి కుటుంబాలను దేవతలు దీవిస్తారు. కుమారులను ఎంత శ్రద్ధగా, జాగ్రత్తగా పెంచి చదివిస్తామో, కుమార్తెలను కూడా అంతే శ్రద్ధతో, జాగ్రత్తతో పెంచి చదివించాలి.

10. సంపూర్ణమైన ఓరిమితో, అన్ని బాధలను భరించే శక్తితో అలరారిన సీతాదేవి పవిత్రతకే పవిత్రురాలు. అమితమైన సహనంతో, చెరగని ధైర్యంతో, ఏ మాత్రమూ విసుక్కోకుండా, ఆమె ఒక దుఃఖమయ జీవితాన్ని భరించింది. సర్వదా సత్-శీలంతో, పవిత్రతతో ఉన్న అటువంటి భార్యామణి మానవజాతికే ఆదర్శం, దేవతలకే ఆదర్శం. అటువంటి మహత్తరమైన సీత మన జాతికి ఆరాధ్యదేవతగా ఎల్లకాలం నిలచి ఉండవలసిందే.

3. ఆత్మ విశ్వాసం

11. మన దేశానికి ధీరులు అవసరం. మీరు ధీరులుగా తయారవ్వండి! పనిచేస్తూ పోవడం వరకే మీ బాధ్యత - మిగిలినవన్నీ వాటంతట అవే అనుసరించి వస్తాయి.

12. ఓ మిత్రమా! ఎందుకు ఏడుస్తున్నావు? శక్తి అంతా నీలోనే ఉంది. ఓ ఆత్మరూపుడా! నీ దివ్యస్వరూపాన్ని గుర్తుచేసుకో! ఈ మూడులోకాలూ నీ పాదాల ముంగిట సాగిలపడతాయి. ఎల్లప్పుడూ నిలచి ప్రకాశించేది ఆత్మ ఒక్కటే కానీ జడపదార్థం కాదు.

13. మనుష్యులు! మనుష్యులు! మనకు కావలసింది మనుష్యులు! మిగిలినవన్నీ వాటంతట అవే సిద్ధమవుతాయి. కానీ బలవంతులు, తేజస్సంపన్నులు, ఆత్మవిశ్వాసం కలిగిన యువజనులు, నిలువెల్లా నిజాయితీతో నిండినవారు – మనకు కావాలి. ఇటువంటివారు ఒక వందమంది ఉంటే చాలు, ఈ ప్రపంచాన్ని తల్లక్రిందులు చేయవచ్చు.

14. విశ్వాసం! విశ్వాసం! రగిలే విశ్వాసం! మనమీద మనకే విశ్వాసం, దేవుని మీద విశ్వాసం! – ఇదే గొప్పతనంలోని రహస్యం. మీ పురాణాలు వర్ణించిన ముప్ఫైమూడు కోట్లమంది దేవతల మీద మీకు విశ్వాసం ఉన్నా, అప్పుడప్పుడూ విదేశీయులు మీ మధ్యలోకి చొప్పించిన దేవతలందరి మీద కూడా మీకు విశ్వాసం ఉన్నా, మీమీదనే మీకు విశ్వాసం లేకపోతే, మీకు మోక్షం లేదు.

15. ఇప్పుడు మనకు కావలసింది – ఇనుప కండరాలు, ఉక్కు నరాలు! ఇప్పటికి చాలాకాలంగా శోకాలు పెడుతున్నాం. ఈ ఏడుపులు ఇక చాలించి, మీ కాళ్ళమీద మీరు నిలబడి, మనుష్యులుగా మెలగండి. మనుష్యుల్ని తయారుచేసే మతం మనకిప్పుడు కావాలి. మనుష్యుల్ని తయారుచేసే సిద్ధాంతాలు మనకిప్పుడు కావాలి. బహుముఖ ప్రజ్ఞాశాలులైన మనుష్యుల్ని తయారుచేసే విద్య మనకిప్పుడు కావాలి.

16. మనం తినే ఆహారం, మనం నేర్చే విద్య, మన ఆలోచనలు – మనల్ని మరింత బలవంతుల్ని చెయ్యాలి. ఏదైతే మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలహీనపరుస్తుందో దాన్ని విషంలాగా విసర్జించండి.

4. బలం, నిర్భయత్వం

17. ఈ ప్రపంచం ఒక గొప్ప వ్యాయామశాల. మనల్ని మరింత బలవంతులుగా తీర్చిదిద్దుకోవడానికే ఈ ప్రపంచంలోకి వచ్చాం!

18. బలమే జీవనం! బలహీనతయే మరణం! బలం సంక్షేమాన్ని, అంతమే లేని జీవితాన్ని, అమరత్వాన్ని ఇస్తుంది. బలహీనత అంతులేని శ్రమను, దుఃఖాన్ని కలిగిస్తుంది. బలహీనతయే మరణం.

19. మీరు ఎలా ఆలోచిస్తే అలా తయారవుతారు. మిమ్మల్ని మీరు బలహీనులుగా ఊహించుకుంటే బలహీనులుగా తయారవుతారు. మిమ్మల్ని మీరు బలవంతులుగా భావించుకుంటే, బలవంతులుగా తయారవుతారు.

20. బలహీనతకు విరుగుడు కావాలంటే బలాన్ని గురించి ఆలోచించాలి. బలహీనతను గురించే దీర్ఘాలోచన చెయ్యడం వల్ల బలహీనత పోదు. కాబట్టి ఎల్లప్పుడూ బలాన్ని గురించే ఆలోచించండి! మనుష్యులకు వారిలోనే దాగివున్న శక్తిని గురించి బోధించండి.

21. నిలద్రొక్కుకున్నా, మరణించినా మీ బలం మీదనే ఆధారపడండి. ప్రపంచంలో పాపమనేది ఉంటే అది బలహీనతేగానీ మరొకటి కాదు. అన్నిరకాల బలహీనతల్ని వదిలిపెట్టండి. ఎందుకంటే బలహీనతయే పాపం. బలహీనతయే మరణం.

22. లేచి, బాధ్యతను మీ భుజాలకెత్తుకుని, ఉత్సాహంతో వదలకుండా పని చెయ్యండి! ఈ జీవితం నీటి బుడగ లాంటిది. పుట్టిన ప్రతి జీవీ చావక తప్పదు. మనుష్యులుగా పుట్టినందుకు, మరణించే లోపల ఏదో ఒకటి సాధించి, ఈ ప్రపంచం మీద మీదైన ఒక చెరగని ముద్రను వెయ్యండి. లేకపోతే మీకూ, ఆ చెట్టుచేమలు, రాయిరప్పలకూ మధ్య తేడా ఏముంటుంది?

23. దేన్ని చూసైనా సరే భయపడవద్దు! మీరు అద్భుతమైన పనులు సాధిస్తారు! భయపడిన మరుక్షణం, మీరు ఎందుకూ కొరగానివారయిపోతారు. ఈ ప్రపంచంలో దుఃఖాన్ని కలిగించే ఒకేవొక్క గొప్ప కారణం భయమే. భయమే అన్నిటికన్నా పెద్ద మూఢనమ్మకం. మన కష్టాలకు కారణం భయం. నిర్భయత్వం క్షణాలమీద మనకు స్వేచ్ఛను తెచ్చిపెడుతుంది. కాబట్టి, "లెండి! మేల్కోండి! గమ్యాన్ని చేరుకునే వరకూ ఆగకండి!"

24. ధీరులైనవారే ఈ భూమిని ఏలగలిగేవారు. ఇది తిరుగులేని సత్యం. ధీరులై ఉండండి! ఎల్లప్పుడూ, "నాకెటువంటి భయమూ లేదు" అని పలకండి! "భయపడకు!" అని ప్రతి ఒక్కరికీ చెప్పండి. భయమే మరణం, భయమే పాపం, భయమే నరకం, భయమే అధర్మం, భయమే తప్పుడు జీవితం. ఈ ప్రపంచంలోని వ్యతిరేకపు (నెగెటివ్) ఆలోచనలు, అపోహలు అన్నీ ఈ భయమనే దుష్టశక్తి ద్వారా పుట్టినవే.

25. భారతదేశం ప్రపంచానికి నేర్పించవలసిన గొప్ప సత్యం ఒకటి ఉంది. అదే ఆధ్యాత్మికత. ఎందుకంటే అది మరొకచోట లేదు. మన దేశంలో మాత్రమే ఉంది. ఆత్మను గురించి చెప్పే శాస్త్రం ఇదే! ఒక మనిషి నిలబడి పనిచేసేలా చెయ్యగలిగేది ఏది? బలం! మంచితనమే బలం. పాపమే బలహీనత. అజ్ఞానపు రాశుల్ని చెల్లాచెదరుచేసే ఫిరంగి గుండులాగా, ఉపనిషత్తుల నుంచి వెలువడే ఒకేవొక్కమాట ఏమిటంటే నిర్భయత్వమే! (నిర్భయత్వం అంటే భయం లేకుండా ఉండడం – ఫియర్‌లెస్‌నెస్). మనం నిజంగా నేర్పించవలసిన మతధర్మం ఈ నిర్భయత్వమే. భయమే దుఃఖాల్ని కొనితెస్తుంది. భయమే మరణాన్ని కొనితెస్తుంది. భయమే దుష్టస్వభావాన్ని పుట్టిస్తుంది. మరి ఈ భయాన్ని కలగచేసే కారణం ఏమిటి? మన నిజస్వభావమేమిటో మనకు తెలియకపోవడమే.

5. నిజమైన విద్య

26. విద్యలోని సారమంతా ఏకాగ్రతే. ఏకాగ్రత లేకుండా మనం ఏమీ సాధించలేం. సాధారణ మానవుడు తన ఆలోచనాశక్తిలో తొంభై శాతాన్ని వృథా చేస్తున్నాడు. అందుచేతనే నిరంతరం తప్పులు చేస్తూ ఉంటాడు. మనస్సును స్వాధీనం చేసుకోవడాన్ని చక్కగా నేర్చుకున్న మానవుడు ఎప్పుడూ తప్పు చేయడు.

27. మనుష్యులకూ, జంతువులకూ మధ్యనున్న తేడా ఇదే. ఏకాగ్రతాశక్తి మనుష్యులకు ఎక్కువగానూ, జంతువులకు తక్కువగానూ ఉంటుంది. ఒక మనిషికీ, వేరొక మనిషికీ మధ్య భేదాన్ని కలిగించేది కూడా ఈ ఏకాగ్రతా శక్తిలోని తేడాయే. ఒక అల్పుణ్ణి, ఒక గొప్పవాడితో పోల్చండి! వారి మధ్య నిజంగా భేదాన్ని కలిగించేది వారి ఏకాగ్రతలలో ఉన్న తేడాయే.

28. కఠినమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించడం ద్వారా కొద్దికాలంలోనే

అన్ని విద్యలలోనూ ప్రావీణ్యత సాధించవచ్చు. అటువంటి బ్రహ్మచర్యాన్ని అవలంబించిన వాడు ఏ విషయాన్ని అయినా ఒక్కసారి విన్నా, తెలుసుకున్నా చాలు – ఎన్నటికీ మర్చిపోనటువంటి అద్భుతమైన మేధస్సును పొందుతాడు. ఈ బ్రహ్మచర్యాన్ని నిర్లక్ష్యం చెయ్యడంవల్లనే మనదేశంలో అన్నీ వినాశపు అంచులకు చేరుకున్నాయి.

29. ప్రపంచంలోని విజ్ఞానమంతా ఏ విధంగా సంపాదించబడింది? మానసిక శక్తులను కూడగట్టి, "ఏకాగ్రం" చెయ్యడం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడింది. మనం గట్టిగా తట్టగలిగితే ఈ సృష్టి దాని రహస్యాలన్నింటినీ ఇచ్చి వెయ్యడానికి సిద్ధంగా ఉంది. దానికి అవసరమైన దెబ్బను ఎలా వెయ్యాలో మనకి తెలిస్తే చాలు. "ఏకాగ్రత" ద్వారా ఆ దెబ్బ వెయ్యడానికి కావలసిన బలము, శక్తి వస్తాయి. మానవ మేధాశక్తికి అంతులేదు. అది ఎంత ఏకాగ్రమైతే, అంత శక్తి ఒకే విషయం మీద కేంద్రీకరించబడుతుంది. అదే ఏకాగ్రతలోని రహస్యం.

6. మంచి శీలం

30. ఎవరికీ, "నీవు చెడ్డవాడివి!" అని చెప్పవద్దు. "నీవు మంచివాడివే, కానీ నీలోని మంచిని ఇంకా పెంచుకో!" అని మాత్రమే చెప్పండి.

31. ధనంవల్ల, పేరుప్రతిష్టలవల్ల, విద్యవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మంచిశీలం మాత్రమే దుస్సాధ్యమైన కష్టాల అడ్డుగోడల్ని పగులగొట్టుకుని ముందుకు చొచ్చుకుపోతుంది.

32. "సత్యం పలకడం" అనే వ్రతాన్ని ఆచరించండి. ఏ మనిషి ఆలోచనలో, మాటలో, పనిలో పరిపూర్ణంగా పన్నెండేళ్ళ పాటు సత్యానికి కట్టుబడి ఉంటాడో, ఆ మనిషి ఏదనుకుంటే అది జరుగుతుంది.

33. దురదృష్టవశాత్తూ, ఈ ప్రపంచంలో ఎక్కువశాతం మంది మనుష్యులు ఏ ఆదర్శమూ లేకుండా తమ చీకటి జీవితాలలో దేవులాడుతున్నారు. ఏదోవొక ఆదర్శాన్ని కలిగివున్న వ్యక్తి వెయ్యి పొరపాట్లు చేస్తే, ఏ ఆదర్శమూ లేనివాడు యాభైవేల పొరపాట్లు చేస్తాడని నేను గట్టిగా నమ్ముతున్నాను. కాబట్టి, ఒక ఆదర్శాన్ని కలిగి వుండడం మంచిది.

34. ఒక మనిషి నడవడిక ఎటువంటిదో మీరు నిర్ణయించాలంటే, అతడు చేసిన గొప్పగొప్ప పనుల్ని చూడవద్దు. ఎంత అల్పుడైనా నలుగురూ తనను పొగుడుతున్నప్పుడు ఏదోవొక గొప్పపని చేసి, మహా ధీరుడిగా వెలిగిపోవచ్చు.

అటువంటి గొప్పపనులు ఆ మనిషి యొక్క నిజమైన వ్యక్తిత్వాన్ని సరిగ్గా అంచనా వెయ్యలేవు. అలాకాక అతడు ఒంటరిగా ఉన్నప్పుడు చేసే సర్వసాధారణమైన పనుల్ని చూడండి. ఆ పనులే నిజంగా ఒక గొప్పమనిషి యొక్క నిజమైన శీలాన్ని బయటపెడతాయి.

35. ఒక మనిషి నిరంతరం చెడుమాటలు వింటూ, చెడు ఆలోచనలు చేస్తూ ఉంటే అతని మనస్సంతా చెడు ముద్రలు పడిపోతాయి. ఆ ముద్రలు అతడి ఆలోచనలను, పనులను ప్రభావితం చేస్తాయి. వాటి చేతులలో అతడు కీలుబొమ్మగా మారతాడు. అవి అతడిచేత బలవంతంగా చెడు చేయిస్తాయి. అదే విధంగా ఒక మనిషి మంచి ఆలోచనలు, మంచి పనులు చేస్తూ ఉంటే వాటి ముద్రలు అతడిచేత బలవంతంగా మంచినే చేయిస్తాయి. అలా జరిగినప్పుడు ఆ వ్యక్తి యొక్క సత్–శీలం సుస్థిరమైనదని చెప్పబడుతుంది.

36. మీరు శక్తిహీనులనీ, మీకు ఎవరూ సహాయపడడం లేదనీ భావించవద్దు. మీకు కావలసిన శక్తి అంతా మీలోనే ఉంది. మీకు అవసరమైన సహాయం కూడా మీలోనే ఉంది. కాబట్టి మీ భవితను మీరే నిర్మించుకోండి... ఉజ్జ్వలమైన భవిష్యత్తు మీ ముందు ఉంది. మీరు పలికే ప్రతి మాట, ఆలోచించే ప్రతి ఆలోచన, చేసే ప్రతి పని ముఖ్యమైనవే. అవే పాపపుణ్యాలుగా పేరుకుంటాయని, మీరు ఎల్లప్పుడూ తప్పక గుర్తుంచుకోవాలి. ఎలాగైతే మీ చెడ్డ ఆలోచనలు, చెడ్డపనులు పెద్దపులులలాగా మీమీదకే దూకడానికి సిద్ధంగా ఉన్నాయో, అదే విధంగా మంచి ఆలోచనలు, మంచి పనులు లక్ష దేవతల శక్తితో మిమ్మల్ని ప్రతిసారీ, ఎల్లకాలం రక్షించడానికి సిద్ధంగా ఉంటాయి.

7. భారతదేశం - మన జన్మభూమి

37. భారతదేశపు జాతీయ ఆదర్శాలు త్యాగము, సేవ. ఈ జాతీయ ఆదర్శాలను ఉద్ధృతంగా ప్రచారం చెయ్యండి. అప్పుడు మన దేశంలోని సమస్యలన్నీ వాటికవే తీరిపోతాయి.

38. సోదరులారా! మనమందరం కలసి, కష్టించి పని చేద్దాం రండి! ఇది నిద్రపోయేందుకు సమయం కాదు. "భవిష్యత్తులో భారతదేశం ఎలా తయారవుతుంది?" అనే విషయం ఇప్పుడు మనం చేసే పని మీద ఆధార పడుతుంది. భారతమాత మన కోసం ఎదురుచూస్తోంది. లేచి, మేల్కొని, మన భారతమాత తన అమర సింహాసనం మీద క్రొత్త జీవంతో ఇంతకు ముందు

ఎన్నడూ లేనంత తేజస్సుతో ఆసీనురాలై ఎలా వెలుగొందుతున్నదో చూడండి!

39. నవీన భారతదేశాన్ని బయటకు రానివ్వండి! నాగలిచేతబట్టిన సన్నకారు రైతుల కుటీరాలలోంచి, చేపలు పట్టేవారి గుడిసెలలోంచి, చెప్పులు కుట్టేవారి పాకలలోంచి, వీధులూడ్చేవారి గుడిసెలలోంచి క్రొత్త భారతదేశాన్ని బయటకు రానివ్వండి! కర్మాగారాలలో నుంచి, సంతలలో నుంచి, బజార్లలో నుంచి ఆమెను బయటకు రానివ్వండి! అడవులలోనుంచి, వనాలలో నుంచి, కొండకోనలలో నుంచి, పర్వతాలలో నుంచి ఆమెను బయటకు రానివ్వండి!

40. మన ముందున్న మహత్కార్యం భారతజాతి పునరుద్ధరణ. దీనిని సాధించడం కోసం శ్రద్ధ, ఆత్మ విశ్వాసం అత్యవసరం. ప్రతిదాన్నీ నవ్వులాటగా చూసే మనస్తత్త్వం, గంభీరత లేకపోవడం (ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోకపోవడం) అనే జబ్బులు మన జాతి నరనరాల్లో జీర్ణించుకుపోయాయి. ఈ వ్యాధుల్ని మనం వదిలించుకోవాలి. బలవంతులై ఉండి శ్రద్ధను కలిగి ఉంటే, అంతా మంచే జరుగుతుంది.

41. ఓ భారతదేశమా! నీ స్త్రీజాతికి ఆదర్శం సీత, సావిత్రి, దమయంతి అని మరచిపోవద్దు. నీవు ఆరాధించే దేవుడు యతులకే యతీశ్వరుడు, సర్వసంగపరిత్యాగి, ఉమాపతి అయిన శంకరుడని మరచిపోవద్దు. నీ వివాహం, నీ సంపద, నీ జీవితం ఇంద్రియ సుఖాలకోసం కాదని, నీవొక్కడివే సుఖపడడం కోసం కాదని మరచిపోవద్దు. భారతజనని యొక్క బలిపీఠం మీద అర్పించబడేందుకే నీవు జన్మించావని మరచిపోవద్దు. బడుగువర్గాలు, అజ్ఞానులు, పేదలు, నిరక్షరాస్యులు, చెప్పులు కుట్టేవారు, వీధులూడ్చేవారు – వీళ్ళంతా – నీ రక్తమాంసాలని, నీ తోబుట్టువులని మరచిపోవద్దు.

42. ఓ నా దేశజనులారా! మన ఈ జాతీయనౌక యుగాల తరబడి అశేష మానవాళిని మోసుకుపోతూ, లెక్కకు అందని తన నిధులతో ప్రపంచం మొత్తాన్ని సుసంపన్నం చేస్తూ వచ్చింది. జాజ్జ్వల్యమానమైన మన ఈ జాతీయనౌక, శతాబ్దాల తరబడి, అన్ని దుఃఖాలకూ అతీతంగా లక్షలాదిమందిని ఈ జీవితసాగరాన్ని దాటించి, ఆవలి ఒడ్డుకు చేరుస్తున్నది. కానీ, ఈ రోజు, అది చిల్లులుపడి, దెబ్బతింది. అది మీ తప్పువల్లనే కావచ్చు, లేక ఏ కారణం వల్లనైనా కావచ్చు. అది కాదు ముఖ్యం! ఇప్పుడు ఆ నౌకలో ఎక్కి ప్రయాణిస్తున్న మీరు ఏమి చేస్తారు! ఆ నౌకనే తిట్టుకుంటూ, మీలో మీరు తగవులాడుకుంటూ కూర్చుంటారా? మీరందరూ కలసికట్టుగా, మీ శక్తికొద్దీ ప్రయత్నించి ఆ చిల్లుల్ని

మూసివెయ్యరా? ఈ పని చెయ్యడానికి మనమందరం సంతోషంగా మన గుండెల్ని పిండి రక్తాన్ని ధారపోద్దాం రండి! మనం ఆ ప్రయత్నంలో ఓడిపోతే, కలిసి మునిగి మరణిద్దాం! అయితే ఈ ప్రయత్నంలో మన నోటిలోనుంచి ఆశీర్వచనాలనే కానీ శాపాలను రానివ్వవద్దు!

8. భారత యువజనులారా! లేవండి!

43. "ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత!" లేవండి! మేలుకోండి! మీ గమ్యాన్ని చేరుకునే వరకూ ఆగకండి!

44. లక్షలాదిమంది ప్రజలు ఆకలితో, అజ్ఞానంతో జీవిస్తున్నంతకాలం, వారి కష్టార్జితంతో విద్యనేర్చి, వారి గోడు కొంచెమైనా పట్టించుకోని ప్రతి ఒక్కణ్ణీ నేను దేశద్రోహి అని అంటాను.

45. యువకులారా! మీకు కావలసింది ఇనుపకండరాలు, ఉక్కునరాలతో తయారైన శరీరం. అటువంటి శరీరంలో పిడుగులాంటి పదార్థంతో తయారైన మనస్సు ఉండాలి. బలము, పౌరుషము, క్షాత్రవీర్యం కలగలసిన బ్రహ్మతేజం నాకు కావాలి.

46. ఆధునికతరం మీద, యువతరం మీదనే నా విశ్వాసం. వారిలో నుండే నా కార్యకర్తలు వస్తారు. వాళ్ళు మన దేశసమస్యలను అన్నిటినీ సింహాలలాగా చక్కదిద్దుతారు.

47. సత్యం, పవిత్రత, నిస్వార్థత – ఇవి ఏ వ్యక్తిలో లేదా ఏ సమాజంలో ఉన్నాయో, ఆ వ్యక్తిని లేదా ఆ సమాజాన్ని అణచివేసే శక్తి ఈ భూమ్యాకాశాలలో ఎక్కడా లేదు. వీటినే ఆయుధాలుగా చేసుకొన్నవాడు ఈ విశ్వమంతా ఒక్కటై తనపై కత్తిగట్టినా ఎదుర్కోగలుగుతాడు.

48. ఒక లక్షమంది యువతీయువకులు, పవిత్రమైన భక్తితో జ్వలిస్తూ, భగవంతుని మీద తమకున్న అమితమైన విశ్వాసాన్నే రక్షణకవచంగా ధరించి, పేదలు, పతితులు, అణగద్రొక్కబడినవారి మీద తమకున్న ఎనలేని కరుణచేత కొదమసింహాలకుండే ధైర్యాన్ని పొంది, దేశపు నలుమూలలకూ పోయి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సహాయం, సాంఘికాభివృద్ధి, సమానత్వాల మంగళప్రద శుభవార్తలను బోధిస్తారు.

49. వయసుమళ్ళి, బలహీనులైన వారు మాత్రమే తమ తలరాత గురించి మాట్లాడతారు. బలవంతులైన యువకులు జ్యోతిష్యం జోలికి పోరు... ఏ

నక్షత్రాలు వచ్చినా, పోయినా ఏమి హాని జరుగుతుంది? నా జీవితాన్ని ఒక నక్షత్రం తారుమారు చెయ్యగలిగితే అటువంటి జీవితం ఒక పైసా విలువ చెయ్యదు. జ్యోతిష్యం, గ్రహదోషాలు మొదలైన విషయాలు శరీరం, మనస్సు బలహీనపడిన వారికి మాత్రమే నచ్చుతాయి. అటువంటి ఆలోచనలు మన మనస్సులలో ఎక్కువగా వస్తూ వుంటే, శరీరం బలం పుంజుకునేందుకు మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకుని, కొంత విశ్రాంతి తీసుకోవడం మేలు. శరీరం బలపడితే ఆ ఆలోచనలు వాటంతట అవే మనల్ని వదిలిపోతాయి.

50. ఇప్పుడు మనకు ధైర్యవంతులు, సాహసవంతులు అయిన యువకులు కావాలి. ఉత్తేజవంతమైన రక్తం, ఇనుప కండరాలు, ఉక్కునరాలు మనకు కావాలి. అంతేకానీ జావకారిపోయే పిచ్చిపిచ్చి ఆలోచనలు కాదు. మర్మాలను, రహస్యాలను విడిచిపెట్టండి. మన ఋషులు తాము కనిపెట్టిన గొప్ప వేదాంత సత్యాలను ప్రచారం చెయ్యడానికి ఎటువంటి కనికట్టు విద్యలను ఉపయోగించ లేదు కదా! కాబట్టి మతంలో ఎటువంటి తెలియరాని మర్మాలు, రహస్యాలు లేవు. ఏవేవో నిగూఢమైన విషయాల్ని, రహస్యాల్ని తెలుసుకోవాలని అనుకోవడం, పిచ్చిపిచ్చి నమ్మకాల్ని పెట్టుకోవడం బలహీనతకు గుర్తులు. అవి దిగజారుడుతనానికి, మరణానికి చిహ్నాలు. కాబట్టి జాగ్రత్తగా ఉండండి! మీ కాళ్ళమీదే నిలబడండి.

9. పనిచెయ్యడంలోని రహస్యం

51. ఒక గ్రాము ఆచరణ ఇరవైవేల టన్నుల ప్రగల్భాలకన్నా గొప్పది.

52. మనం ఈ జీవితంలో నేర్చుకోవలసిన గొప్ప పాఠం ఒకటి ఉంది. అది మనల్ని మనం మర్చిపోవడం. ఎల్లప్పుడూ ఇతరులకు మంచిచెయ్యడానికి ప్రయత్నించండి. దీని ద్వారా మనల్ని మనం మర్చిపోతాం.

53. ఏ మనిషి అయినా, ఏ దేశం అయినా ఉన్నతస్థితిని చేరుకోవాలంటే ఈ మూడు గుణాలు అవసరం. అవి

1. మంచితనానికి ఉన్న శక్తి మీద అఖండమైన విశ్వాసం,

2. అసూయ, అనుమానం లేకుండా ఉండడం,

3. మంచితనంతో మెలుగుతూ, మంచిపనులు చెయ్యాలనుకునే వారందరికీ సహాయం చెయ్యడం.

54. ప్రకృతి మనల్ని ప్రతీకారం తీర్చుకోమంటుంది. దెబ్బకు దెబ్బ

తియ్యమంటుంది. మోసానికి మోసం చెయ్యమంటుంది. అబద్ధానికి అబద్ధం చెప్పమంటుంది. మన శక్తికొద్దీ ఎదురుదెబ్బ కొట్టమంటుంది. కానీ ఎదురుతిరిగి కొట్టకుండా ఉండాలంటే, మనల్ని మనం స్వాధీనంలో ఉంచుకోవాలంటే, బంధాలలో పడకుండా ఉండాలంటే దేవుళ్ళకంటే ఎక్కువశక్తి కావాలి.

55. జయం సాధించాలంటే మీకు అమితమైన పట్టుదల, అమితమైన సంకల్పశక్తి కావాలి. పట్టుదల కలిగిన మనిషి, "నేను సముద్రాలను త్రాగివేస్తాను, నా సంకల్పశక్తితో కొండల్ని పిండికొట్టగలను" అంటాడు. అటువంటి శక్తిని, అటువంటి సంకల్పాన్ని కలిగివుండండి. కష్టపడి పనిచెయ్యండి. మీరు కోరుకున్న గమ్యాన్ని చేరుకుంటారు.

56. ఒకే ఆలోచనను లేదా పనిని చేపట్టండి. దానినే మీ జీవితంగా మలచుకోండి. దానినే తలపోయండి, దానినే కలగనండి, దానిమీదే జీవించండి. మీ మెదడు, కండరాలు, నరాలు, మీ శరీరంలోని ప్రతి అణువణువునూ అదే ఆలోచనతో నిండిపోనివ్వండి. దాన్ని తప్ప మిగిలిన ప్రతివొక్క ఆలోచనను విడిచిపెట్టండి. విజయానికి దారి ఇదే! ఈ పద్ధతి ద్వారానే గొప్పగొప్ప మహాత్ములు, సత్పురుషులు తయారయ్యారు. మిగిలినవాళ్ళందరూ వట్టి చిలకపలుకులు పలికే యంత్రాలే!

10. మానవుణ్ణే మాధవుడిగా సేవించండి!

57. ఎంతో తపస్సు చేసిన తర్వాత నేను దీన్ని నిజమైన సత్యంగా తెలుసుకున్నాను – ప్రతిజీవిలోనూ శివుడున్నాడు. ఇంతకన్నా వేరే దేవుడెవ్వడూ లేడు. "ఎవడు జీవారాధకుడో, వాడే దైవారాధకుడు!"

58. ఈ జీవితం క్షణికం! ఈ ప్రపంచంలో మన గొప్పలన్నీ మూణ్ణాళ్ళ ముచ్చట్లే! కానీ ఎవరైతే పరులకోసం జీవిస్తారో వాళ్ళే నిజంగా జీవిస్తున్నారు. మిగిలిన వాళ్ళు బ్రతికున్నా చచ్చినట్టే లెక్క!

59. పూజలన్నింటి సారాంశం ఇదే – మనం పవిత్రంగా ఉండడం, ఇతరులకు మంచి చెయ్యడం. ఎవడైతే పేదవాడిలో, బలహీనుడిలో, రోగిలో శివుణ్ణి చూడగలుగుతాడో అతడే నిజంగా శివుణ్ణి అర్చిస్తాడు. ఎవడైతే ఒక విగ్రహంలో మాత్రమే శివుణ్ణి చూస్తాడో, అతడి ఆరాధన ఇంకా ప్రాథమికమైనదే.

60. నేను నమ్మిన దేవుడు ఒకే ఒక్కడు. ఆ దేవుడే అన్ని ఆత్మల పూర్తి మొత్తం. అందరు దేవుళ్ళకంటే ఎక్కువగా, దుష్టులలో ఉన్న నా దేవుణ్ణి, బాధలలో

ఉన్న నా దేవుణ్ణి, అన్ని జాతులలోకీ పేద అయిన నా దేవుణ్ణి, నేను ప్రత్యేకంగా ఇష్టపడి ఆరాధించే నా దేవుణ్ణి సేవించడం కోసం నేను మళ్ళీమళ్ళీ జన్మిస్తాను గాక! ఎన్నివేల బాధలనయినా అనుభవిస్తాను గాక!

61. ఆత్మ ప్రతి మానవునిలోనూ ఉంది. ఆ ఆత్మ మాత్రమే మనం పూజించదగిన ఏకైక దైవం. ప్రతి జీవి యొక్క శరీరం ఒక దేవాలయమన్నది కూడా నిజమే. కానీ అన్ని జీవులలోనూ మానవుడు అత్యున్నతుడు. జీవులన్నీ దేవాలయాలయితే వాటిలో మానవుడు "తాజ్ మహల్" లాంటివాడు. అంత గొప్ప దేవాలయమైన మానవుడిలో ఉన్న దేవుణ్ణి పూజించలేకపోతే మిగిలిన ఏ దేవాలయంలో పూజ చేసినా దానివల్ల ఉపయోగం లేదు.

62. ఇతరులకోసం మనం ఏ కొద్దిపాటి పని చేసినా అది మనలోని శక్తిని మేల్కొల్పుతుంది. ఇతరులకు మంచి జరగాలని ఏ మాత్రం ఆలోచించినా అది క్రమంగా మన హృదయంలోకి ఒక సింహానికుండే శక్తిని నింపుతుంది. మిమ్మల్నందరినీ నేనెంతగానో ప్రేమిస్తున్నాను. కానీ మీరందరూ ఇతరుల కోసం శ్రమిస్తూ మరణించాలని నేను కోరుకుంటున్నాను – మీరు అలా చెయ్యడాన్ని చూడడమే నాకు ఇష్టం.

63. బహుజన హితాయ! మీరు మీ శరీరాన్ని, మనస్సుని, వాక్కుని ప్రపంచ సంక్షేమం కోసం ధారపొయ్యాలి. మీరు, "మాతృదేవో భవ, పితృదేవోభవ – తల్లిని దేవునిగా చూడండి! తండ్రిని దేవునిగా చూడండి!" అని చదువుకున్నారు. కానీ నేను చెప్పేదేమంటే, "దరిద్రదేవో భవ, మూర్ఖదేవో భవ – పేదల్ని, నిరక్షరాస్యుల్ని, అజ్ఞానుల్ని, రోగుల్ని మీ దేవుళ్ళుగా చేసుకోండి!" అని. వారికి సేవ చెయ్యడమే అత్యున్నతమైన మతధర్మమని తెలుసుకోండి.

11. నిజమైన మతం

64. నాయనలారా! మతం యొక్క రహస్యం ఆచరణలోనే ఉంది కానీ సిద్ధాంతాలలో లేదు. తాను మంచిగా ఉండడం, అందరికీ మంచిని చెయ్యడం – ఇదే మతమంతా!

65. మత ధర్మమనేది పుస్తకాలలో లేదు, సిద్ధాంతాలలో లేదు, మత విశ్వాసాలలో లేదు, ఉపన్యాసాలలో లేదు – చివరకు వాదనలోనూ, తర్కంలోనూ కూడా లేదు. అది ఆచరించడంలోనూ, అనుభూతి చెందడంలోనూ ఉంది.

66. షికాగో విశ్వమత మహాసభ ఒక విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ఆధ్యాత్మికత, పవిత్రత, దాతృత్వం అనేవి ఏదోవొక మతం యొక్క సొత్తులు కావనీ, ప్రతి మతవ్యవస్థలోనూ అత్యున్నత శీలం కలిగిన స్త్రీపురుషులు ఉద్భవించారనీ ఈ మహాసభ ప్రపంచానికి నిరూపించింది. ఈ ఋజువును చూసిన తర్వాత కూడా తన మతమే వర్ధిల్లాలనీ, మిగిలిన మతాలు నాశనమవ్వాలనీ ఎవరైనా కలలుగంటే, వారిని చూసి నా హృదయపులోతులనుంచి జాలిపడతాను. ఎంత వ్యతిరేకత ఎదురైనా త్వరలోనే అన్ని మతాల తోరణాల మీద, "స్నేహమేగానీ శత్రుత్వం కాదు", "కలుపుకోవడమే కానీ నాశనం చెయ్యటం కాదు", "సమన్వయం, శాంతియే కానీ విడిపోవడం కాదు" అని వ్రాయబడుతుంది.

12. ధ్యానం

67. ఏదోవొక వస్తువు (విషయం) మీద మనస్సును లగ్నం చెయ్యడమే ధ్యానం. మొట్టమొదటగా ఈ విధంగా లగ్నం చేయడాన్ని మీ మనస్సుకు నేర్పండి. తరువాత దానిని ఏ విషయం మీద కావాలంటే ఆ విషయం మీద ఏకాగ్రం చెయ్యవచ్చు.

68. అనంతమైన ఆనందం ఒకటుంది. ఆ ఆనందం ఎంత అనుభవించినా తరగదు. ధ్యానం దాని తలుపుల్ని తెరిచి ఆ ఆనందాన్ని మనకు చూపిస్తుంది. ప్రార్థనలు, పూజలు, మిగిలిన అన్నిరకాల పూజావిధానాలు ఈ ధ్యానంలో ఒకటవ తరగతిలాంటివి.

వివేకానంద గర్జన

1. లెండు! మేల్కొనుడు! పరమపద ప్రాప్తి పర్యంతమూ ఆగకుడు!

2. పరహితార్థము ఒక్క జీవితమునర్పింపజాలరా? వేదాంత శ్రవణము, ధ్యానాది సాధనలు మున్నగువానిని ముందు జన్మమునకు విడిచిపెట్టుడు! లోకసేవకై ఈ శరీరము నాహుతి యొనర్పుడు!

3. జాతీయ రక్తనాళములలో ఇతోధిక శక్తిని ఉజ్జీవింపజేయగల ఒక నూతన విద్యుత్తేజమే భారతదేశమునకిపుడు ఆవశ్యకమైయున్నది. అఖండశక్తి, అఖండ ఉత్సాహము, అఖండ ధైర్యము, అఖండ శాంతత – ఇవియే మనకు ఆవశ్యకములు.

4. "ఓ దీనులారా! ఓ దరిద్రులారా! ఓ అధఃపతిత సోదరులారా! రండు. మనమందరమూ ఆ రామకృష్ణుని బిడ్డలము!" అని యెలుగెత్తి చాటుచు, జనులలో ఐకమత్య మొనగూర్చుటకై అస్పృశ్యతావరణము నూడబెరికివేయు సుదినమెపుడు ప్రాప్తించునో గదా! అస్పృశ్యుల నుద్ధరింపనిదే మన భారతాంబ మేల్కొనదు.

5. ఎవడు జీవారాధకుడో వాడే దైవారాధకుడు... సమస్త జీవస్వరూపుని, అద్వితీయుని, విశేషము నా యార్తనారాయణుని, నా దీననారాయణుని, సమస్త దేశీయులకెల్ల పేదయగు నా భారత నారాయణుని, నా ఇష్టదేవతను అర్చించుటకై ఎన్ని జన్మలైననూ ఎత్తెదను గాక! ఎన్ని వేల బాధలనైననూ అనుభవింతును గాక!...

6. లెండు! మీ మానవత్వమును ప్రకటింపుడు. మీ కూపములనుండి వెలువడి బాహాటముగా నలువైపులనూ తిలకింపుడు. ప్రపంచమందలి వివిధ జాతులెట్లు ముందంజ వేయుచున్నవో చూడుడు! సోదరమానవుని మీరు ప్రేమింతురా? స్వదేశమును మీరు ప్రేమింతురా? ప్రేమించుచో రండు! ఉన్నత పరిస్థితులకై, యోగ్యతర స్థితిగతులకై నడుము కట్టుదము. వెనుకకు చూడకుడు.

7. జగద్రహస్యములను, మర్మములను భేదించు శక్తి కలిగి, ఆ ఉద్యమమును సాధించుటకై సముద్ర గర్భాంతరాళములోనికి జొచ్చి, మృత్యువును ముఖాముఖీ ఎదుర్కొనవలసి వచ్చినను వెరువని, అచంచలులై, గాఢదీక్షగల అప్రతిహత–మహత్తర–సంకల్ప సంపన్నులు, ఇనుప కండరములు, ఉక్కు నరములు కలవారు కావలసియున్నారు.

8. "అన్నమో రామచంద్రా!' యని విలపించు నార్తులకు మతబోధ లెందులకు?" అని శ్రీరామకృష్ణులు వచింపలేదా? భారతజన సామాన్యము కేవలము పశుప్రాయమై జీవించుటకు కారణము అజ్ఞానము, అక్షరజ్ఞాన శూన్యత... జనసామాన్యము నుద్ధరింపని మనకు జాతీయత అనునది కలలోని మాట... కానీ ఈ దోషమును సనాతనధర్మమున కంటగట్టుట తగదు. ఇయ్యది మన దోషము.

9. హనుమన్మహావీరుడే మీకు ఆదర్శపురుషుడు. జితేంద్రియ చక్రవర్తియు, అద్వితీయ ధీశాలియు అగునాతడు రామనామమందలి అఖండభక్తితో ప్రాణభీతిని విడనాడి ఒక్క దుముకులో సాగరము నెట్లు లంఘించెనో చూడుడు.

అతడెట్టి భగవత్సేవకుడో, ఆదర్శమూర్తియో! తన అఖండ బాహుబలముచే, అద్వితీయ పరాక్రమముచే రావణుని రాక్షస సైన్యములను హాహాకారమెత్తింప గలిగిన మహావీరుడాతడు. మరియొకవైపున రామపదపంకజార్చకులలో అద్వితీయుడాతడే. అట్టి నిశ్చంచల భక్తియే దేశమున కిపుడు ఆవశ్యకము.

10. మానవుడు మాధవునకు పెట్టిన ఉత్కృష్టనామము సత్యము. సత్యముపై నిలచితివా దేవుని పొందెదవు. సత్యమునకై సర్వము త్యజించుము. కానీ సత్యమును దేనికొరకైనను త్యజించకుము. సత్యవ్యాప్తికై కొంత అసత్యపు పైపూత అవసరమని తలచువాడు పొరబడుచున్నాడు. విషపుచుక్క ఒక్కటైనను కాలక్రమమున సర్వమును విషముగా మార్చును. అసత్యము ఏదియైనను జాగ్రత్త సుమా! సత్యమున కంటిపెట్టుకొంటిమా జయించి తీరుదము. మోసము, కౌటిల్యము, దుష్టత్వము పనికిరావు.

11. ఎచ్చటెచ్చట మహామారి క్షామము వెలువడునో, ఎచ్చటెచ్చట ప్రజలు దురవస్థలపాలగుచున్నారో, ఆయా చోట్లకు మీరందరును పొండు! వారి వ్యథలను ఉపశమింపుడు... ఒక ఉత్తమాదర్శమునకై జీవించుచు, దానికై మృతినొందుట శ్రేయస్కరము. ఈ ఆదర్శమును ఇంటింటను, వాడవాడలను బోధింపుడు. దానిచే మీకు మీరే ఉపకారమొనర్చుకొనిన వారగుచున్నారు. ఈ దేశాభ్యుదయపు ఆశలన్నియు మీ మీదనే ఆధారపడియున్నవి. కార్యారంభులు కండు. కార్యదీక్షబూనుడు. లెండు! మేల్కొనుడు. గమ్యమును చేరువరకు నిలువకుడు.

12. వలయునది పురుషకారమని గ్రహింపుడు. పురుషకార విహీనునకు పరమేశ్వరానుగ్రహము లభించుట కల్ల! మహావీరుడగు అర్జునుడు తన పౌరుషమును కోల్పోవనున్న సమయమున శ్రీకృష్ణుడాతనికి నిస్సంగబుద్ధితో స్వధర్మము ననుష్ఠింపుమని యాదేశించి, నిష్కామకర్మాచరణము వలన చిత్తశుద్ధియు, కర్మపరిత్యాగఫలమును, భగవదేకార్పితబుద్ధియు సిద్ధించునని ఉపదేశించెను. కావున యువకులారా! ధీరులై బలము నార్జింపుడు. దుర్జనుడైనను బలోపేతుడే నాకు మాన్యుడు. ఏలన వాడు తన బలముచే దౌర్జన్యమును, స్వార్థపరతను విడనాడి తత్త్వసందర్శనము చేయు దినము వచ్చి తీరును.

13. హే! భారత జననీ! నీ సతీత్వాదర్శము సీత – సావిత్రి – దమయంతి అనుమాట మరవకుము. సర్వసంగ పరిత్యాగియు, యతీశ్వరుడునగు శంకరుడు

– ఉమాపతి – నీకు ఆరాధ్యుడను మాట మరవకుము. నీ ఐశ్వర్యమునకు, నీ వివాహమునకు, నీ జీవితమునకు పరమార్థము తుచ్ఛ విషయసుఖము కాదనుమాట, వ్యక్తిగత భోగము కాదనుమాట మరవకుము. యజ్ఞనారాయణునకు ఆహుతియగు నిమిత్తము జన్మించితివనుమాట మరవకుము. నీ సాంఘిక వ్యవస్థ అనంత జగన్మాతృత్వమునకు ప్రతిబింబమను మాట మరవకుము. అస్పృశ్యులనబడు, అవాచ్యులనబడు నిమ్నజాతులు, దీనులు, దరిద్రులు, అజ్ఞానులు, నిరక్షరాస్యులు నీ తనూభవులను మాట మరవకుము.

14. ఓ వీరభారత పుత్రా! ధైర్యము వీడకుము. నేను భారతీయుడనని గర్వింపుము. "నేను భారతీయుడను! ప్రతి భారతీయుడు నా సహోదరుడు!" అని సగర్వముగా ప్రకటింపుము.

15. "భారతీయుడు నా సోదరుడు. నా ప్రాణములకు ప్రాణము, భారతీయ దేవతలే నా దైవతము, భారత సంఘము నా బాల్య డోలిక, యౌవన నందన వనము, వార్ధక వారణాసి."

16. సోదరా ఇట్లు చాటుము: "భారతభూమి నా మహోన్నత స్వర్గము, భారత శ్రేయమే నా శ్రేయము." అహర్నిశము ఇట్లు ప్రార్థింపుము: "ఓ మహేశ్వరా! ఓ లోకేశ్వరీ! నాకు పౌరుషమును ప్రసాదింపుడు, నాలోని దౌర్బల్యమును తొలగింపుడు, నన్ను ధీరుడ నొనర్పుడు!"

17. నానాటికీ విస్పష్టముగా నాకు గోచరించుచున్న విషయమిది. "సమస్తము ధైర్యసాహసములతో కూడుకొనియున్నది. ఇదియే నా నూతన సందేశము. దుష్కార్యములనైననూ, సరియే, ధీరుడవై నొనర్పుము! దుర్మార్గుడవగుట విధియైనచో అపరిమిత దుర్మార్గుడవు కమ్ము!"

18. అలసట చేతనో, అశక్తత చేతనో క్షమచూపుట కంటే పోరాడుటయే మంచిది. దేవతా సైన్యములను సైతము అవలీలగా జయింపగలుగు శక్తినార్జించి యుండి, క్షమచూపుము... ప్రపంచము ఒక యుద్ధరంగము. వీరుడవై ప్రతికూలురను జయింపుము... అప్రతికారము సన్న్యాసధర్మము, ఆత్మసంరక్షణము గృహస్థధర్మము.

✡ ✡ ✡ ✡ ✡

సూక్తి - పద్యరూపంలో వివేకానంద సూక్తులు

(ఈ క్రింది పద్యములను
శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు, బాపట్ల, రచించారు.)

మానవుడే మాధవుడు

1. జీవియందునున్న జీవాత్మ పరమాత్మ
కొలుచునెవడు వాని కోర్కెతోడ
ఆలయమ్ములగును అఖిలజీవులుజూడ
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

2. అఖిల జీవులందు అధికుడెవడన్నచో
మానవుండు కాడె మాధవుండు
తలప గుడులలోన తాజమహలు తాను
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

3. కంటికెదుట నుండి కన్పించుదైవమ్ము
మానవుండె యనుచు మరువరాదు
అన్యదైవమొరుని అరయంగ నేలరా?
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

4. పరులమేలు కొఱకు పాటు పడుటయున్న
మంచి మనసుతోడ మసలుటయును
చాటి చెప్ప పూజ సారాంశమిదియెరా
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

5. పరులకొరకు ఎవరు బ్రదుకుచుందురొ యెప్డు
వారేచచ్చి బ్రదుకు వారు భువిని
బ్రదికియుండి చచ్చు బాధితులన్యులు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!

6. పరులసేవలోన మరణింప వెనుదీక
చివరిదాక పోరి చితికినట్టి
త్యాగధనులు జూడ ధన్యజీవులెపుడు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

7. అన్యు లెవరు సేవ కర్హులు లేరంచు
గర్వపడక సేవ ఘనముగాను
దైవదత్తమంచు తలచి సేవించుడీ
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

8. పేదజూచి యెవడు పెట్టునో కన్నీరు
సొదలగనుచు బాధ ఎదను బొంది
మహిని వాడె యెపుడు మహితాత్ముడెన్నగా
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

9. పరచియున్న మనలొ పరమాత్మ నెరుగక
వెదుక నేల వేఱె వెట్టిగాక
బావి త్రవ్వనేల భాగీరథిని జేరి
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

10. ఇంత తెలిసికొంటి ఎంతయో తపియించి
జీవి సత్యముగను దేవుడనుచు
తగును జీవి సేవ దైవసేవయెయద్ది
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

భారత యువజనులారా! లేవండి!

11. ధైర్యసాహసముల దాల్చిన యువకులే
నేటి భారతాన మేటివారు
మూఢనమ్మకాల మునుగుట తగదయా
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

12. లెండు! మేలుకొండు! రండు యువకులార
మీరె చేయవలయు మేరలేని
దేశహితము కొఱకు దివ్యమౌత్యాగమ్ము
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

13. పదవి సుఖము వదలి పాటుపడగరండు
ప్రాణమైన చివర పణము పెట్టి
ప్రజలకు మేలు గూర్చు భవసాగరమునీద
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

14. ఆచరింపనొప్పు అనుకొన్న దానిని
మంటదూకియైన మడియుటకును
త్యాగులై కదులుడు ధైర్యాన యువకులు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

15. చచ్చువరకు పనిని సాధించుటే మేలు
నిత్యముందు నేను నెపుడు మీతొ
చావుపుట్టు కెపుడు సహజమ్ము ప్రాణికి
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

16. భాగ్యభోగ మెపుడు పదిలమ్ము కాదులే
మూడునాళ్ళ వరకె ముచ్చటదియు
పురుగు చావుకంటె పోరి చచ్చుట మేలు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

17. ఇనుప కండరాల నెన్ను నుక్కునరాల
బలముకల్గు వారి వలతు నేను
బ్రహ్మతేజములుకు పౌరుషమ్మును వలతు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

18. స్వార్థపరత లేమి, సత్యసంధతయును,
ఆత్మశుద్ధి, యెవని ఆయుధములొ
వెలగుచుండు నతడు విశ్వవిజేతయై
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

శీలాన్ని నిర్మించేదెలా!

19. పెద్ద విద్య, ధనము, పేరు ప్రతిష్ఠలు
పొందినంత మాత్ర ప్రోడకాడు
మంచి శీల మొకటె మార్గమ్ము కష్టాల
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

20. ఆచరించ తప్పు ఆదర్శవంతుడు
వెయ్యి తప్పిదముల వెట్టి చేయు
అనిశముండవలయు ఆదర్శ మొక్కటి!
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

21. అగ్నితప్తమైన ఆధ్యాత్మికమ్మున
తొలగు మనిషిలోని మలిన మెల్ల
ప్రకృతి సహజ మిదియు పరికింపనెప్పుడు
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

22. ధైర్యసాహసముల ధరణిపై నిల్చుండి
బరువు బాధ్యతలను నెరపుచుండి
తామె ధాతలంచు తలచుడీ తలరాత
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

23. మనదు జీవితాలు మంచిదారిలోనున్న
దేశమెల్ల నుండు దివ్యముగను
కనుక కల్తిలేని ఘనులు కావలయును
రామకృష్ణ శిష్య రమ్యసూక్తి!!

(ఈ క్రింది పద్యములను
శ్రీ చిరువోలు విజయ నరసింహారావుగారు, రాజమండ్రి, రచించారు.)

నమ్మకము - శక్తి

1. తమను తాము నమ్మెడువారి ధన్యచరిత
జగతి చరితయేయని చెప్ప సబబుగాదె
అట్టిగట్టి విశ్వాసమే తట్టిలేపు
అంతరాంతర దివ్యత్వ చింతపైకి

2. నమ్ము నమ్ముము నమ్ముమా నమ్మకమ్ము
నమ్ము దైవంబు నిరతమా నమ్మకమ్మె
మహిత శక్తి రహస్యంబు, మనుజులార!
నమ్మి జీవించుటే శుభదమ్ము మీకు

3. ఆత్మకునసాధ్యమనుమాట ననకు మీవు
ఇంతకన్న నేపాపమీ యిలను లేదు
పరులుగాని తానగుగాని బలములేని
వారమని యెంచనదియెంతొ పాపమగును

4.నీవు తలచిన దేదైన నీకుదక్కు
పరమ బలహీనుడీవన్న బలము తగ్గు
బలముగలవాడనని యెంచ బలము పెరుగు
నమ్మకమెయిచ్చు నీశక్తి నెమ్మి నీకు

5. లేదు, నావల్ల కాదను వాదమేల?
నీవనంతుడవయ్య యీ నిజము నరయు
నీదు ప్రకృతికి పోల్చగా నెట్టికాల
దేశములు కూడనల్పమౌ దీక్షబూన
ప్రతి పనిని చేయనోపుదు, ప్రభువు వీవె!

6. ప్రభుని సంతాన భాగ్యులై పరమపుణ్య
పూర్ణజీవులౌ నమృత సంభూతులకట!
భువిని దేవతలార! పాపులని మిమ్ము
పిలుచుటే యొక పాపంబు బిరుదమద్ది
మానవాళికి మాయని మచ్చ సుమ్ము!

7.సింగములు మీరు లేలెండు చింతవీడి
వెట్టి గొల్గెలనెడు మాయ విడుమువేగ
నిత్యశాశ్వతాత్ములు మీరు, నిరతతేజ
సత్యస్వేచ్ఛాయుత వివేక శాంతులౌర!

8. బలములేదని పలుమార్లు తలచుటద్ది
తనదు బలహీనతను బాప తగని మందు
తనకు శక్తియె గలదన్న తలపునిచ్చి
మనుజులకు బోధ చేయుడు తమకు మున్నె
శక్తి గలదన్న నిజమునాసక్తిబెంచి.

9. నీ వరసిచూడ నావాక్కు నిశ్చయమగు
ఉపనిషత్తుల దక్క నేనెపుడు చెప్ప
లేదు, వాని సారాంశమదేది యన్న
శక్తియని తెలియుడు మీరు సకలవేద
శాస్త్ర సారాంశసారమే "శక్తి" పదము

10. సాహసము చేయ సోదరా! సరగ రమ్మ
ముక్తి లభియింపకున్న పో, మునుగునెద్ది?
తిరిగితిరిగి పుట్టుకచావు జరిగి తీరు
పలుకు, పనుల, యోచనలందు ఫలమొకటిగ
పుణ్యమౌని పుంగవులెల్ల భువినిచాల
మేలొనర్చిరి, హృదయంబు మేలుకొలిపి
పరులనుద్ధరింపగబుట్టు గిరి సమాను
లిలనుగలరన్న సూక్తి నీవేల వినవు?

✡ ✡ ✡ ✡ ✡

శ్రీ శారదాదేవి బోధనలు

**(శ్రీ బి. యస్. ఆర్. ఆంజనేయులు గారిచే
పద్యరూపంలో రచించబడిన శ్రీ శారదాదేవి బోధనలు)**

1. ఏకులని వదిలివేసిన మేకులగును
మెదలకుండిన మొలకయె ముదిరిపోవు
తప్పు చిన్నదియైనను ముప్పుతెచ్చు
చిన్నపనులందె మానవుడెన్నబడును

2. శాంతి కోరెదవా తల్లి స్వాంతమందు
చూడు నీ తప్పు పరులది చూడవద్దు
అన్యులెవ్వరు లేరు నీకవని యందు
ఎల్లలోకము నీదె గావించు కొనుము

3. ఎట్టి చోటులకేగిన ఎట్టులున్న
ఎన్ని కష్టాలు కలిగిన ఏమియైన
ఎవ్వరేమన్న మరువకు మెప్పుడైన
కలదు నాకొక తల్లియను జ్ఞాపకంబు

✡ ✡ ✡ ✡ ✡

గీతి

లేవండోయ్! లేవండి! (పాటలు)

(శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు గారిచే
గేయాల రూపంలో రచించబడిన వివేకానంద సూక్తులు)

1. లేవండోయ్! లేవండి!

1. లేవండోయ్ లేవండి!
లేచి ముందుకు నడవండి!
నవ్య భారతము మేలుకాంచెను
నవీన భారతముద్భవించెను ॥లే॥

2. నాగలి పట్టెడు శాలల నుండి
బెస్తవారల గుడిసెల నుండి
చెప్పులు కుట్టు కుటీరము నుండి
వీధులూడ్చెడు పాకల నుండి
నవీన భారతముద్భవించెను ॥లే॥

3. కమ్మరవారి కొలుముల నుండి
చిల్లరవస్తు దుకాణము నుండి
సంతల నుండి బజార్లనుండి
కర్మాగారపు దారుల నుండి
నవీన భారతముద్భవించెను ॥లే॥

4. అడవుల నుండి, వనముల నుండి
కొండకోనల, గుట్టల నుండి
నెట్టుకు ముందుకు రానీయండి!
బిరబిర ఉరుకుచు రానీయండి!
నవీన భారతముద్భవించెను ॥లే॥

2. తేవాలీ! తేవాలీ! జ్ఞానజ్యోతినీ తేవాలీ!

1. తేవాలీ, తేవాలీ,
జ్ఞానజ్యోతినీ తేవాలీ
ప్రతి ఒక్కరును పరమేశ్వరుని
చేరేదాకా తేవాలీ ॥తేవాలీ॥

2. పేదకు వెలుగును తేవాలీ
అర్థికి వెలుగును తేవాలీ
పేదల కంటే అధికాధికముగ
ధనికుల కెక్కువ తేవాలీ ॥తేవాలీ॥

3. విద్యాగంధము లేనివారికి
జ్ఞానదీపమును చూపాలీ
విద్యావంతుల మనుకొను వారికి
మరింత వెలుగును చూపాలీ ॥తేవాలీ॥

4. అందరికటులే వెలుగును తెచ్చి
భారము హరిపై వదలాలీ
'పనికే నీకధికారము గాని
ఫలితము కాదని' అనలేదా ॥తేవాలీ॥

5. కర్మను వదలక చేయాలీ
వదలే తలపునె వదలాలీ
ఫలితము కోరుటమాని దానిపై
మమకారమునే వదలాలీ ॥తేవాలీ॥

3. మతములైనవి హాస్యాస్పదములు

1. క్లుప్తముగా నా ఆదర్శమ్మును
కొలది మాటలలో తెలుపవచ్చును ॥క్లు॥

2. మానవకోటికి తమ దివ్యత్వము
బోధసేయుచు జీవితమందలి
ప్రతిస్పందనలో ఆ దివ్యత్వము
వెలికి తెచ్చుచు ప్రకట మొనర్చుటె ॥క్లు॥

3. దృష్టిపథములో పగటి వెలుగుగా
చూచుచుంటినే నొక్కభావమును
అజ్ఞానంబే దుఃఖమూలము
అన్యంబేమి కాదు కారణము ॥క్లు॥

4. పూర్వమునందున
త్యాగమె నియమము
ముందు యుగముల
త్యాగమె నియమము
మహాపురుషులు మానవజాతి
అభ్యున్నతికే త్యాగమొనర్చిరి ॥క్లు॥

5. మతములైనవి హాస్యాస్పదములు
భువికావశ్యము మంచి నడవడి
నిస్వార్థంబగు ప్రేమ అవసరము
అట్టి వాక్యమగు అశనిపాతము ॥క్లు॥

4. సత్యయుగంబే సంభవమౌను

1. సత్యయుగంబే సంభవమౌను
స్వర్ణయుగంబే సంప్రాప్తించును
అనాద్యార్యా హైందవ ధర్మము
ఆచంద్రార్కంబౌను సుస్థిరము ॥సత్య॥

2. బ్రాహ్మణమ్ములో విజ్ఞానంబును
సైనికశక్తిలో సంస్కృతి దార్ఢ్యము
వ్యాపారములో సమాన పంపిణి
కనిష్టవర్గము సామ్య సమస్థితి
చెక్కుచెదరకను చేరియున్నచో ॥సత్య॥

3. ఒకే కులంబు, ఒకే వేదము
సామరస్యము, శాంతి భావన
ఎపుడు వెలయునో అపుడే వెలయును
సత్యయుగంబని నా విశ్వాసము॥సత్య॥

4. సత్యయుగమ్ము అను ఈ భావన
భారత భువికుజ్జీవ మిచ్చును
నమ్మి లెండు! ఓ యువకుల్లారా!
ముందుకు ఉరుకుడు!
మనదే విజయము! ॥సత్య॥

5. ప్రతి యాత్మ దివ్యంబే!

ప్రతి యాత్మ దివ్యంబే
తత్వతః దివ్యంబే ॥ప్రతి॥

లోబయళ్ళగల ప్రకృతిని
స్వాధీనంబున నుంచుకొని
అంతర్గతమగు దివ్యత్వమ్మును
ప్రస్ఫుట పరచుటె జీవితగమ్యము ॥ప్రతి॥

భక్తి, జ్ఞాన, ధ్యాన, కర్మముల
నన్నో, కొన్నో, ఎన్నుకొని
దివ్యత్వంబును ప్రస్ఫుటపరచి
ముక్తాత్ముండై మెలగవలె ॥ప్రతి॥

ఇదె పూర్ణంబౌ ధర్మమౌటచే
అర్చన, ఆలయ, ఆకృతులు
విధి, విధాయక, వివరణలెల్ల
అప్రధానమగు అంశములె ॥ప్రతి॥

6. రారండి! రారండి!

బాలకులారా! బాలికలారా!
బాలబాలిక ప్రౌఢల్లారా!
పిల్లల పెద్దల కందరికీ
చల్లని సలహా చెపుతాను
పరుగు పరుగునా రారండి!
పరుగు పరుగునా రారండి! ॥బా॥

ఆత్మరూపులే మీరంతా!
ఆత్మే నిజముగ మీరంతా!
ఆత్మే మీ నిజతత్వమని
మీకే మీరు నేర్చుకొని
ప్రతి ఒక్కరికీ నేర్పండి
ప్రతి ఒక్కరికీ నేర్పండి ॥బా॥

నిదురపోయెడు మీ ఆత్మ
లేపినంతనే ఎంచక్కా
ప్రకాశించునో చూడండి
పరవశించునో చూడండి
ప్రకాశించునో చూడండి
పరవశించునో చూడండి ॥బా॥

అప్పుడు మీలో ఆత్మవల్లనే
శక్తివచ్చును, ఖ్యాతి వచ్చును;
మంచివచ్చును, మాన్యత వచ్చును;
పవిత్రమౌ మది, పరమైశ్వర్యము
ఎలా వెలయునో చూడండి
ఎలా వెలయునో చూడండి ॥బా॥

7. శక్తిమంతుడా లేవోయీ!

శక్తిమంతుడా లేవోయీ!
ధీరపురుషుడా లేవోయీ
అప్రతిహతమౌ ఆత్మశక్తి నీ
అంతరమందున గలదోయి॥

భౌతికములపై ప్రసరించితివా
భౌతిక సంపద నీదోయీ ॥

బుద్ధి భావనల చొప్పించితివా
ప్రజ్ఞాప్రాభవ పరిణతమౌ ॥

ఆత్మ ఆత్మపై పర్వించితివా
నరుడే శివుడై మనునోయి ॥

8. వ్యర్థపోకడల విసర్జింపుము!

వ్యర్థాన్వేషణ విసర్జించుచు
దైవము మీరని తెలియుట మంచిది
దైవము మీరని తెలిసి సుఖముగా
తృప్తి చెందుచు మెలగండి ॥వ్యర్థ॥

వ్యర్థపోకడల విసర్జించుచు
పాత్రపోషణము బాగుగ చేయుము
విశ్వరంగమున నీదు పాత్రను
నటుని విధముగా నటన మొనర్పుము॥
॥వ్యర్థ॥

9. అడుగు, అడుగు, నడువు! ముందుకు!

అడుగు, అడుగు, నడువ ముందుకు,
(అడుగు, అడుగు, నడువగా)
అడుగు, అడుగు, గడచిపోవు;
అడుగు, అడుగు, నడచువాని,
అడుగులందు నడచు లక్ష్మి ॥అ॥

తరుముచున్న కోతులన్ని
పరుగుతీయు ఎదురుతిరుగ
ఎదురుకొనిన ఎంత ఘోర
కష్టమైన ఇట్టె తీరు ॥అ॥

నేల నాటినట్టి గింజ
నేల, నీరు, గాలి యగునె?
తనకు వలసినట్లు మలచి
గింజ వంటి మొలకె యగును ॥అ॥

హిందూ, ముస్లిం, క్రైస్తవుడైనా
మతమునేల మారవలయు
మతములందు మర్మమెరిగి
తన మతమున పెరుగవలయు ॥అ॥

10. చెరువుకు నాలుగు గట్టులలో!

**(శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు గారిచే
గేయరూపంలో రచించబడిన శ్రీరామకృష్ణ పరమహంస సూక్తులు)**

చెరువుకు నాలుగు గట్టులలో
నాలుగు విధముల పాత్రలలో ।
నీటిని తెచ్చెడి స్త్రీలనిరి
అక్వా! వాటర్! పానీ! వారీ! ॥చెరువుకు॥

అంధులు నలుగురు ఏనుగును
తాకుచు నాలుగు వైపులను ।
ఏనుగు రూపము నిట్లనిరి
స్తంభం! పీపా! పాము! చేటా! ॥చెరువుకు॥

ఊసరవెల్లికి రంగులను
పాంథులు నలుగురు చూచుచును ।
చెప్పిరి ఇట్లని గట్టిగనూ
ఎరుపూ! పసుపూ! ఊదా! నీలం! ॥చెరువుకు॥

శ్రీగురుదేవులు ఇట్లనిరి,
అన్ని పేరులూ దేవునివే!
అన్ని రూపులూ దేవునివే!
సగుణ నిర్గుణాతీతుడునూ! ॥చెరువుకు॥

✡ ✡ ✡ ✡ ✡



శ్రీశారదాదేవి

స్తుతి

కృష్ణ శతకము

శ్రీ రుక్మిణీశ, కేశవ,
నారద సంగీతలోల, నగధర శౌరీ,
ద్వారకనిలయ, జనార్దన,
కారుణ్యముతోడ మమ్ము గావుము కృష్ణా!

నీవే తల్లివి తండ్రివి,
నీవే నా తోడు నీడ, నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము,
నీవే నా పతియు గతియు, నిజముగ కృష్ణా!

నారాయణ పరమేశ్వర,
ధారాధర నీలదేహ, దానవవైరీ,
క్షీరాబ్ధిశయన, యదుకుల
వీరా, నను గావు కరుణ వెలయగ కృష్ణా!

హరియను రెండక్షరములు
హరియించును పాతకముల నంబుజనాభా!
హరి నీ నామ మహత్త్వము
హరిహరి పొగడంగ వశమె హరి శ్రీకృష్ణా!

క్రూరాత్ముడజామీళుడు
నారాయణ యనుచు ఆత్మనందను పిలువన్,
ఏరీతి నేలుకొంటివి!
ఏరీ నీ సాటివేల్పు లెందును కృష్ణా!

అక్రూరవరద, మాధవ,
చక్రాయుధ, ఖడ్గపాణి, శౌరి, ముకుందా,
శక్రాది దివిజసన్నుత,
శుక్రార్చిత, నన్ను గరుణ జూడుము కృష్ణా!

నందుని ముద్దులపట్టివి,
మందరగిరిధరుని, హరిని, మాధవ విష్ణున్,
సుందర రూపుని మునిగణ
వందితు నిను దలతు భక్తవత్సల కృష్ణా!

ఓ కారుణ్య పయోనిధి,
నాకాధారంబవగుచు, నయముగ బ్రోవన్,
నాకేల ఇతర చింతలు,
నాకాధిప వినుత లోకనాయక కృష్ణా!

వేదంబులు గననేరని
ఆది పరబ్రహ్మమూర్తి, అనఘ మురారీ!
నాదిక్కు జూచి గావుము,
నీదిక్కే నమ్మినాడ, నిజముగ కృష్ణా!

జననము

పదునాలుగు భువనంబుల
కుదురుగ నీకుక్షి నిల్పుకొన నేర్పరివై,
విదితంబుగ నా దేవకి
యుదరములో నెట్టులొదిగి యుంటివి కృష్ణా!

అష్టమి రోహిణి ప్రొద్దున,
అష్టమ గర్భమున బుట్టి యా దేవకికిం,
దుష్టుని కంసు వధింపవె,
సృష్టి ప్రతిపాలనంబు సేయగ కృష్ణా!

బాల్యము

అందెలు గజ్జెలు మ్రోయగ,
చిందులు ద్రొక్కుచును, వేడ్క చెలువారంగా,
నందుని సతి యా గోపిక
ముందర నాడుదువు మిగుల మురియుచు కృష్ణా!

హరిచందనంబు మేనున,
కరమొప్పెడు హస్తములను కంకణరవముల్,
ఉరమున రత్నము మెరయగ
బరగితివౌ నీదు బాల వయసది కృష్ణా!

పాణితలంబున వెన్నయు,
వేణీమూలంబు నందు వెలయగ పింఛం
బాణీముత్యము ముక్కున,
జాణుడవై దాల్తు శేషశాయివి కృష్ణా!

లీలలు

మడుగుకు జని కాళీయుని
పడగలపై భరతశాస్త్రపద్ధతి వెలయన్,
కడువేడుకతో నాడెడు
అడుగులనే మదిదలంతు అచ్యుత కృష్ణా!

బృందావనమున, బ్రహ్మ
నందార్భకమూర్తి, వేణునాదము నీవా
మందార మూలమున గో
విందా పూరింతువౌర, వేడుక కృష్ణా!

దేవేంద్రుడలుకతోడను
వావిరిగా రాళ్ళవాన వడి గురియింపన్
గోవర్ధన గిరియెత్తితి,
గోవుల గోపకుల గాచుకొరకై కృష్ణా!

అండజవాహన విను, బ్ర
హ్మాండంబుల బంతులట్లు ఆడెడు నీవా
కొండల నెత్తితి వందురు,
కొండిక పనిగాక, దొడ్డకొండా కృష్ణా!

అంసాలంబిత కుండల,
కంసాంతక, నీవు ద్వారకాపురి లోనన్,
సంసారి రీతి నుంటివి,
హంసేంద్ర! విశాలనేత్ర అచ్యుత కృష్ణా!

శిష్టరక్షణ - దుష్టశిక్షణ

అంగన పసుపున, ధోవతి
కొంగున నటుకులను ముడుచుకొని వచ్చిన యా
సంగతి విని, దయనొసగితి
రంగుగ సంపదలు లోకరక్షక కృష్ణా!

"హా! వసుదేవ కుమారక!
కావుము నా మానమనుచు" కామిని వేడన్
ఆ వనజాక్షికి నిచ్చితి,
శ్రీవర అక్షయమటంచు చీరెలు కృష్ణా!

శుభ్రమగు పాంచజన్యము,
అభ్రంకష పగిది మ్రోవ ఆహవ భూమిన్,
విభ్రమము దనుజసుతా
గర్భంబుల బగులజేయు ఘనుడవు కృష్ణా!

జయమును విజయున కీయవె,
హయముల ములుకోల మోపి యదలించి, మహా
రయమున రొప్పవె తేరును,
భయమున రిపుసేన విరిగి పారగ కృష్ణా!

దుర్జనులగు నృపసంఘము
నిర్జింపగ దలచి నీవు, నిఖిలాధారా!
దుర్జనులను వధియింపను,
అర్జున రథచోదకుండవైతివి కృష్ణా!

శక్రసుతు గాచుకొరకై,
చక్రము చేపట్టి భీష్మ జంపగ జను నీ
విక్రమ మేమని పొగడుదు
నక్రగ్రహ సర్వలోక నాయక కృష్ణా!

దివిజేంద్ర సుతుని జంపియు
రవిసుతు రక్షించినావు రఘురాముడవై!
దివిజేంద్ర సుతుని గాచియు,
రవిసుతు బరిమార్చితౌర రణమున కృష్ణా!

దుర్భర బాణము రాగా,
గర్భములో నుండియభయ కావుమటన్నన్,
నిర్భరకృప రక్షించితి
అర్భకు అభిమన్యుసుతుని అచ్యుత కృష్ణా!

గిరులందు మేరువౌదువు,
సురలందును నింద్రుడౌదు, చుక్కలలోనన్
పరమాత్మ చంద్రుడవుదువు,
నరులందును నృపతివౌదు, నయముగ కృష్ణా!

చుక్కల నెన్నగ వచ్చును,
గ్రక్కున భూరేణువులను గణుతింపనగున్,
జొక్కపు నీ గుణజాలము
అక్కజమగు లెక్కపెట్ట అజునకు కృష్ణా!

కుక్షిని నిఖిల జగంబుల
నిక్షేపము జేసి, ప్రళయ నీరధినడుమన్,
రక్షక వటపత్రముపై
దక్షత పవళించునట్టి ధన్యుడ కృష్ణా!

విశ్వోత్పత్తికి బ్రహ్మవు,
విశ్వము రక్షింపదలచి విష్ణుడవనగా,
విశ్వము జెరుపను హరుడవు,
విశ్వాత్మక నీవెయగుచు వెలయగ కృష్ణా!

అగణిత వైభవ కేశవ!
నగధర, వనమాలి యాదినారాయణ యో
భగవంతుడ, శ్రీమంతుడ,
జగదీశ్వర శరణు శరణు శరణము కృష్ణా!

శరణాగతి

వనజాక్ష భక్తవత్సల,
ఘనమూర్తి త్రయమునందు కరుణానిధివై
జను నీ సద్గుణజాలము,
సనకాది మునీంద్రులెన్న జాలరు కృష్ణా!

కుంభీంద్ర వరద, కేశవ
జంభాసురవైరి, దివిజసన్నుత చరితా,
యంభోజనేత్ర, జలనిధి
గంభీరత నన్నుగావు కరుణను కృష్ణా!

దిక్కెవ్వరు ప్రహ్లాదుకు
దిక్కెవ్వరు పాండవులకు, దీనుల కెపుడున్
దిక్కెవ్వరయ్యహల్యకు,
దిక్కెవ్వరు నీవె నాకు దిక్కవు కృష్ణా!

హరినీవె దిక్కు నాకును,
సిరితో నేతెంచి మకరి శిక్షించి దయన్
బరమేష్ఠి సురలు బొగడగ
కరి గాచిన రీతి, నన్ను గావుము కృష్ణా!

దండమయా విశ్వంభర!
దండమయా పుండరీక దళనేత్ర హరీ!
దండమయా కరుణానిధి!
దండమయా నీకునెపుడు దండము కృష్ణా!

✡ ✡ ✡ ✡ ✡

దాశరథీ శతకము

శ్రీరఘురామ, చారు తులసీదళ దామ, శమక్షమాది శృం
గార గుణాభిరామ, త్రిజగన్నుత శౌర్యరమాలలామ, దు
ర్వార కబంధరాక్షస విరామ, జగజ్జన కల్మషార్ణవో
త్తారక నామ, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

రామ విశాల విక్రమ పరాజిత భార్గవరామ సద్గుణ
స్తోమ పరాంగనా విముఖ సువ్రతకామ వినీల నీరద
శ్యామ, కకుత్థ్సవంశ కలశాంబుధిసోమ సురారిదోర్బలో
ద్దామ విరామ భద్రగిరి దాశరథీ! కారుణాపయోనిధీ!

అగణిత సత్యభాష, శరణాగతపోష, దయాలసజ్ఝరీ
విగత సమస్తదోష, పృథివీసుర తోష, త్రిలోకపూత కృ
ద్గగన ధునీ మరంద పదకంజ విశేష, మణిప్రభా ధగ
ద్ధగిత విభూష, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

రంగదరాతి భంగ, ఖగరాజ తురంగ, విపత్పరంపరో
త్తుంగ తమః పతంగ, పరితోషితరంగ, దయాంతరంగ, స
త్సంగ, ధరాత్మజా హృదయసారస భృంగ, నిశాచరాబ్జ మా
తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

దురితలతాలవిత్ర, ఖరదూషణ కానన వీతిహోత్ర, భూ
భరణకళా విచిత్ర, భవబంధ విమోచనసూత్ర, చారువి
స్ఫురదరవింద నేత్ర, ఘన పుణ్యచరిత్ర, వినీలభూరికం
ధర సమగాత్ర, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

ముప్పున కాలకింకరులు ముంగిట వచ్చినవేళ, రోగముల్
గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండినవేళ, బాంధవుల్
గప్పినవేళ, మీ స్మరణ గల్గునొ గల్గదొ నాఁటి కిప్పుడే
తప్పకచేతు మీ భజన దాశరథీ! కరుణాపయోనిధీ!

పరమదయానిధే, పతితపావననామ హరే యటంచు సు
స్థిరమతులై సదా భజనసేయు మహాత్ముల పాదధూళి నా
శిరమున దాల్తు ‘మీరటకు జేరకు’ డంచు యముండు కింకరో
త్కరముల కానబెట్టునట దాశరథీ! కరుణాపయోనిధీ!

రామహరే, కకుత్థ్సకుల రామహరే, రఘురామ రామ శ్రీ
రామహరే యటంచు, మది రంజిల భేకగళంబులీల నీ
నామము సంస్మరించిన జనంబు భవంబెడబాసి తత్పరం
ధామ నివాసులౌదురట దాశరథీ! కరుణాపయోనిధీ!

చిక్కని పాలపై మిసిమిజెందిన మీఁగడ పంచదారతో
మెక్కినభంగి, మీ విమలమేచకరూప సుధారసంబు నా
మక్కువపళ్ళెరంబున సమాహిత దాస్యమనేటి దోయిటన్
దక్కెనటంచు జుఱ్ఱెదను, దాశరథీ! కరుణాపయోనిధీ!

జుఱ్ఱెద మీ కథామృతము జుఱ్ఱెద మీ పదకంజతోయమున్
జుఱ్ఱెద రామనామమున జొబ్బిలుచున్న సుధారసంబు నే
జుఱ్ఱెద జుఱ్ఱుజుఱ్ఱుగ రుచుల్ గనువారి పదంబుగూర్పవే
తఱ్ఱులతోడి పొత్తిడక దాశరథీ! కరుణాపయోనిధీ!

సిరిగలనాఁడు మైమఱచి చిక్కిననాఁడు దలంచి పుణ్యముల్
పొరిఁబొరి సేయనైతినని పొక్కినఁగల్గునె గాలిచిచ్చుపైఁ
గెరలిన వేళఁ దప్పిగొని కీడ్పడువేళ జలంబు గోరి త
త్తరమునఁ ద్రవ్వినం గలదె దాశరథీ! కరుణాపయోనిధీ!

సరసుని మానసంబు సరసజ్ఞుఁడెరుంగును ముష్కరాధముం
డెఱిఁగి గ్రహించువాడె కొలనేక నివాసముఁగాగ దర్దురం
బరయఁగ నేర్చునెట్లు వికచాబ్జ మరంద రసైకసౌరభో
త్కరము మిళిందమొందు క్రియ దాశరథీ! కరుణాపయోనిధీ!

భండనభీముఁడార్తజన బాంధవుఁడుజ్జ్వల బాణతూణకో
దండకళాప్రచండ భుజ తాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవసాటి దైవమిఁక లేఁడనుచున్ గడగట్టి భేరికా
డాండడ ఢాండ ఢాండ నినదంబు లజాండము నిండ మత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ! కరుణాపయోనిధీ!

ఎక్కడి తల్లిదండ్రి సుతులెక్కడివారు కళత్రబాంధవం
బెక్కడ జీవుఁడెట్టి తనువెత్తిన బుట్టుచు బోవుచున్న వా
డొక్కడె పాపపుణ్యఫల మొందిన నొక్కడె కానరాడు వే
ఱొక్కడు వెంటనంటిభవ మొల్లనయా కృపజూడవయ్య నీ
టక్కరి మాయలందిడక దాశరథీ! కరుణాపయోనిధీ!

నోఁచిన తల్లిదండ్రికిఁ దనూభవుఁ డొక్కడెచాలు మేటి చే
చాఁచని వాడు వేఱొకఁడు చాచిన లేదన కిచ్చువాఁడు నో
రాఁచి నిజంబ కాని పలుకాడని వాడు రణంబులోన మేన్
దాఁచని వాడు భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

బొంకని వాఁడె యోగ్య దరిబ్బందము లెత్తిన చోట జివ్వకుం
జంకనివాఁడె జోదు రభసంబున నర్థి కరంబు సాఁచినం
గొంకనివాఁడె దాత మిముఁగొల్చి భజించిన వాడెపో నిరా
తంకమనస్కుఁ డెన్నగను దాశరథీ! కరుణాపయోనిధీ!

✡ ✡ ✡ ✡ ✡

శ్రీ కాళహస్తీశ్వర శతకము

నిను సేవింపగ నాపదల్పొడమనీ, నిత్యోత్సవంబబ్బనీ
జనమాత్రుండననీ మహాత్ముడననీ సంసారమోహంబు పై
కొననీ జ్ఞానముగల్గనీ గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ
చ్చిన రానీ యవి నాకు భూషణములే, శ్రీకాళహస్తీశ్వరా!

ఏ వేదంబు పఠించెలూత, భుజగంబే శాస్త్రములుప్పాచె దా
నే విద్యాభ్యసనం బొనర్చె గరి, చెంచేమంత్రమూహించె, బో
ధావిర్భావనిదానముల్ చదువులయ్యా? కావు! మీ పాదసం
సేవాసక్తియె కాక జంతుతతికిన్, శ్రీ కాళహస్తీశ్వరా!

నిన్నున్నమ్మినరీతి నమ్మనొరులన్, నీకన్న నాకెన్న లే
రన్నల్దమ్ములు తల్లిదండ్రులు గురుండాపత్సహాయుండు నా
యన్నా! యెన్నడు నన్ను సంసృతి విషాదాంబోధి దాటించు య
ఛ్ఛిన్నానంద సుఖాబ్ధిదేల్చెదోకదే శ్రీ కాళహస్తీశ్వరా!

కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్ జీవనభ్రాంతులై!
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్, వారిచే నేగతుల్
వడసెన్? బుత్రులులేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీ కాళహస్తీశ్వరా!

గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీ కళ్యాణనామంబు ప్ర
త్యహమున్ బేర్కొను నుత్తమోత్తముల బాధంబెట్టగా నోపునే!
దహనుంగప్పజాలునే శలభసంతానంబు? నీ సేవచే
సి హతక్లేశులుగారుగాక మనుజుల్ శ్రీ కాళహస్తీశ్వరా!

చనువారింగనియేడ్చువారు, జముడా! సత్యంబుగావత్తుమే
మనుమానంబిక లేదు నమ్ముమని తారావేళ నారేవునన్
మునుగంబోవుచు బాసచేయుట సుమీ ముమ్మాటికింజూడగా
చెనటుల్గానరు దీని భావమిదివో శ్రీ కాళహస్తీశ్వరా!

పవిపుష్పంబగు, నగ్నిమంచగు నకూపారంబు భూమీస్థలం
బవు, శత్రుండతిమిత్రుడౌ, విషము దివ్యాహారమౌనెన్నగా
నవనీమండలి లోపలన్ శివ శివేత్యా భాషణోల్లాసికిన్
శివ! నీ నామము సర్వవశ్యకరమౌ, శ్రీ కాళహస్తీశ్వరా!

పాలుంబువ్వయు బెట్టెదన్ గుడువరా పాపన్న, రాయన్న, లే
లే లెమ్మన్న, నరంటిపండ్లు గొనితే, లేకున్న నే నొల్లనం
టే, లాలింపరె తల్లితండ్రులపుడట్లే తెచ్చి, వాత్సల్య ల
క్ష్మీ లీలావచనంబులం గుడుపరా శ్రీ కాళహస్తీశ్వరా!

శ్రీశైలేశు భజింతునో యభవు గాంచీనాథు సేవింతునో
కాశీవల్లభు గొల్వబోదునొ, మహాకాళేశు బూజింతునో
నాశీలంబణువైన మేరువనుచున్ రక్షింపవే నీ కృపా
శ్రీ శృంగార విలాసహాసములచే శ్రీ కాళహస్తీశ్వరా!

ఒక పూటించుక కూడు తక్కువగునే నోర్వంగలే, దెండ కో
పక నీడన్వెదకుం, జలిం జడిసి కుంపట్లెత్తుకో జూచు, వా
నకు నింఢ్లిండ్లను దూరు, నీ తనువు దీనన్వచ్చు సౌఖ్యంబు రో
సి కడాసింపరుగాక మర్త్యులకటా! శ్రీ కాళహస్తీశ్వరా!

కేదారాది సమస్తతీర్థములు కోర్కిం జూడ బోనేటికిన్?
కాదా ముంగిలి వారణాసి కడుపే కైలాసశైలంబు నీ
పాద ధ్యానము సంభవించునపుడే భావింప సుజ్ఞాన ల
క్ష్మీ దారిద్రులుగారె లోకులకటా శ్రీ కాళహస్తీశ్వరా!

పుడమి న్నిన్నొక బిల్వపత్రముననే పూజించి, పుణ్యంబు నుం
బడయన్నేరక పెక్కు దైవములకుం బప్పుల్ ప్రసాదంబులున్
కుడుముల్ దోసెలు సారసత్తులటుకుల్ గుగ్గిళ్ళనుంబెట్టుచున్
చెడి, యెందుం గొరకాక పోదురకటా, శ్రీ కాళహస్తీశ్వరా!

నీపై కావ్యము జెప్పుచున్న యతడున్, నీ పద్యముల్ వ్రాసియి
మ్మా పాఠంబొనరింతునన్న యతడున్, మంజుప్రబంధమ్ము ని
ష్ఠాపూర్తిం బఠియించుచున్న యతడున్, సద్బాంధవుల్ గాక, ఛీ
ఛీ! పృష్ఠాగతబాంధవంబు నిజమా! శ్రీ కాళహస్తీశ్వరా!

వన్నే యేనుగుతోలు దుప్పటము, బువ్వా కాలకూటంబు, చే
గిన్నే బ్రహ్మకపాల ముగ్రమగు భోగే కంఠహారంబు, మే
ల్నిన్నీలాగున నుంటయుం దెలిసియు న్నీ పాదపద్మంబు చే
ర్చెన్నారాయణు డెట్లు మానసము దా శ్రీ కాళహస్తీశ్వరా!

తాత ల్దల్లియు దండ్రియు న్మరియు పెద్దల్పావగా జూడరో
భీతిం బొందగ నేల చావునకుగా, పెండ్లాము బిడ్డల్హిత
వ్రాతంబు ల్తిలకింప, జంతువులకు న్వాలాయమైయుండగా
చేతోవీథి నరుండు నిన్ గొలువడో శ్రీ కాళహస్తీశ్వరా!

జాతుల్సెప్పుట, సేవచేయుట, మృషల్ సంధించుట, న్యాయపు
ఖ్యాతింబొందుట, కొండెగాడవుట, హింసారంభకుండౌట, మి
థ్యాతాత్పర్యము లాడుటన్నియు పరద్రవ్యంబు నాశించి, యా
శ్రీ తానెన్ని యుగంబులుండగలదో శ్రీ కాళహస్తీశ్వరా!

✡ ✡ ✡ ✡ ✡

నీతి

సుమతీ శతకము

చేయవలసిన పనులు

ఇచ్చునదె విద్య, రణమున
జొచ్చునదే మగతనంబు, సుకవీశ్వరులన్
మెచ్చునదె నేర్పు, వాదుకు
వచ్చునదే కీడు సుమ్ము, వసుధను సుమతీ!

ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
అపకారికి నుపకారము నెపమెన్నక
సేయువాడు నేర్పరి సుమతీ!

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!

ధీరులకు చేయు మేలది
సారంబగు నారికేళ సలిలము భంగిన్
గారవము మీరి, మీదట
భూరి సుఖావహములగును భువిలో సుమతీ!

పతికడకు, తన్ను గూర్చిన
సతికడకును వేల్పుకడకు, సద్గురు కడకున్,
సుతుకడకు, రిక్తచేతుల
మతిమంతులు చనరు, నీతి మార్గము సుమతీ!

వినదగు నెవ్వరు చెప్పిన,
వినినంతనె వేగపడక వివరింపదగున్,
కని కల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

ఉత్తముల అభిలక్షణాలు

ఆకొన్న కూడె యమృతము
తాగొంకకనిచ్చువాడె దాత ధరిత్రిన్,
సోకోర్చువాడె మనుజుడు
తేకువ గలవాడె వంశ తిలకుడు సుమతీ!

ఉడుముండదె నూరేండ్లును,
పడియుండదె పేర్మిపాము పదినూరేండ్లన్
మడుగున కొక్కెర యుండదె,
కడునిల పురుషార్థపరుడు కావలె సుమతీ!

పరనారీ సోదరుడై,
పరధనముల కాసపడక, పరులకు హితుడై,
పరులు తను బొగడ నెగడక
పరులలిగిన నలుగ నతడు పరముడు సుమతీ!

లోక సామాన్య విషయములు

ఉత్తమ గుణములు నీచున
కెత్తెరగున గలుగనేర్చు; ఎయ్యెడలందా
నెత్తిచ్చి కరుగపోసిన
ఇత్తడి బంగారమగునె, ఇలలో సుమతీ!

ఎప్పుడు సంపదగలిగిన
నప్పుడె బంధువులు వత్తురది యెట్లన్నన్
తెప్పలుగ చెరువు నిండిన
కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!

ఓడల బండ్లును వచ్చును,
ఓడలునా బండ్లమీద నొప్పుగ వచ్చున్
ఓడలు బండ్లును వలెనే
వాడంబడు కలిమిలేమి వసుధను సుమతీ!

కనకపు సింహాసనమున
శునకము గూర్చుండబెట్టి శుభ లగ్నమునన్
దొనరగ పట్టము గట్టిన,
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ!

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్,
తమతమ నెలవులు దప్పిన
తమ మిత్రులె శత్రులౌట తథ్యము సుమతీ!

కూరిమిగల దినములలో
నేరములెన్నడును గలుగనేరవు, మరియా
కూరిమి విరసంబైనను
నేరములే దోచుచుండు నిక్కము సుమతీ!

కొరగాని కొడుకు పుట్టిన
కొరగామియెకాదు; తండ్రి గుణముల జెరచున్,
చెరకు తుద వెన్ను పుట్టిన
చెరకున తీపెల్ల జెరచు, సిద్ధము సుమతీ!

చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు, పామరుడు తగన్
హేమంబు గూడబెట్టిన
భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!

చుట్టములుగాని వారలు
"చుట్టములము నీ" కటంచు సొంపుదలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగ గదరా సుమతీ!

తడవోర్వక, యొడలోర్వక
కడువేగంబడచి పడిన కార్యంబగునే?
తడవోర్చిన, నొడలోర్చిన
జెడిపోయిన కార్యమెల్ల జేకురు సుమతీ!

తన కోపమె తన శత్రువు,
తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ,
తన సంతోషమె స్వర్గము,
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!

తల నుండు విషము ఫణికిని,
వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్,
తల తోకయనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!

ధనపతి సఖుడై యుండియు,
నెనయంగా శివుడు బిచ్చమెత్తగ వలసెన్,
తనవారికెంత గలిగిన
తన భాగ్యమె తనకుగాక తథ్యము సుమతీ!

నయమున బాలును ద్రావరు,
భయమున విషమైనగాని భక్షింతురుగా;
నయమెంత దోసకారియొ
భయమే చూపంగవలయు బాగుగ సుమతీ!

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు; జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

సరసము విరసము కొరకే,
పరిపూర్ణ సుఖంబు లధికబాధల కొరకే,
పెరుగుట విరుగుట కొరకే,
ధర తగ్గుట హెచ్చుకొరకె, తథ్యము సుమతీ!

సిరితావచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్,
సిరితాబోయిన పోవును
కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!

విడువదగినవి, చేయకూడనివి

అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరనుగొల్చి మిడుగుట కంటెన్,
వడిగల యెద్దులగట్టుక
మడిదున్నుక బ్రతుక వచ్చు మహిలో సుమతీ!

అడియాస కొలువు గొలువకు,
గుడిమణియము సేయబోకు, కుజనులతోడన్
విడువక కూరిమి సేయకు,
అడవిని తోడరయకొంటి నరుగకు సుమతీ!

అధరము కదిలియు గదలక
మధురములగు భాషలుడిగి, మౌనవ్రతుడౌ,
అధికార రోగపూరిత
బధిరాంధక శవముజూడ పాపము సుమతీ!

ఇమ్ముగ చదువని నోరును,
అమ్మాయని బిలచి యన్నమడుగని నోరున్,
తమ్ముల బిలువని నోరును,
కుమ్మరి మనుద్రవ్వినట్టి గుంటర సుమతీ!

ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను చెరకుకైవడనె పో,
నెపములు వెదకును కడపట,
కపటపు దుర్జాతిపొందు గదరా సుమతీ!

ఎప్పుడు తప్పులు వెదకెడు
అప్పురుషుని గొల్వగూడదది యెట్లన్నన్,
సర్పంబు పడగనీడను
కప్ప వసించిన విధంబు గదరా సుమతీ!

ఏరకుమీ కసుగాయలు
దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ;
పారకుమీ రణమందున
మీరకుమీ గురువునాజ్ఞ మేదిని సుమతీ!

కొంచెపు నరు సంగతిచే
అంచితముగ కీడువచ్చు; అది యెట్లన్నన్,
కించిత్తు నల్లికుట్టిన
మంచమునకు పెట్లు వచ్చు మహిలో సుమతీ!

తనవారు లేని చోటను
చనువించుక లేనిచోట, జగడము చోటన్,
అనుమానమైన చోటను,
మనుజునకును నిలువదగదు మహిలో సుమతీ!

నడువకు మీ తెరువొక్కట,
కుడువకుమీ శత్రునింట కూరిమితోడన్,
ముడువకుమీ పరధనముల,
నుడువకుమీ ఒరుల మనసు నొవ్వగ సుమతీ!

పాలను గలసిన జలములు
పాల విధంబుననె యుండు పరికింపంగా,
పాలచవి చెరచుగావున,
పాలసుడగు వాని పొందు వలదుర సుమతీ!

బలవంతుడ నాకేమని,
పలువురతో నిగ్రహించి పలుకుటమేలా?
బలవంతమయిన సర్పము
చలిచీమల చేతచిక్కి చావదె సుమతీ!

✡ ✡ ✡ ✡ ✡

వేమన శతకము

అనగననగరాగ మతిశయిల్లుచునుండు
తినగతినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన,
విశ్వదాభిరామ వినురవేమ!

అన్ని దానములందు నన్నదానమెగొప్ప
కన్నతల్లి కంటె ఘనము లేదు,
ఎన్న గురుని కన్న నెక్కువ లేదయా,
విశ్వదాభిరామ వినురవేమ!

అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను,
సజ్జనుండు బల్కు చల్లగాను,
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా,
విశ్వదాభిరామ వినురవేమ!

ఆత్మశుద్ధి లేని యాచారమది యేల?
భాండశుద్ధిలేని పాకమేల?
చిత్తశుద్ధిలేని శివపూజలేలయా?
విశ్వదాభిరామ వినురవేమ!

ఇంటిలోని ధనము “యిదినాది” యనుచును
మంటిలోన దాచు మంకుజీవి
కొంచబోడు వెంట గుల్లకాసును రాదు
విశ్వదాభిరామ వినురవేమ!

ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ!

కొండకుధరమన్న, కుండభాండంబన్న
ఉప్పులవణమన్న నొకటి గాదె
భాషలెన్ని యైన బరతత్త్వమొక్కటే,
విశ్వదాభిరామ వినురవేమ!

జీవి జీవిజంప శివుని జంపుటె యగును
జీవుడరసి చూడ శివుడు గాడె?
జీవుడే శివుడని సిద్ధంబు తెలియరా
విశ్వదాభిరామ వినురవేమ!

తప్పులెన్ను వారు తండోపతండంబు
లుర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ!

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోని చెదలు పుట్టవా గిట్టవా?
విశ్వదాభిరామ వినురవేమ!

నీళ్ళలోని మొసలి నిగిడి యేనుగు బట్టు
బైట కుక్కచేత భంగపడును
స్థాన బలిమి గాని తన బల్మి కాదయా
విశ్వదాభిరామ వినురవేమ!

పట్టుపట్టరాదు, పట్టివిడువరాదు
పట్టెనేని బిగియ బట్టవలయు
బట్టి విడుటకన్న బరగ జచ్చుట మేలు,
విశ్వదాభిరామ వినురవేమ!

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ వినురవేమ!

మాటలాడుటొకటి, మనసులో నొక్కటి,
ఒడలి గుణము వేఱె యోజ వేఱె
ఎట్లుగల్గు ముక్తి యీలాగు తానుండ?
విశ్వదాభిరామ వినురవేమ!

మృగమదంబు జూడ మీద నల్లగ నుండు
బరిఢవిల్లు దాని పరిమళంబు
గురువులైన వారి గుణములీలాగురా
విశ్వదాభిరామ వినురవేమ!

మ్రానులోన నగ్ని మరియుండగావచ్చు
అగ్నినుండ మ్రాను కలవిగాదు
మ్రానులోన యగ్ని మర్యాద సంసారి
విశ్వదాభిరామ వినురవేమ!

✡ ✡ ✡ ✡ ✡

ఇతర పద్యములు

ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము దన మనంబునకగు, దా
నొరులకు నవి సేయకునికి,
పరాయణము పరమధర్మ పథములకెల్లన్.

విను, పురుషుడు గావింపని
పనులకు దైవమది యెట్లు ఫలమొనరించున్?
జనములు కార్యము నడుపగ,
ననుకూలత నిచ్చుగాక యయ్యయి ఫలముల్.

చేతులారంగ శివుని పూజించువాడు,
నోరునొవ్వంగ హరికీర్తి నుడువువాడు
దయయు సత్యంబు లోనుగా తలచువాడు
తల్లిదండ్రులు చేసిన తపసుపంట.

✡ ✡ ✡ ✡ ✡

భాస్కర శతకము

అలఘుగుణ ప్రసిద్ధుఁడగు నట్టి ఘనుండొకఁ డిష్టుఁడై తనున్
వలచి యొకించు కే మిడిన వానికి మిక్కిలి మేలుచేయుఁగా;
తెలిసి కుచేలుఁడొక్క కొణిదెం డడుకుల్ దనకిచ్చినన్ మహా
ఫలదుఁడు కృష్ణుఁడత్యధిక భాగ్యము లాతనికీఁడె? భాస్కరా!

ఒక్కఁడెచాలు నిశ్చల బలోన్నతుఁడెంతటి కార్యమైనఁ దాఁ
జక్కనొనర్పఁ; గౌరవు లసంఖ్యులు పట్టిన ధేనుకోటులం
జిక్కఁగనీక తత్ప్రబలసేన ననేక శిలీముఖంబులన్
మొక్కపడంగఁ జేసి తుద ముట్టఁడె యొక్క కిరీటి భాస్కరా!

కులమున నక్కడక్కడ నకుంఠిత ధార్మికు డొక్కఁడొక్కఁడే
కలిగెడుఁగాక పెందఱుచు గల్గగ నేరరు; చెట్టుచెట్టునన్
గలుగఁగ నేర్చునే? గొడుగు కామలు చూడఁగ నాడనాడ నిం
పలరఁగ నొక్కడొక్కటి నయంబునఁ జేకుఱుఁగాక భాస్కరా!

చదువదియెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చ; రెచ్చటం
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడునుప్పు లేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా!

తగిలి మదంబుచే నెదురిఁదన్ను నెఱుంగక దొడ్డవానితో
బగఁగొని పోరుటెల్ల నతి పామరుఁడై చెడుటింతెగాక తా
నెగడి జయింపనేరఁడది నిక్కము తప్పదు; ధాత్రిలోపలన్
దెగి యొక కొండతో తగరు ఢీకొని తాఁకిన నేమి భాస్కరా!

తడవగ రాదు దుష్టగుణుఁదత్వ మెఱుంగక యెవ్వరైన నా
చెడుగుణ మిట్లు వల్వదని చెప్పిన గ్రక్కున గోపచిత్తుఁడై
కడుఁ దెఁగఁజూచుఁగా; మఱుగఁ గాగిన తైలము నీటిబొట్టుపై
బడునెడ నాక్షణం బెగసి భగ్గున మండక యున్నె భాస్కరా!

తనకు ఫలంబు లేదని యెదం దలఁపోయఁడు కీర్తిగోరునా
ఘనగుణశాలి లోకహిత కార్యము మిక్కిలిభారమైన మే
లనుకొని పూను; శేషుఁడు సహస్రముఖంబుల గాలిగ్రోలి తా
ననిశము మోవడేఁ మఱి మహాభరమైన ధరిత్రి భాస్కరా!

తాలిమితోడుతం దగవు దప్పక నేర్పరి యొప్పుదప్పులం
బాలన సేయుఁగాకట నుపాయవిహీనుడు సేయనేర్చునే?
పాలను నీరు వేఱుపఱుపంగ మరాళ మెఱుంగుఁగాని మా
ర్జాల మెఱుంగునే తదురు చారురసజ్ఞత బూన భాస్కరా!

తెలియని కార్యమెల్లఁగడ తేర్చుట కొక్క వివేకిఁ జేకొనన్
వలయునటైన దిద్దుకొన వచ్చుఁ బ్రయోజనమాంద్యమేమియుం
గలుగదు, ఫాలమందుఁ దిలకం బిడునప్పుడు చేతనద్దమున్
గలిగినఁ జక్కఁజేసికొనుఁ గాదె నరుండది చూచి భాస్కరా!

దక్షుఁడు లేనియింటికిఁ బదార్థము వేఱొక చోటనుండి వే
లక్షలు వచ్చుచుండినఁ బలాయనమై చనుఁ గల్లగాదు; ప్ర
త్యక్షము వాగులున్ వఱదలన్నియు వచ్చిన నీరునిల్చునే
యక్షయమైన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా!

నుడువుల నేర్పుచాలని మనుష్యుఁడెఱుంగక తప్పనాడినం
గడుఁగృపతో జెలంగుదురు కాని యదల్పరు తజ్ఞులెల్లఁ; ద
ప్పడుగులు వెట్టుచున్నడుచు నప్పుడు బాలుని ముద్దుచేయఁగా
దొడుగుదు రింతెకాని పడఁద్రోయుదురే యెవరైన భాస్కరా!

నేరిచి బుద్ధిమంతుఁడతి నీతివివేకము దెల్పినం జెడం
గారణమున్నవాని కది కైకొనఁగూడదు నిక్కమే; దురా
చారుఁడు రావణాసురుఁడు డసహ్యమునొందఁడె చేటుకాలముం
జేరువ యైననాఁడు నిరసించి విభీషణు బుద్ధి భాస్కరా!

పరహితమైన కార్యమతి భారముతోడిదియైనఁ బూను సత్పు
రుషుఁడు లోకముల్పొగడఁ బూర్వమునందొక ఱాలవర్షమున్
గురియఁగజొచ్చినన్ గదిసి గొబ్బున గోజన రక్షణార్థమై
గిరినొక కేల నెత్తెనట కృష్ణుఁడు ఛత్రము భాతి భాస్కరా!

పలుచని హీనమానవుఁడు పాటిఁదలంపక నిష్ఠురోక్తులం
బలుకుచు నుండుఁగాని, మతి భాసురుఁడైన గుణప్రపూర్ణుఁడ
ప్పలుకులఁ బల్కఁబోవదు నిబద్ధిగ నెట్లన; వెల్తికుండఁ దాఁ
దొలఁకుచునుండుఁగాని మఱి తొల్కునె నిండుఘటంబు భాస్కరా!

పలుమఱు సజ్జనుండు ప్రియభాషలె పల్కుఁ గఠోరవాక్యముల్
బలుకఁ డొకానొకప్పుడవి పల్కినఁ గీడును గాదు నిక్కమే;
చలువకు వచ్చి మేఘుఁడొక జాడను దా వడగండ్లరాల్చినన్
శిలలగునోటు వేగిరమె శీతలనీరముగాక భాస్కరా!

బంధురసద్గుణాఢ్యుఁ డొకపట్టున లంపట నొందియైన దు
స్సంధిఁ దలంపఁ డన్యులకుఁ జాలహితం బొనరించుఁగాక, శ్రీ
గంధపుఁ జెక్క రాగిలుచుఁగాదె శరీరుల కుత్సవార్థమై
గంధములాత్మఁ బుట్టఁదఱుఁగంబడి యుండుటలెల్ల భాస్కరా!

మదిఁదను నాసపడ్డయెడ మంచి గుణోన్నతుఁ డెట్టిహీనునిన్
వదలఁడు మేలుపట్టున నవశ్యము మున్నుగ నాదరించుగా
త్రిదశవిమానమధ్యమునఁ దెచ్చికృపామతిసారమేయమున్
మొదల నిండడె ధర్మజుఁడు మూఁగి సురావళి చూడ భాస్కరా!

సంతత పుణ్యశాలి నొక జాడను సంపద వాసిపోయి తా
నంతటఁ బోక నెట్టుకొని యప్పటియట్ల వసించియుండు; మా
సాంతమునందుఁ జందురుని నన్నికళల్ పెడఁబాసి పోయినం
గాంతి వహింపఁడోటు? తిరుగంబడి దేహమునిండ భాస్కరా!

సన్నుతకార్యదక్షుఁడొక చాయ నిజప్రభ యప్రకాశమై
యున్నపుడైన లోకులకు నొండొక మేలొనరించు సత్త్వసం
పన్నుఁడు భీముఁడా ద్విజుల ప్రాణము కావఁడె యేకచక్రమం
దెన్నికగా బకాసురుని నేపున రూ పడఁగించి భాస్కరా!

సిరిగలవానికెయ్యెడలఁ జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱిగుఱి గాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలం బగున్
వఱపున వచ్చి మేఘుఁడొక వర్షము వాడిన చేల మీఁదటం
గురిసినఁ గాక యంబుధులఁ గుర్వఁగ నేమిఫలంబు భాస్కరా!

స్థిరతరధర్మ వర్తనఁ బ్రసిద్ధికి నెక్కినవాని నొక్క ము
ష్కరుఁ డతి నీచవాక్యములఁ గాదని పల్కిన నమ్మహాత్ముఁడుం
గొఱఁతవహింపఁడయ్యెడ; నకుంఠితపూర్ణ సుధాపయోధిలో
నరుగుచుఁ గాకి రెట్ట యిడినందున నేమి కొఱంత భాస్కరా!

✡ ✡ ✡ ✡ ✡

నీతి శ్లోకములు

భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్ర యుతేన చ ।
సేతుస్నాన శతైర్యశ్చ తత్ఫలం మాతృవందనే ॥

(ఆరుసార్లు భూప్రదక్షిణం చేసిన ఫలం, పెక్కు కాశీయాత్రలు చేసిన ఫలం, అనేక వందలసార్లు రామేశ్వరంలో సేతుస్నానం చేసిన ఫలం, ఒక్కసారి తల్లికి నమస్కరించుట వలన లభించును.)

శ్లోకార్థేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్ ॥

(కోట్ల గ్రంథములలో చెప్పబడిన సారం మొత్తాన్ని అర్థశ్లోకంలో వివరిస్తాను. అదేమిటంటే, పరులకు ఉపకారం చెయ్యడమే పుణ్యం, పరులను పీడించుటయే పాపం.)

నాన్నోదక సమం దానం న ద్వాదశ్యాః పరం వ్రతమ్ ।
న గాయత్ర్యాః పరం మంత్రం న మాతుః పరదైవతమ్ ॥

(అన్నము, మంచినీరు ఇచ్చినదానికి మించిన దానము, ద్వాదశీ వ్రతమును మించిన వ్రతము, గాయత్రీ మంత్రమును మించిన మంత్రము, తల్లిని మించిన దైవము లేవు.)

ఆకాశాత్పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్ ।
సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి ॥

(ఆకాశం నుండి కురిసిన నీరంతా రకరకాల మార్గాలలో సముద్రాన్ని చేరినట్టే, ఏ దేవునికి, ఏ పద్ధతిలో నమస్కరించినా అది ఆ పరమాత్ముడికే చేరుతుంది.)

పరోపకారాయ దుహంతి గావః పరోపకారాయ వహంతి నద్యః ।
పరోపకారాయ ఫలంతి వృక్షాః పరోపకారార్థ మిదం శరీరమ్ ॥

(పరులకు ఉపకారం చెయ్యడం కోసమే ఆవులు పాలు ఇస్తున్నాయి. పరులకు ఉపకారం చెయ్యడం కోసమే నదులు ప్రవహిస్తున్నాయి. పరులకు ఉపకారం చెయ్యడం కోసమే చెట్లు ఫలాలను ఇస్తున్నాయి. అదే విధంగా మన శరీరం కూడా పరులకు ఉపకారం చెయ్యడం కోసమే.)

దుర్భిక్షే చాన్నదాతారం సుభిక్షే చ హిరణ్యదమ్ ।
చతురోఽహం నమస్యామి రణే ధీరం ఋణే శుచిమ్ ॥

(శ్రీ కృష్ణుడు ఇలా పలికాడు: కరవు సమయంలో అన్నదానం చేసేవాడికి, దేశం సుభిక్షంగా ఉన్నప్పుడు ధనాన్ని దానం చేసేవాడికి, యుద్ధంలో వెన్ను చూపని ధీరుడికి, ఇచ్చినమాట నిలబెట్టుకుని, అప్పు సకాలంలో తీర్చేవాడికి నేను నమస్కరిస్తాను.)

మృత్పిండ ఏకో బహుభాండరూపం సువర్ణమేకం బహుభూషణాని ।
గోక్షీరమేకం బహుధేను జాతం ఏకః పరాత్మా బహుదేహవర్తీ ॥

(కుండలు ఎన్ని ఆకారాలలో ఉన్నా మట్టి ఒక్కటే. నగలు ఎన్ని ఆకారాలలో ఉన్నా బంగారం ఒక్కటే. ఆవులు ఎన్ని రంగులలో ఉన్నా పాలుమాత్రం తెల్లగానే ఉంటాయి. అదే విధంగా జీవుల శరీరాలు వేర్వేరుగా కనిపించినా వాటిలోని పరమాత్మ ఒక్కడే.)

మాతృవత్ పరదారాంశ్చ పరద్రవ్యాణి లోష్టవత్ ।
ఆత్మవత్ సర్వభూతాని యః పశ్యతి స పండితః ॥

(పరస్త్రీలను తన తల్లిగాను, ఇతరుల డబ్బును మట్టిపెళ్ళతో సమానంగాను, అన్ని జీవులను తనతో సమానంగాను ఎవడు చూస్తాడో వాడే నిజమైన పండితుడు.)

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ జిహ్వాగ్రే మిత్ర బాంధవాః ।
జిహ్వాగ్రే బంధన ప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధ్రువమ్ ॥

(నాలుక చివర మంచిమాట ఉండడం వలన సంపదలు కలుగుతాయి. మర్యాదగా మాట్లాడడం వలన అందరూ మనకు మిత్రులు, బంధువులు అవుతారు. తప్పుగా, నోటిదురుసుతో మాట్లాడడంవలన చిక్కుల్లో పడతాం, చివరికి మరణం కూడా సంభవించవచ్చు.)

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియమ్ ।
ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మః సనాతనః ॥

(సత్యమే పలకాలి. ఇతరులకు ప్రియమైన మాటలనే మాట్లాడాలి. ఇతరులకు కష్టాన్ని కలిగించే సత్యాన్ని చెప్పకూడదు. మరొకవైపు ప్రియమైన మాట పలకాలని అబద్ధమాడకూడదు. ఇదే సనాతనకాలం నుంచి చెప్పబడుతున్న ధర్మం.)

దృష్టిపూతం న్యసేత్ పాదం వస్త్రపూతం పిబేజ్జలమ్ ।
సత్యపూతం వదేద్ వాక్యం మనఃపూతం సమాచరేత్ ॥

(నడిచేటప్పుడు చూసి అడుగువెయ్యాలి. మంచినీటిని పొరలు వేసిన గుడ్డతో వడకట్టి త్రాగాలి. నిజమైన మాటనే పలకాలి. నిర్మలమైన మనస్సుతో పనిచెయ్యాలి.)

రూపయౌవన సంపన్నా విశుద్ధ కులసంభవాః ।
విద్యాహీనా న శోభంతే పాలాశ కుసుమం యథా ॥

(ఎంత గొప్ప రూపము, యౌవనము, సంపద, మంచి కులగోత్రములు ఉన్నవాడైనా విద్యలేకపోతే సువాసనలేని మోదుగపూవులాగా శోభించడు.)

ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమం పితురార్జితం ।

అధమం భ్రాతృవిత్తం చ ఋణ విత్తమధమాధమమ్ ॥

(ధనం రకరకాలుగా ఉంటుంది. తాను సొంతగా సంపాదించిన డబ్బు ఉత్తమమైనది. తండ్రి సంపాదించి ఇచ్చిన సొమ్ము మధ్యరకమైంది. అన్నదమ్ముల నుంచి తీసుకున్న సొమ్ము హీనమైనది. అతిగా, డాబుకోసం అప్పుచేసి తెచ్చిన సొమ్ము హీనాతిహీనమైనది.)

ఉత్తమే క్షణకోపస్యాత్ మధ్యమే ఘటికా ద్వయమ్ ।

అధమేస్యాదహోరాత్రం పాపిష్ఠే మరణాంతకమ్ ॥

(కోపం వచ్చినా క్షణంలో దాన్ని అణచుకునేవాడు ఉత్తముడు. రెండు ఘడియలపాటు కోపం తగ్గనివాడు మధ్యముడు. ఒక రాత్రి, పగలు కోపం తగ్గనివాడు అధముడు. చనిపోయేవరకూ కోపం తగ్గనివాడు పాపిష్ఠివాడు.)

కృషితో నాస్తి దుర్భిక్షం జపతో నాస్తి పాతకమ్ ।

మౌనేన కలహో నాస్తి నాస్తి జాగరతో భయమ్ ॥

(కష్టపడి పనిచేసేవాడికి కరవు ఉండదు. జపం చేసేవాడికి పాపం ఉండదు. మౌనంగా ఉండేవాడికి పోట్లాటలు ఉండవు. మెలకువతో, జాగ్రత్తగా ఉండేవాడికి భయం ఉండదు.)

గీతే వాద్యే తథా నృత్యే సంగ్రామే రిపు సంకటే ।

ఆహారే వ్యవహారే చ త్యక్తలజ్జా సుఖీ భవేత్ ॥

(సంగీతం పాడడం, వాయిద్యములు వాయించడం, నాట్యం చెయ్యడం మొదలైన కళలను నేర్చుకునేటప్పుడు, సాధన చేసేటప్పుడు; శత్రువులతో యుద్ధం చేస్తున్నప్పుడు; భోజనం చేస్తున్నప్పుడు; వ్యవహారాలు కుదుర్చుకునేటప్పుడు - బిడియపడనివాడు, మొహమాటపడనివాడు సుఖపడడమే కాక ఆయా విద్యలలో మరింతగా రాణించగలుగుతాడు.)

నరస్యాభరణం రూపం రూపస్యాభరణం గుణమ్ ।

గుణస్యాభరణం జ్ఞానం జ్ఞానస్యాభరణం క్షమా ॥

(నరులకు రూపమే ఆభరణం. రూపానికి ఆభరణం సుగుణం. ఆ గుణానికే అలంకారం జ్ఞానం. ఆ జ్ఞానానికి అలంకారం సహనం.)

కాకః కృష్ణః పికః కృష్ణః కో భేదః పికకాకయోః ।

వసంత సమయే ప్రాప్తే కాకః కాకః పికః పికః॥

(కాకి, కోకిల రెండూ చూడడానికి నల్లగానే ఉంటాయి. అయితే వాటి మధ్య తేడా ఏమిటి? వసంతఋతువు వచ్చినప్పుడు వాటి మధ్య తేడా ఇట్టే తెలిసిపోతుంది. అదే విధంగా మంచివారికి, చెడ్డవారికి మధ్య తేడా కూడా ఇట్టే తెలిసిపోతుంది.)

చితా చింతా ద్వయోర్మధ్యే చింతానామ గరీయసీ ।

చితా దహతి నిర్జీవం చింతా ప్రాణయుతం వపుః ॥

(చిత అంటే నిప్పు. చింత అంటే దిగులు. చిత, చింత అనే ఈ రెండుమాటలలో చింతయే పెద్దది. చిత ప్రాణం లేనిదాన్ని కాలిస్తే, చింత ప్రాణమున్న మనిషినే దహించి వేస్తుంది.)

ఉత్సాహః సాహసం ధైర్యం బుద్ధిశ్శక్తిః పరాక్రమః ।

షడేతే యత్ర తిష్ఠంతి తత్ర దేవోఽపి తిష్ఠతి ॥

(ఉత్సాహం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం – ఈ ఆరు గుణములు ఎవరిలో ఉంటాయో వారికి దేవుడు కూడా సహాయపడతాడు.)

సర్వం పరవశం దుఃఖం సర్వం ఆత్మవశం సుఖమ్ ।

ఏతద్ విద్యాత్ సమాసేన లక్షణం సుఖదుఃఖయోః ॥

(మన స్వాధీనంలో లేనిది ఏదైనా సరే దుఃఖాన్నే కలిగిస్తుంది. మన ఆధీనంలో ఉన్నది సుఖాన్ని కలిగిస్తుంది. సుఖదుఃఖాల స్వభావం ఇదేనని తెలుసుకోవలెను.)

పుస్తకేషు చ యా విద్యా పరహస్తే చ యద్ధనమ్ ।

సమయే తు పరిప్రాప్తే న సా విద్యా న తద్ధనమ్ ॥

(పుస్తకంలో ఉన్న చదువు, పరులకు ఇచ్చిన ధనం సమయానికి ఉపయోగపడవు. ఎందుకంటే మనం నేర్చుకుని, ఆకళింపు చేసుకున్న చదువు మాత్రమే మనకు నిజంగా ఉపయోగపడుతుంది. డబ్బు మనదే అయినప్పటికీ అది పక్కవారి చేతిలో ఉన్నప్పుడు మనకు సమయానికి అందక, ఉపయోగపడకపోవచ్చు.)

దరిద్రాయ కృతం దానం శూన్యలింగస్య పూజనమ్ ।

అనాథ ప్రేతసంస్కారం అశ్వమేధ సమం విదుః ॥

(దరిద్రుడికి అంటే అవసరంలో ఉన్నవాడికి దానం చెయ్యడం, పూజలే జరుగని ఆలయాన్ని శుభ్రం చేసి మళ్ళీ పూజాపురస్కారాలు జరిపించడం, దిక్కులేని శవానికి అంతిమ సంస్కారాలు చేయడం, అశ్వమేధయాగానికి సమానమవుతాయి.)

స్వగృహే పూజ్యతే మూర్ఖః స్వగ్రామే పూజ్యతే ప్రభుః ।

స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥

(మూర్ఖుడు తన ఇంటిలోని వారిచేత మాత్రమే గౌరవించబడతాడు. ప్రభువును అతని గ్రామంలోని వారు మాత్రమే గౌరవిస్తారు. రాజు తన దేశంలో మాత్రమే గౌరవించబడతాడు. కానీ విద్వాంసుడు, అంటే పండితుడు, అన్ని ప్రదేశాలలోనూ గౌరవాన్ని పొందుతాడు.)

కర్తవ్యమేవ కర్తవ్యం ప్రాణైః కంఠగతైరపి ।
అకర్తవ్యం న కర్తవ్యం ప్రాణైః కంఠగతైరపి ॥

(ప్రాణం పోయే పరిస్థితి వచ్చినా మన కర్తవ్యాన్ని చేసి తీరవలెను. అలాగే కొన ఊపిరితో ఉన్నా చేయరాని పనిని చెయ్యకూడదు.)

శరది న వర్షతి గర్జతి వర్షతి వర్షాసు నిఃస్వనో మేఘః ।
నీచో వదతి న కురుతే వదతి న సాధుః కరోత్యేవ ॥

(శరత్కాలంలో మేఘాలు ఉరుముతాయి. కానీ ఆ మేఘాలు వాన కురిపించవు. వర్షాకాలంలో మేఘాలు ఉరమకుండా, నిశ్శబ్దంగా వర్షిస్తాయి. అదే విధంగా నీచుడు మాట్లాడతాడు కానీ పని చేయడు. సజ్జనుడు పనిచేస్తాడు కానీ మాట్లాడడు.)

ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః ।
న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖే మృగాః ॥

(మెలకువతో, ఒళ్ళుదాచుకోకుండా, శక్తికొద్దీ ప్రయత్నించి, పనిచెయ్యడం ద్వారా మాత్రమే పనులు సాధించబడతాయి. మృగరాజే అయినా నోరు తెరుచుకుని నిద్రపోయే సింహం నోటిలోకి మృగాలు వచ్చి దూరవు కదా!)

అగ్నిహోత్రం గృహక్షేత్రం గర్భిణీం వృద్ధబాలకౌ ।
రిక్తహస్తే న నోపేయాత్ రాజానం దైవతం గురుమ్ ॥

(యజ్ఞయాగాదులు జరుగుతున్న చోటికి, ఇంటికి, పుణ్యక్షేత్రాలకూ, గర్భిణీస్త్రీలను, వృద్ధులను, పిల్లలను, రాజుగారిని, దేవుణ్ణి, గురువుగారిని చూడడానికి వెళ్ళేటప్పుడు వట్టిచేతులతో పోరాదు.)

అర్థా గృహే నివర్తంతే స్మశానే మిత్ర బాంధవాః ।
సుకృతం దుష్కృతం చైవ గచ్ఛంతమనుగచ్ఛతి ॥

(చనిపోయిన మనిషి సంపదలు అతడి వెంటరాక, ఇంటిదగ్గరే ఆగిపోతాయి. మిత్రులు, బంధువులు స్మశానం వరకే వస్తారు. కానీ మనిషి చేసిన పాపపుణ్యాలు అంటే మంచి-చెడు పనులే అతణ్ణి వదలకుండా వెంటవస్తాయి.)

త్యజేదేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్ ।
గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ।

(నలుగురి బాగుకోసం అవసరమైతే ఒక వ్యక్తిని త్యజించడంలో తప్పు లేదు. గ్రామం బాగుకోసం కొంతమందిని త్యజించడంలో తప్పు లేదు. ఒక గ్రామాన్ని త్యజించడం ద్వారా దేశసంక్షేమాన్ని కాపాడడంలో తప్పు లేదు. తాను నిజమని నమ్మినదాన్ని సాధించడం కోసం ప్రపంచాన్నే ఎదిరించి, త్యజించినా తప్పు లేదు.)

న త్వహం కామయే రాజ్యం న స్వర్గం నాపునర్భవమ్ ।

కామయే దుఃఖ తప్తానాం ప్రాణినామార్తినాశనమ్ ॥

(ఓ భగవంతుడా! నా కెటువంటి సామ్రాజ్యమూ అవసరం లేదు. ఏ స్వర్గసుఖాలూ అక్కర లేదు. పునర్జన్మల నుండి తప్పించుకోవాలని నేననుకోవడం లేదు. కానీ సర్వజీవరాశుల దుఃఖాలన్నీ అంతం కావాలని నేను కోరుకుంటున్నాను.)

ఉద్యోగినం పురుష సింహముపైతి లక్ష్మీ

దైవేన దేయమితి కాపురుషా వదంతి ।

దైవం నిహత్య కురు పౌరుషమాత్మ శక్త్యా

యత్నే కృతే యది న సిధ్యంతి కోఽత్ర దోషః ॥

(కష్టపడి పనిచేసే వారికే అదృష్టం కలసి వస్తుంది. విధిని నిందించేవారు పిరికివారు. విధిని ఎదిరించి పౌరుషంతో, స్వశక్తితో పని చెయ్యాలి. ఇలా చేసినప్పటికీ ఫలితం రాకపోతే మన దోషం ఏముంది?)

అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసామ్ ।

ఉదార చరితానాం తు వసుధైవకుటుంబకమ్ ॥

(సంకుచిత మనస్కులు ఇతడు మనవాడు, అతడు పరాయివాడు అని లెక్కలు కడతారు. కానీ విశాల హృదయులకు ప్రపంచమంతా తమ కుటుంబమే.)

అర్థానాం ఆర్జనే దుఃఖం ఆర్జితానాం చ రక్షణే ।

ఆయే దుఃఖం వ్యయే దుఃఖం ధిక్! అర్థాః కష్టసంశ్రయాః ॥

(ధనం సంపాదించడం ఎంతో కష్టం. అలా సంపాదించిన ధనాన్ని నిలుపుకోవడం మరింత కష్టం. పైగా అది ఏదో ఒక రోజున పోక మానదు. ధనం రావడమూ దుఃఖమే, పోవడమూ దుఃఖమే. అలా అన్నివిధాలా కష్టాలనే కొనితెచ్చే ధనం గురించి వెంపర్లాడడం తెలివితక్కువతనం కాదా!)

కో హి భారః సమర్థానాం కిం దూరం వ్యవసాయినామ్ ।

కో విదేశః సువిద్యానాం కః పరః ప్రియవాదినామ్ ॥

(సమర్థులకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. కష్టపడి పనిచేసే వారు ఎంతపనైనా లెక్క చెయ్యరు. బాగా చదువుకున్న వారికి ఏ చోటు అయినా ఒకటే. మంచిగా మాట్లాడేవారికి శత్రువులు ఎవరు ఉంటారు?)

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।

యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్ర అఫలాః క్రియాః ॥

(ఎక్కడయితే స్త్రీలు గౌరవించబడతారో ఆ ప్రదేశంలో దేవతలు సంతుష్టులై ఉంటారు. ఎక్కడ అయితే అలా గౌరవింపబడరో అక్కడ జరిగే అభివృద్ధి ప్రయత్నాలన్నీ వృథా అవుతాయి.)

భర్తృహరి సుభాషితములు

(ప్రతి శ్లోకమునకు తరువాత, దానికి అనువాదంగా ఏనుగు లక్ష్మణకవిచే రచించబడిన తెలుగు పద్యము, దాని తర్వాత భావము ఇవ్వబడ్డాయి.)

నీతిశతకము

1. హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా
హ్యర్థిభ్యః ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరాం ।
కల్పాన్తేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమంతర్ధనం
యేషాం తాన్ప్రతి మానముజ్ఝత నృపాః కస్తైః సహ స్పర్ధతే ॥

హర్తకుఁ గాదు గోచర మహర్నిశమున్ సుఖపుష్టి సేయు స
త్కీర్తి ఘటించు విద్యయను దివ్య ధనం బఖిలార్థికోటికిం
బూర్తిగ నిచ్చినన్ బెరుఁగుఁ, బోదు యుగాంతపువేళనైన, భూ
భర్తలు తద్ధనాధికులపట్టున గర్వము మాను టొప్పగున్.

(విద్య అనే ధనము దొంగలకు కనిపించదు; రాత్రింబవళ్ళూ సుఖాన్ని పెంచుతుంది. మంచి పేరును తెచ్చి పెడుతుంది. అడిగినవారికి ఎంత ఇచ్చినా తరిగిపోక, వృద్ధి చెందుతూనే ఉంటుంది. ప్రళయకాలంలోనైనా నశించదు.)

2. కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలా
న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః ।
వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయంతేఽఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్ ॥

భూషలుగావు మర్త్యులకు భూరిమయాంగద తారహారముల్,
భూషితకేశపాశ మృదుపుష్ప సుగంధ జలాభిషేకముల్
భూషలుగావు, పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్రవాణి, వా
గ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించునన్నియున్.

(మనుష్యులకు జుట్టు, పూలమాలలు, పరిమళస్నానాలు అలంకారాలు కావు. పవిత్రమైన వాక్కులే మనిషికి అలంకారాలు. వాక్కు అనెడి ఆభరణమే నిజమైన ఆభరణం. తక్కినవన్నీ నశించిపోయేవే.)

3. విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం
విద్యా భోగకరీ యశః సుఖకరీ విద్యా గురూణాం గురుః ।
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః ॥

విద్య నిగూఢగుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుఁడున్
విద్య విశిష్టదైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్
విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాడు మర్త్యుడే.

(మనిషి నేర్చుకున్న విద్యయే అతడికి దాచిపెట్టుకున్న సొమ్ములాంటిది. అదే అతణ్ణి రూపుదిద్దేది. అతడికి కీర్తిని, సౌఖ్యాన్ని తెచ్చి పెట్టేది. విద్యయే గురువు. అదే విదేశాలలో అతణ్ణి బంధువులా ఆదుకునేది. విద్యే దైవం. ఈ లోకంలో విద్యకు సమానమైన ధనం లేదు. విద్య రాజులచేత పూజించబడుతుంది. కాబట్టి విద్యలేనివాడు పశువుతో సమానం.)

4. దానం భోగో నాశస్తిస్రో గతయో భవన్తి విత్తస్య ।
యన్న దదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి ॥

దానము భోగము నాశము
పూనికతో మూఁడుగతులు భువి ధనమునకున్,
దానము భోగము నెఱుఁగని
దీనుని ధనమునకు గతి తృతీయమే పొసఁగున్.

(దానం, ఖర్చు (భోగం), నాశనం అనే మూడు మార్గాలలో ధనం ఏదోవొక మార్గంలో పోవలసిందే. పిసినిగొట్టువాడు దానం చెయ్యలేడు. ఖర్చుపెట్టి తానయినా అనుభవించలేడు. అటువంటి వాడి డబ్బు నాశనమయిపోతుంది.)

5. లోభ శ్చే దగుణేన కిం? పిశునతా యద్యస్తి కిం పాతకైః?
